అభ్యుదయ



ఆంధ్ర సాహిత్యాభ్యుదయానికి
నవోదయ రేఖలుదిద్దిన ఉత్తమ నవల—

ప్రజల స్వాతంత్ర్యేచ్ఛనూ
జా తీ యో ద్య మ ప్ర భా వా న్ని
ప్రతిబింబించిన జీవితచిత్రం—

* * *

'మా ల ప ల్లి'

ర చ యి త

శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు

* * *

అందమైన బైండుతో—ఆర్టు ప్లేటుతో

త్వ ర లో వె లు వ డు తుం ది

మీ ప్రతులకు ఇప్పుడే ఆర్డరు బుక్ చేసుకోండి!

వెల **8—0—0**

ప్ర తు ల కు :


యూనివర్సల్ ప్రింటర్సు

గ వ ర్న రు పే ట : బె జ వా డ

అభ్యుదయ

సచిత్ర సాహిత్య మాసపత్రిక

సం ౨, సంచిక ౧ అక్టోబరు, 1947



' బుద్ధ దేవుని కరుణా ప్రపూర్ణమైన శాంత్యహింసా [illegible] మాశాంతములకు
పంచిపెట్టిన కరుణా తపస్వి, [illegible] దివ్యదీధితి— "

సంపాదకీయం బాపూజీ జయంతి

ప్రప్రథమంగా విముక్త భారతదేశంలో బాపూజీ జన్మదినోత్సవం జరుపుకున్నాం. ఏ ఆనందంతో, ఏ వుత్సాహంతో, ఏ ఏయే ఆశలతో, అభిలాషలతో భారతీయ హృదయపీఠాన్ని అధివసించిన బాపుజీ జన్మదినోత్సవం జరుపుకోవాలని ఆకాంక్షించామో, అది ఆ రూపంలో జరుపుకోలేకపోయాం. ఎందువల్ల ? సామ్రాజ్యవాదులకు ఆయువుపట్టుగావున్న సంస్థానాధికారాలలాగే వున్నాయి. దాస్యభావాలతో సామ్రాజ్యవాదుల జోహుకుముల్లా పనిచేసిన అధికారవర్గం ప్రభుత్వ కీలకస్థానాల్లో ఇంకా అల్లానే వుంది. మతావేశాలతో, కులతత్వాలతో, మనస్పర్ధలతో పెంచి పోషించిన మనస్తత్వంగల సైనికాధికారం అల్లానేవుంది. గత చరిత్ర లోతుల్లోని హిందూ మహమ్మదీయ ద్వేషానలాన్ని రెచ్చగొట్టిన కుటిల సామ్రాజ్యవాదుల పోకడలతో పరుగిడుతున్న మతోన్మాదులు, భారతజాతీయ హృదయాన్ని రెండుగా చీల్చి రక్త స్రవంతులు ప్రవహింపజేస్తున్న దృశ్యాలల్లానే వున్నాయి. ఇన్నింటిమధ్య భవిష్య ద్భారతదేశాన్ని సుఖమయం చేయాలన్న సత్సంకల్పంతో స్వాతంత్ర్యారాధకులకు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కుటిల రాజనీతిజ్ఞతను విపులీకరిస్తూ మతోన్మాదుల మారణ హోమాగ్నిని చల్లార్చే సంకల్పంతో భారతజాతికి తన జీవితాన్నంకితం చేసిన బాపూజీ జన్మదినోత్సవాన్ని ఆయన ఆసించే జాతీయ జీవితాన్ని నిర్మించే ప్రోత్సాహదినంగా మనం ఎంచుకోవాలి. ఒక వ్యక్తి మరో వ్యక్తిని ఒకజాతి మరో జాతిని దోపిడి చేసే విధానం ఉన్నంతకాలం సామాన్య పౌరజీవితం సహితం భగ్నం చేయబడుతూనే వుంటుంది. మనకి సమాజంపై, దాని నిర్మాణంపై స్పష్టమైన అభిప్రాయాలుండాలి. అప్పుడే మనకృషి సంఘజీవితంలో మన బాధ్యత నిర్వహించుకొనేలా తోడ్పడుతుంది. దరిద్రం, అజ్ఞానం, అమాయకత్వం, అవిద్యలతోకూడిన సామాన్య మానవుల్లో - సంస్థానాధిపతులు, పారిశ్రామికాధిపతులు, ధనవంతులు, తమ స్వలాభాలకోసం తమను పాలించి పెంచిన సామ్రాజ్యవాదుల సలహాలతో - మతోన్మాదాన్ని పెంచి, తమ నిలకడకై ఎన్నెన్నో పన్నాగాలు పన్నుతున్నారు. ఆ పన్నాగాలనుంచి సామాన్యపౌరుడు తప్పించుకొంటేనేగాని, అతనిబాధలు తీరవు. అతనికి విద్యకావాలి; మంచిచెడ్డ అనే విచక్షణా జ్ఞానం పెరగాలి: ఇవి సమకూరాలంటే సామాన్యపౌరునికి జీవితంలో విశ్రాంతి కావాలి - అంటే పనికాలం నియమితం కాబడాలి; విద్యాసౌకర్యాలు చేకూర్చబడాలి!

సాంఘిక సంబంధమంటేనే సమిష్టిబాధ్యత. ఈ సమిష్టి జీవితబాధ్యతకు కట్టుబడకుండా వుండడమే వ్యక్తి స్వాతంత్ర్యమన్న అభిప్రాయాన్ని తొలగించాలి. సంపూర్ణ మానవత్వాన్ని కలిగిఉండడమే సంపూర్ణ స్వాతంత్ర్యం. ఈ స్వాతంత్ర్య భావాన్ని నెల

కొత్త కృషే బాపూజీ ఆశించిన సోదరప్రేమను పెంచుతుంది: సమిష్టి బాధ్యతను నిర్వహించే చైతన్యం పెంపొందిస్తుంది. ఈ కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి బాపూజీ కృషిని ఆదర్శంగా తీసుకోవాలి; ఈనాటి కల్లోల భారతజీవితాన్ని శాంతిపూరితం చేసే చైతన్యవంతమైన సమిష్టి సాంఘిక నిర్మాణ బాధ్యతగా పెంపొందించాలి. ఇదే, బాపూజీ జన్మదినోత్సవాదేశం. ఈ ఆదేశం, ఒక వ్యక్తిని మరో వ్యక్తీ, ఒక జాతిని మరో జాతీ దోపిడీచేయని వ్యవస్థానిర్మాణానికి, బాటలు వేస్తుంది. ఇదే మన ఆశలకు అభిలాషలకు రూపురేఖలు దిద్దుతుంది!

'కవికోకిల' దువ్వూరి

ప్రకృతి తత్వాన్నీ మానవత్వాన్నీ ఉపాసించి, నవ్యాంధ్ర కవితా రంగంలో ప్రజాజీవితాన్నీ వివిధ మానవ ప్రవృత్తులనూ చిత్రించి, అభ్యుదయ ధోరణులకు దారి తీసిన 'కవికోకిల' శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారు **11-9-47** రాత్రి **12** గంటలకు పరమపదించారు. శాస్త్ర విజ్ఞానం, కళా సంస్కృతులూ, బహు భాషాభిజ్ఞత, అభ్యుదయ దృక్పథం—ఇన్నీ పుంజీభవించిన 'కవికోకిల' అస్తమయం ఆంధ్రజాతికి తీరని కొరత. ఏమైనా, ఆయన మనకు మళ్లీ కనిపించకుండా పోయారు.

కాని, ఆయన సాహిత్యరంగంలో ఏ మహదాశయంకోసం కృషిచేసారో ఆ మహదాశయం మనకు మిగిలివుంది; ప్రకృతినీ జీవితాన్నీ సమన్వయించుతున్న ఆయన కళా ఖండాలు మన కళ్ళయెదుట వున్నాయి—కవికోకిల ఆత్మ సజీవంగా చిరంజీవిగా మనల్ని అభ్యుదయ పథాన ముందుకు ప్రోత్సహిస్తూవుంది.

ఆయన నిర్యాణానికి సంతాపభారంతో క్రుంగిపోతున్న ఆంధ్రజాతికి, ఇదొక్కటే, భవిష్యత్తును ఆశాపులకితం చేస్తున్నది.

చిత్రకారుడు-నడిపల్లి శంకర్

ఈ సంచిక ముఖచిత్రంగా ప్రచురించబడిన మాక్సిం గోర్కీ చిత్రాన్ని వ్రాసిన చిత్రకారుడు శ్రీ 'శంకర్' గారు. ఆయనది బెజవాడ దగ్గర ఓ చిన్న పల్లెటూరు. ఆయన బందరు జాతీయకళాశాలా విద్యార్థి వయస్సు 18 సంవత్సరాలు. కేవలం ఇంత చిన్నవయస్సులో ఇమిడే కొద్ది అనుభవంలో ఆయన ప్రదర్శిస్తున్న కళాప్రతిభ ప్రశంసాపాత్రమైనది.

గాంధీజీ!

గాంధీజీ! గాంధీజీ!
స్వాతంత్ర్యం సాధించిన నవభారత దేశంలో,
మీ యీ తొలిజన్మదినోత్సవ సందర్భంలో;
మీకై మే మర్పించే, నీరాజనమిదిగో! గాంధీజీ!

మతద్వేషపు హోమంలో దేశమ్మే మసియైతే,
శరణార్థుల రక్షణకై, శాంతి స్థాపనకై,
కృషిచేసే, వ్యథపొందే, మీ యార్ద్రపు హృదయానికి
జోహారులు ఇవిగోనూ! గాంధీజీ!

సౌహార్దం, సమభావం, సౌభాగ్యం, సమరసమూ,
సాధించే యత్నంలో, మీ పదముల యొరవడిలో,
వెనువెంటనె వస్తామూ;
వెన్నియ్యకె యుంటామూ! గాంధీజీ...

సమకాలపు సంపదకై
ఉత్సాహం ఉప్పొంగే,
చిరజీవన మాశించే,
మా అంజలు లివిగోనూ! గాంధీజీ

— జాస్తి సీతారామదాస్

‘మాభూమి’ చర్చ

‘మాభూమి’ సమీక్ష, చర్చ కొందరిలో అపోహకూ ఆందోళనకూ కారణమైంది. ఇది ఘన ఉద్యమ భవిష్యత్తుకూ శ్రేయస్సుకూ మంచిదికాదు. కనుక, చర్చను ఇంతటితో నిలిపివేసి, ఈ విషయాన్ని కార్యవర్గానికి వదలి పెడుతున్నాం.

—కార్యదర్శి

వినాయకరావుగారి రాజీనామా

కార్యదర్శి ప్రకటన

" 'మాభూమి' నాటక సమీక్షపర్యవసానంగా చెలరేగిన విమర్శా పరంపరల సందర్భంలో అభ్యుదయ పత్రిక త్రొక్కిన పంథా ఆక్షేపణీయమైనదనీ, అభ్యుదయ సంపాదక వర్గం, సమిష్టి బాధ్యతకు కట్టుబడక పోవుట శోచనీయమనిన్నీ, అభ్యుదయలోని నిష్ప్రయోజనకరమైన మీమాంస వ్యక్తిగత ద్వేషాలను రగుల్చుటకే సహాయకారి కాగలదనీ, సోదర సంపాదకులతో అతి ప్రధానమైన అభ్యుదయ సాహిత్యమూలసూత్రాలపై తమకు అభిప్రాయ భేదం తీవ్రతరమై దృక్పథ వైవిధ్యం ఏర్పడటంచేత, అభ్యుదయసంపాదక వర్గానికి రాజీనామానిచ్చినట్లు శ్రీ కొమ్రాజు వినాయకరావు గారు తెలియజేస్తున్నారు." — ప్రజాశక్తి 14-9-47

శ్రీ వినాయకరావు గారు 'అభ్యుదయ' సంపాదక వర్గంనుంచి రాజీనామా ఇచ్చినట్లుగా పైవార్త ప్రజాశక్తిలో ప్రచురించబడింది. కాని, ఆయన రాజీనామా లేఖ వేరు విధంగా వుండడంవల్ల మాత్రమే, ఆ లేఖను యధాతధంగా ఈ క్రింద ఇస్తున్నాం.

" 'అభ్యుదయ' సంపాదకులకు, ఆర్యా, 'మాభూమి' నాటకసమీక్ష పర్యవసానంగా చెలరేగిన విమర్శా పరంపరల, తర్జన భర్జనల సందర్భంలో, అభ్యుదయ పత్రిక త్రొక్కిన పంథా ఆక్షేపణీయమైంది. అభ్యుదయ సంపాదకవర్గం సమిష్టి బాధ్యతకు కట్టుబడక పోవడం శోచనీయము. నిరుపయోగమూ, నిరర్థకమూ, నిష్ప్రయోజనమూ అయిన ఈ మీమాంస ఉభయ పక్షముల వారి వ్యక్తిగతమదమాత్సర్య విద్వేషాగ్నులను మరింత రగుల్చుటకే సహాయకారి కాగలుగుతూంది. ఇది ఎంతైనా సిగ్గుచేటైన పరిస్థితి అనక తప్పదు!

"అభ్యుదయ సంపాదక వర్గంలో ఒకడనైన నాకు సోదర సంపాదకులతో అతి ప్రధానమైన అభ్యుదయ సాహిత్యమూల సూత్రాలపైన అభిప్రాయభేదం తీవ్రతరమై దృక్పథ వైవిధ్యం ఏర్పడ్డం చేత నేను అభ్యుదయ సంపాదకవర్గం నుండి విరమించుకోడానికి నిశ్చయించాను. నారాజీనామా అభ్యుదయ సంపాదకులకు అంగీకృతమని ఆశిస్తున్నా. 8-9-47"

రాష్ట్ర కార్యవర్గం ఈ విషయం చర్చించి ఒక నిర్ణయానికి వస్తుంది

మాక్సింగోర్కీ ఆదర్శం

ఛార్లెస్ ఆరగాన్

★

ఇది ఫ్రెంచి విజ్ఞానవేత్తల మహాసభా సందర్భంలో ఛార్లెస్ ఆరగాన్ వ్రాసిన వ్యాసం. ఆరగాన్ ప్రపంచంలోని సుప్రసిద్ధ రచయితల్లో ఒకరు; ఫ్రెంచి మహాకవి.

★

ఆయన మనకు కనిపించకుండా పోయి పదేళ్లయింది. ఆందోళనతో కూడిన ఆ టెలిగ్రాము నన్ను లండన్ నుంచి ఆదుర్దాగా తీసుకొచ్చి పదేళ్లయింది. నన్ను తీసుకొస్తున్న ఆ ఓడ మీదే కూర్చొని "ధనికులు జీవించే దెక్కడ" అనే నా నవల పూర్తి చేసుకుంటున్నాను. నృత్యగానాలతోను అన్యోన్యతతోను ఆ ఓడ కళకళలాడుతున్నది. అలాంటి ఓడలో అంతకు ముందు నేనెన్నడు ప్రయాణం చెయ్యలేదు. గోర్కీ సొంత మనుషులు- ఏ మనుషుల నుంచి ఆయన వచ్చాడో, ఆయన మహత్తర రచనలన్నిటా ఏ మనుషులు నిండిపోయారో- ఆ మనుషులే ఉత్తర సముద్రం బాల్టిక్ సముద్రం మీదుగా, మమ్మల్ని ఆయన చనిపోయే ఆఖరు క్షణానికి ఆయన దగ్గరకు తీసుకెళ్ళారు. వర్గ విభేదాన్ని పటాపంచలు చేసే ఆ దీర్ఘమైన మెత్తని రాత్రుల్లో, ఆ సముద్రమూ, ఆ



సంగీతమూ అమర జీవియైన ఆయన్ను జీవంతో వుండగా మరోమారు దర్శించాలనే మా ఆదుర్దానూ మమ్మల్ని మోసుకొచ్చాయి. ఎల్సారచన ప్రారంభింపజేసినవాడు గోర్కీ; ఇక నా విషయంలో........

ఇంత వరకెన్నడూ చెప్పని ఒక విషయం ఇప్పుడు ఒప్పుకుంటున్నాను. సాహిత్యదృష్ట్యా అయితే గోర్కీ ప్రభావం నా మీద పడలేదు. కాని, సాహిత్యంకంటె భిన్నమైన, ఎంతో అగాథమైన నా జీవితం మీదే ఆయన ప్రభావం పడింది. మనశిరస్సులమీద నీడలు పరిచే మహావటవృక్షంలా, ఆయన నాపైన ఉన్నతంగా ఎక్కడో ఎత్తున నిలిచాడు. ఆనీడలో ఎంతో కాలం అలాగే మథనపడుతూ నిలబడ్డాను. రచయితఅయినగోర్కీలో ఒక విశిష్టమైన గుణంవుంది. దాన్ని నేను ఎన్నటికీపొందలేను. ఎవ్వరూ దాన్ని అనుకరించలేరు. ఆగుణమే ఆయనకు, ఆయన జీవించి వుండగానే, అమరత్వం ప్రసాదించింది. తన ప్రజలతో తాను పూర్తిగా ఖచితంగా ఒక్కటై పోవడమనేదే ఆయనలోని ఆ విశిష్టగుణం. ప్రపంచంలో మరే జాతికూడా, ఆజాతిలోనుంచి జాతియొక్క స్థాయితో సరిసమానంగా పెంపొందినవ్యక్తిని చూడడానికి నోచుకోలేదు. గతాన్నీ భవిష్యత్తునూ శతాబ్దాల గతచరిత్రనూ కొత్తకొత్తగా రేకెత్తే జీవితాశలనూ ఆ ముదుసలి చేతుల్లో పట్టుకొని, రష్యానుంచి గోర్కీ ఒక్కడే అలాంటి మహావ్యక్తి తలెత్తాడు. పురాతన రష్యన్ సాహిత్య ప్రపంచాన్నంతటినీ, ఆ పురాతన జానపద గీతాల్లోని ప్రజలనూ, ప్రపంచాన్నీ కూడా, గోర్కీ తనతోపాటు చారిత్రక మహాప్రస్థానంలోకి తీసుకొచ్చాడు. వాటి నన్నిటినీ తనలో ఇముడ్చుకున్నాడు; ముందుకు సాగిపోయాడు. కాప్రీలోను, బెర్లిన్‌లోను ఆయన చుట్టూ మూగిన ఆవేశపరులైన పరాధీన ప్రజానీకంలాగే, అదంతా ఒక వింత ప్రపంచం; అప్పుడే కన్ను విచ్చిన ప్రజాస్వామికంలో అప్పుడప్పుడే కొత్త సంస్కారం పొందుతున్నది. అద్భుత రసావేశంతో కూడిన అనేక పాత్రలను గోర్కీ

చిత్రించాడు. ఆ యా వైపరీత్యాలను ఎత్తిచూపడంకోసమే ఆయన ఆ పాత్రలను స్వీకరించాడు. ఈ విషయంలో గోర్కీ ఎంత శ్రద్ధాసక్తులు చూపించాడో మనం తెలుసుకోవాలి. ఆయన ఈజగత్తునంతా తనలో జీర్ణించుకొని, ఇంకా ఇంకా ముందుకు నడిచాడు. రష్యాలో అనేక సంఘటనలూ, నిత్యం కనిపించే అనేకదృశ్యాలూ వుండడం వల్లనే గోర్కీ అలా వ్రాయగలిగాడని మనం సంతృప్తి పడడం పొరపాటు. శిథిలమై ఛిన్నాభిన్నమై గాలిలో తేలిపోతూ, వాస్తవికత్వానికిపూర్తిగా దూరమై పోయినట్లు తెలుసుకోకుండావున్న ప్రపంచం మధ్యనే, మనం కూడా, గోర్కీ లాగే, జీవిస్తున్నాం గదా?

ఇక్కడ నేను విషయంవదిలేసి మాట్లాడుతున్నాను. ఒక సత్యం ఒప్పుకునే భావాంచలంపై నడుస్తున్నాను.

నేను మొట్ట మొదటిసారి గోర్కీని చూసేనాటికి, నాచుట్టూ ఉన్న సంఘం చాలాకల్లోలస్థితిలో వుంది, అది అనేక మూఢవిశ్వాసాలతో నీలి మబ్బులు కమ్ముకున్న ప్రపంచం; ఒకవైపు మతమౌఢ్యం తోను, మరో వైపు మానవత్వం తోనూ రెండుగా చీలిపోయిన ప్రపంచం. ఇందులో నా పక్షమేమిటో నేను అప్పటికే నిర్ణయించుకున్నాను. కాని, నన్నూ, నా తరం రచయితలందర్నీ ఒక భయం ఆవహించి నవలలు వ్రాయకుండా చేసింది. అప్పటికే ఫాసిస్టుకుట్రలు జరుగుతున్న పారిస్ పట్టణంలో మా చుట్టూ వున్న ఆ కృత్రిమ వాతావరణంలో, తన మానవత్వాదర్శానికి దూరం కాకుండా ఎవ్వడూ నవల వ్రాయలేడని నమ్మడమనేదే ఒక రకం గొప్ప. మిన్ను విరిగి మీద పడుతుందంటే మన పూర్వులు ఎంత భయపడే వారో, నవల వ్రాయడమంటే మాకు అంతభయం. నేను ఇక్కడ మన అల్పత్వాన్ని గురించిన చరిత్ర చెప్పడం లేదు- కాని; ఇక్కడ నేను నొక్కి- చెప్ప దలచుకున్న దేమిటంటే- గోర్కీ నవలల వల్ల మాత్రమేకాక, సాటిలేని ఈ మహా వ్యక్తి, నూతన జగత్తు ముఖద్వారంలో నిలచిన ఈయుగపురుషుడు,

గోర్కీ వాటిని వ్రాయడం వల్ల నాలో వచ్చిన మార్పు; మనమందరం ఎన్నాళ్లనుంచో అంటి పెట్టుకొని వున్న సంకోచాలను, అదే, నాలోనుంచి పటాపంచలుచేసింది. నేను లండన్ నుంచి లెనిన్‌గ్రాడ్ పోతూ, త్రోవలో పడవ లో పూర్తిచేసిన నా రెండవ నవలకు 'ధనికులు జీవించే దెక్కడ?' అని పేరు పెట్టుకున్నాను. అది 'అధోలోకపు టగాధాలు' అన్న గోర్కీ నవలకు త్రిప్పి చూస్తే, నిజంగా నా ప్రతిధ్వని. ఇంకా ఎక్కువ వివరాల్లోకి పోతున్నట్లనిపిస్తుంది. కాని, ఒకరి మీద మరొకరి ప్రభావం పడడమనేది చాలా తమాషా విషయం. సూటిగాను, ప్రత్యక్షంగాను పడే ప్రభావం మాత్రమే సర్వదా బలవత్తరమైంది కాదు.

1934 లో సోవియట్ రచయితల కాంగ్రెస్ జరిగినప్పుడుకూడా గోర్కీ రష్యన్ మధ్యయుగపు కవిత్వంలోను, టెంటాగెల్‌కూ ప్రిపెట్‌కూ వున్న మాత్రం భేదంతో మన రౌండ్ టేబుల్ దొరలలాంటి రష్యన్ పురాణవీరులగాథలలోను మునిగి వుండడం చూస్తే నాకు ఆశ్చర్యం వేసింది. కవిత్వంలో ఉండే దేశిసంప్రదాయం గోర్కీకి బాగా తెలుసు; అనాదిగా వున్న జాతి గతచరిత్ర నుంచి తమకు సంక్రమించిన అమూల్యమైన విజ్ఞానానుభవం ఏమిటో ఆయనకు తెలుసు. సోవియట్ సాహితీపరుణ్ణి గురించి మనం ఏర్పాటు చేసుకొనే గుడ్డిఅభిప్రాయాలకు ఆయన ప్రవర్తన పూర్తిగా విరుద్ధంగానడిచింది. రష్యన్ పురాణవీరుల్లను పాశవికంగాను, ఫాసిస్టు స్వరూపంలోను ఒక కవి చిత్రించి, తన వ్యంగ్యరచనను ఆ మహాసభలో చదవడం మొదలెట్టాడు. గోర్కీ ఆ రచనను తీవ్రంగా విమర్శించాడు. అది రష్యాకే అవమానమని, మరి అతన్ని చదవనివ్వలేదు. ఈ సంఘటన నాలో బలంగా నాటుకు పోయింది; గోర్కీ భావపథాన్ని కేవలం సన్నిహితంగా అనుసరించక పోయినప్పటికీ, నాలో అది తీవ్రమైన భావసంచలనం కలిగించింది. ఈ భావసంచలనం నాలో ఎంత ప్రధానమైన మార్పు తెచ్చిందో, ఫ్రెంచి సాహితీ సంప్రదాయాలకు నన్ను ఎంత సన్నిహి

తంగా తీసుకుపోయిందో- ఈ సంగతి నన్నెరిగిన వారందరికీ తెలుసు. ఆ ఫ్రెంచి సంప్రదాయాలే, మూత్రిగట్టి, ఈనాటి నా రచనారూపాల్లో కనిపిస్తాయి. అంతదూరం, గోర్కీ నీడ నామీద పడింది.

బాల్టిక్ సముద్రం మీదుగా మమ్మల్ని తీసుకెళ్లిన ఓడ నృత్యగానాలతో మార్మోగి తేలిపోతున్నది. బహుశః, అదే సమయంలో, రష్యన్ రచయితల్లోకల్లా అచ్చమైన రష్యన్ రచయిత అతి ప్రమాదపరిస్థితిలో ఉండిఉంటాడు. ఆయన ఇంకా జీవితంతో ఉండగా మనం చూడగలమా? అని అక్కడ పాడుతున్నవారిని అడిగాం. ఆయన చనిపోయినట్లయితే ప్రపంచానికి తీరని కొరత ఏర్పడుతుంది; ప్రపంచంలో ఒక మహత్తరమైన అధికారవాణి అస్తమిస్తుంది. ఆ గొంతే ఎలుగెత్తి ప్రశ్నించిందొకనాడు: "ఓ కళానిధులారా, మీరెటు పక్షం వున్నారు?" అని.

* * * *

ఆయన జీవించివుండగా చూడడానికి మేము నోచుకోలేదు. ఆయన జీవితం కడపటి రోజుల్లో ఆ చిటచిటలాడే జూన్ మాసపు ఎండల్లో, ప్రభుత్వం ఆయనకిచ్చిన పార్కులోని భవనద్వారం దగ్గరికి చేరుకున్నాం. ఇంకా మేము లోపలికి అడుగు పెట్టలేదు. ఆ చుట్టూ ఆ పచ్చటి తోటనిండా, మా మాదిరిగానే వచ్చిన అనేక కార్లు వేచివున్నాయి. దుమ్ము క్రమ్ముకున్న ఆ ఎదురు రోడ్డున అనేకమంది యువకులూ, యువతులూ ఏమేమో పాడుకుంటూ, ఏవేవో కలలుగంటూ, సరససల్లాపాలతో సాగిపోతున్నారు. మృత్యువుతో జాతి పోరాడుతున్న ఆ భవనం లోపలినుంచి కేవలం ప్రతికూలవార్త వచ్చింది. తలుపు తెరచుకొని డాక్టరు వచ్చాడు. తర్వాత తెలిసింది. మేమూహించినట్లుగా అది మామూలు చావు కాదు; చాలా విషాదకరమైన సంఘటన. ఆ చివరి ఘడియల్లో కలిగిన మా హృదయభారం ఏమిటో మాకిప్పుడు తెలిసింది. మానవుల్లోని వైలక్షణ్యాన్ని ప్రేమించిన ఆ మహావ్యక్తి ఏ ఏ విలక్షణ ప్రవృత్తులు గలవారిని తన చుట్టూ

చేరదీసాడో, ఎవరిపైన తన ఔదార్యం ప్రసరించాడో వాళ్లే, ఆడాట్టరుతో సహా, కుట్రచేసారు; నీచాతినీచమైన ఘోరమైనకుట్ర, కసాయితనం, గోర్కీ చనిపోయాడు. దేశమంతటా ఒక పెద్ద నిట్టూర్పు పొగలు గక్కింది. చుట్టూ పూలతోను, వాడి ఏడుస్తున్న మొక్కలతోను కప్పబడి, నిద్రించే గోర్కీని నేను చూసాను. వృద్ధుడైన ఆమహాపురుషుడు తనతో ఎన్నెన్ని రహస్యాలనో తీసుకెళ్ళాడు. మళ్ళీ కనిపెట్టడానికి కష్టమైన ఆరహస్యాలు కనిపించకుండా పోయాయి. మంచితనంలోని రహస్యం, ప్రజా జీవితం మీద నిరంతర శ్రద్ధాసక్తులలోని రహస్యం, ఒక సరస్సులో తరగ కదలికలను విన్నట్లే వేలకొలది మామూలు మానవ హృదయాల్లోని అజ్ఞాత స్పందనలను వినే ఆ రహస్యం - ఈ రహస్యాలన్నీ ఆయనతోటే మటుమాయమైనాయి. ఆయన ఇతరుల నుంచి సర్వదా అనుభవం పొందుతూ, తన అనుభవాన్ని ఇతరులకు పంచి ఇచ్చిన మానవుడు

ఇదంతా పద్దేళ్లనాటి మాట. కాని ఇంకా మనం ఆయన నీడ క్రిందనే ఉన్నాం. పదిసంవత్సరాల చరిత్ర అనంతరం, ప్రపంచానికి అత్యంత భయంకరమైన పది సంవత్సరాలు గడచిన అనంతరం, ఇంకా ఆయన నీడే మనమీదవుంది. ఇంతవరకూ మనం జవాబు చెప్పని ప్రశ్నయొక్క నీడే ఈ మనమీద పడుతున్నది:— చావులు, వీరత్వాలు, భయంకరమైన బాధలు, నిట్టూర్పులు, నేరాలు; దార్జన్యం రాక్షసత్వం సృష్టించగలిగిన ప్రతిదీ......ఇదేమనం జవాబు చెప్పనిప్రశ్న

"ఓ కళానిధులారా, మీ రెటు పక్షం వున్నారు?"

హంతుడికంటే హంతకుడికి ఎక్కువ ఆదరం చూపబడుతున్నప్పుడు; చిత్రహింసలనుంచి తప్పించుకొని అసహాయంగా నిలబడ్డ జాతులు వాటి కపటస్నేహితుల చేత శత్రువులుగా చూడబడుతున్నప్పుడు, నిన్నటిదాకా రేడియో ఏ పేదప్రజలను గూర్చి తేనెలు కురుస్తూ మాట్లాడిందో. ఆప్రజలే, ఈరోజున కొత్తవేషంలో

వున్న తమ శత్రువు ఇంకా పేద ప్రజలకు వ్యతిరేకంగా, తమ ఆత్మనూ హృదయాన్నీ అమ్ముకోని వారికి వ్యతిరేకంగా జరిపే కుట్రలను పసిగడుతున్నప్పుడు;—ఓ కళానిధులారా!—ఆ ప్రజలు మిమ్మల్ని నమ్ముకున్నారు—మీరూ తామూ కలిసి ఒక్కటై పోవాలని ఆశలు పెట్టుకున్నారు- ఓ కళానిధులారా!—మీరు ఎటు పక్షం వున్నారు? ఈ విజయ కోలాహలంలో మీగొంతు వినిపించటంలేదు.

ఈ మారణయంత్రాలూ, హత్యలూ, వినాశాలూ భూకంపాలలాగా యెలా పెరిగిపోయాయో చూడండి. అవి చేయిదాటి పోయాయి, వూహించడానికి కూడా అతీతమైపోయాయి. జీవితాన్ని యోగ్యంగాచేసే సమస్త వస్తువులూ, జగత్తు కనుగోసల్లో ప్రకాశించే కాంతి రేఖలూ, అనురాగంతో పీల్చే ప్రతి వూపిరీ—సర్వం నాశనమైపోయే ప్రమాదం, ఏనాడూ లేనంత సన్నిహితమై, ఈనాడు నిపిస్తున్నది ఇంతవరకూ, మీరు ఈ వినాశాన్ని విస్మరించేటంత ప్రమాదరహితంగా లేరు. మీరు నివసించిన నరకచ్ఛాయలు ఇంకా మీ ముఖాలమీద తాండవిస్తూనే వున్నాయి. కాల విలంబానికి ఇక వ్యవధిలేదు. ఇక్కడ లెక్కించవలసిన మీనమేషాలేవీ లేవు.

మీరు జవాబు చెప్పకముందే చనిపోయిన ఆ వృద్ధుడు మిమ్మల్ని ఈ ప్రశ్న అడిగినప్పుడే, ముందు ఏమి జరుగనున్నదో, ఆయనకు తెలుసు. ఎన్నడూ, ఎక్కడా, ఏ ప్రజలూ పడని బాధలకు గురైన తన ప్రజల మధ్య ఆయన జీవించాడు. పడగొట్టడం కోసం ఒక పెద్ద అడివిలోని చెట్లన్నిటికీ ఒకేసారి నిప్పు పెట్టినట్టుగా, మృత్యుముఖంలో నిలచివున్న తన కోట్లకొలది ప్రజానీకం మధ్య ఆయన జీవించాడు. ఆయనే మిమ్మల్ని ప్రశ్నించాడు- మీ రెవరి పక్షం వున్నారని. శాంతికాల మహోన్నత పరిశ్రమల మధ్య, అలలలలుగా కదలుతున్న యుక్రేనియన్ పంటపొలాల నడుమ, పెద్ద పెద్ద విద్యుత్కేంద్ర నిర్మాణాల దగ్గిర, నిప్పు లుమిసే తమ గొంతుకలతో

భవిష్యత్తును పలుకరిస్తున్న కర్మా గారాల ఎదుట— ఎంత మహత్తర త్యాగం అనంతరం- నిలబడ్డాడు గోర్కీ! ఏ ప్రజల ఉత్తమ త్యాగ చైతన్యాల ముందు సూర్యకాంతులు సైతం వెలవెల పోయయో ఆ ప్రజల ప్రశాంతగాఢ ప్రేమాను రాగాలతో ఆవృతుడైన మాక్సిం గోర్కీ !—" ఏమి రాబోతున్నదో తెలుసు కున్నాడు. గొంతెత్తి గట్టిగా అడిగాడు - ఎవరి పక్షం? మీరు ఎటు పక్షం వున్నారు? "

నేను ఫ్రెంచివాణ్ణి. ఏదేశం తన ప్రజల నిరంతర తీవ్ర పరిశ్రమల వల్లా; ధైర్యసాహసాలవల్లా, మానవత్వం నించుకున్న వాక్శక్తివల్లా మహత్తరమైనదో; అగాధ సముద్ర గర్భంలోనికి చొచ్చుకొని వున్న ఆ దేశం నుంచి, ఫ్రాన్సు నుంచి, నేను మాట్లాడుతున్నాను. నేను ఫ్రెంచివాణ్ణి. అందుక నే, పారిస్‌లో ప్రారంభం కానున్న శాంతి పట్ల నా బాధ్యత వుంది. కోట్లకొలది మృతుల మధ్య మరణించిన ఆ మహావ్యక్తి ఇప్పుడింకా అడుగ లేని ప్రశ్నను, నే నే గొంతెత్తి అడుగుతున్నాను:

"ఓ కళానిధులారా, మీరు ఎటుపక్షమో ప్రకటించ వలసిన సమయం ఇదే. ప్రపంచంలో శాంతి నెలకొల్పడం కోసం, ఫ్రాన్సుదేశానికి సంప్రదాయ సిద్ధమైన శాంతిస్థాపన కోసం, మానవత్వం నిర్మించబడే శాంతి స్థాపనకోసం-ఇదే సమయం - ఇప్పుడే ఈనాడే తేల్చుకోవాలి — మీ రెటు పక్షం? ఇది ఇవాళే తేలాలి, రేపు కాదు. రే పు కా దు. ఇప్పుడే. తేల్చండి - మీ రెటు పక్షం?"

మనకథల్లో లోపాలు

ఛార్లెస్ హాంబోల్టు

['న్యూ మాసెస్' పత్రికకు ప్రచురణార్థం వచ్చిన కథలను సమీక్ష చేస్తూ, అభ్యుదయ రచనావిధానాన్ని గురించి, ఛార్లెస్ హాంబోల్ట్ వ్రాసిన వ్యాసంలో మొదటిభాగం క్రిందటి సంచికలో ప్రచురించాం. అందులో సాహిత్యంలోని వివిధరీతులనూ మన యువ రచయితలమీద వాటి వాటి ప్రభావాలనూ హాంబోల్టు స్పష్టీకరించాడు. రెండోభాగం ఈక్రింద ప్రచురిస్తున్నాం.]

★

మన విమర్శ ఎక్కువ భాగం రచయితయొక్క రాజకీయ బాధ్యత మీదనే కేంద్రీకరించబడడం వల్ల, అతని ప్రధాన సాధనమైన శిల్పాన్నీ, దాని అవధినీ, అప్పుడప్పుడు విస్మరించడం జరిగింది. రీతి, సంఘటనావైచిత్రి, పాత్రోచితమైన అభినయం యొక్క ప్రాముఖ్యం— ఇవేవో లాక్షణికమైన విషయాలని త్రోసిపుచ్చ గూడదు. హాస్యం, ఊహాచిత్రణ, విస్మయ వైరుధ్యాలు, ఉద్రేకాలు— ఇలాంటి సాహిత్య గౌరవం సమకూర్చే ఉత్తమలక్షణాలన్నిటినీ విడనాడి, అతి సామాన్యమైన దృక్పథంతో విశాలమైన విశ్వ దృక్పథాన్ని త్యజించడానికి మన యువ రచయితలు సిద్ధపడుతున్నారు. కనుక మనం చేసే ప్రతి విమర్శలోనూ— శాస్త్రానికీ కళకూ, ఊహకూ వస్తువుకూ, సాధారణ ప్రవృత్తికీ వ్యక్తిప్రవృత్తికీ, రేఖాచిత్రానికీ రక్తమాంసాలతో కూడిన మానవాకృతికీ ఉన్న వ్యత్యాసం ఏమిటో— మన యువ రచయితలకు విశదీకరించాలి. రాజకీయంగా మనకు తెలిసినంత మాత్రాన, మనం ఏవిషయాన్ని గురించైనా వ్రాయగలమని వారనుకోగూడదు. ఇది ఎంత తప్పుడు కళ అవుతుందో, అంత తప్పుడు రాజకీయం కూడా అవుతుంది. ఈ రెండూ కలిసి రచయిత అధఃపతనానికి దారితీస్తాయి. పాత్రచిత్రణలోను, వాటివాటి అభినయ రీతుల్లోను ప్రదర్శించే విశిష్ట లక్షణాలు ఖచితంగా వుండకపోతే, ప్రతి సంఘటనా అనేక అర్థాలకూ, అపార్థాలకూ గురి అవుతుంది. ఈ విధంగా, తాను చెప్పే విషయంమీద రచయితకు పరిజ్ఞానం లేకపోవడంవల్లా, ఆ చెప్పినవి నినాదాలరూపంలో వుండి వాటి ఆంతర్యం పాఠకుడికి అందకపోవడం వల్లా— అతని రాజకీయాలు తారుమారై పోతాయి. పాఠకుడు, తనకు ఇంతకు ముందే తెలిసిన విషయాలను చిత్రించడానికి మాత్రమే రచయిత ప్రయత్నించాడని అనుకుంటాడు. ప్రచురించబడిన అనేక కథల్లో వస్తువైఖరి వైవిధ్యం వుంది. కాని ఇక్కడ విశేషం ఏమంటే,

అందరియొక్క అభిప్రాయాలు ఊహాకు అందనంత దూరంలో ఉన్నప్పటికీ, ఈ కథల్లోని అభిప్రాయాల్లో మాత్రం వ్యత్యాసం చాలా తక్కువగా కనిపిస్తుంది.

ఈ కథల్లో హాస్యం లోపించిందని చెప్పాను. దాని సాధ్యాసాధ్యాలను వివరిస్తాను. సెనేట్ యొక్క విద్యా, కార్మిక - సమస్యల ఉపసంఘానికి గని పనివారి ప్రతినిధియైన లారెన్సు డయ్యర్ వాఙ్మూలం నుంచి ఉదాహరిస్తాను. కార్మికులు ఒక సంఘంగా ఏర్పడి తమ సమిష్టి క్షేమంకోసం కలిసి కృషిచేసే హక్కును పెట్టుబడిదార్లు భగ్నపరిచారా, లేదా- అనే విషయంమీద విచారణ జరుగుతున్నది. హార్లాన్ ప్రాంతంలో జరిగిన దౌర్జన్యచర్యలనుగూర్చి డయ్యర్ సాక్ష్యం ఇస్తున్నాడు :

డయ్యర్ : ఆఫీసు వదలగానే అధికారి జేమ్సు రైడింగ్సు ఆదుర్దాగాను, ఆందోళనగాను 'పద పోదాం. త్వరగా ర'మ్మని పిలిచాడు. ఇద్దరంవెళ్ళి కారెక్కాం. రైడింగ్సు తన పిస్టల్ తీసుకొని తొడమీద సిద్ధంగా పెట్టుకున్నాడు. "తుపాకీ తీసుకొని సిద్ధంగా ఉండు. వాళ్ళు మనల్ని కాల్చబోతున్నారు." అని నాకు చెప్పాడు. తర్వాత మూడుమైళ్ళు వెళ్ళాక ఒక విరిగిపోయిన కారు కనిపించింది. అది కెప్టెన్ గోల్డెన్ కారు. ముఖంనిండా రక్తంతో ఆయన అక్కడ నిలబడి వున్నాడు.

సెనేటర్ లాఫాలిటీ : కెప్టెన్ గోల్డెన్ అంటే ఎవరు ?

డయ్యర్ ఆయన హార్లాన్ ప్రాంతంలో ఒక లాయరు. అక్కడే పుట్టి పెరిగాడు. అతని కొడుకుకూడా ఇప్పుడు న్యాయవాది వృత్తిలోనే వున్నాడు. సుప్రసిద్ధ న్యాయవాది కూడా. కెప్టెన్ గోల్డెన్ ఆ 'కౌంటీ కి' చుట్టుపట్ల చాలా ప్రముఖమైన వ్యక్తి. విరిగిపోయిన కారు ప్రక్కనే నిల్చున్న ఆయన్ని చూసి మేము ఆగాం. 'మా కారులోకి రా. మేము పెన్‌విల్లీ పోతున్నాం. ర'మ్మన్నాను. 'పెగ్గీ, ఇక్కడ భయంకరమైన ప్రమాదం సంభవించింది. నాతోపాటు ఒక స్త్రీ కూడా వుంది. ఆమెకు విపరీతంగా గాయాలు తగిలాయి. ఆమెను ఇప్పుడా క్రింది ఇంట్లో వుంచాను. నన్నూ, ఆమెనూ, మరి రెండు గుమ్మడికాయలనూ తీసుకెళ్ళడానికి మీ కార్లో చోటుంటుందా?' అన్నాడు కెప్టెన్ గోల్డెన్.

లా ఫాలిటీ ; 'రెండు' ఏమిటి?

డయ్యర్ : 'రెండు' గుమ్మడి కాయలు. 'సరే చోటుంది. ఆమెను తీసుకు ర'మ్మన్నాను.

లా ఫాలిటీ : కూరగాయల సంగతికదూ, అడిగాడు?

డయ్యర్ : అవును. 'వెళ్లి ఆమెను తీసుకు ర'మ్మని నేను చెప్పాను. తీసుకురావడానికై ఆయన వెళ్లిన తర్వాత, రైడింగ్సు 'వద్దు వద్దు, పెగ్గీ, ఆమెను మన కార్లో తీసుకెళ్ళ లే'మన్నాడు. 'ఎందువల్ల'నంటే, 'వాళ్లు ఈ కారునూ ఆమెను కాల్చెయ్యబోతున్నా రన్నాడ 'వాళ్లకు నన్ను కాల్చెయ్య

డానికి ఎంత హక్కున్నదో, ఆమెను కాల్చడానికి కూడా అంతే. కానీ ఆమె కారెక్కబోతున్న" దన్నాను. కుంటుతూ నడుస్తున్న ఆమెను తీసుకొని, రెండు చంకల్లోను రెండు గుమ్మడి కాయలతో కెప్టెన్ గోల్డెన్ వచ్చాడు. ఆ గుమ్మడికాయలనూ, ఆమెను వెనక సీట్లో ఎక్కించి, నేనూ అక్కడే కూర్చున్నాను. కెప్టెన్ గోల్డెన్‌ను డ్రైవరుతో పాటు ముందు సీట్లో కూర్చోబెట్టాను. వాళ్లు మామూలుగా మాటువేసి పొంచుండేచోటికి రాగానే రైడింగ్సు నా వంక తిరిగి 'చూడు చూడు' అన్నాడు. నేను చూసి 'నిజమే' నన్నాను. మామూలుగా మాకోసం వాళ్లు పొంచుండేచోట, ఆ పొదల్లో చెక్ ఉక్ తారిక్సు కారు ఆగి వుంది.

ఇక్కడ ముఖ్యమైంది గుమ్మడికాయల హాస్యం కాదు; సెనేటర్ వేసే యక్ష ప్రశ్నలూ, డయ్యర్ చెప్పే జవాబులూ కూడా కాదు. ఎప్పటికప్పుడు భయంకరంగా కనిపించే ఆ పరిస్థితుల్లో, దక్షిణ దేశపు గనుల్లో పనిచేసే కార్మికనాయకుని యొక్క, అతని సహచరులయొక్క ధైర్య సాహసాలను మనం మరచిపోవడానికి వీలులేకుండా మన ఎదుటబెడుతూ, ఈ మొత్తానికి జీవంపోస్తున్న హాస్యంమాత్రమే ఇక్కడ మనకు ముఖ్యమైంది. ఇంత పరిశోధనా మయమైన జీవితం కళ్ళకు కనబడుతుంటే, మన రచయితలు ఇంకా జీవితాన్ని అవగతం చేసుకోనందుకు జాలి పడాలి.

కథా ప్రయోజనాన్ని మాటిమాటికీ ఎత్తిచెప్పడంవల్ల, అసలు కథనే వదలి పెట్టడం జరుగుతుంది. మన పాత్రల్ని - ఒక్క దృష్టినుంచే, అంటే వాళ్ళ సుఖమో దుఃఖమో, ఉత్తమత్వమో అధమత్వమో మాత్రమే చిత్రించి నిర్మిస్తాం. ఒకసారి ఆపాత్రల ప్రవర్తన తెలిసాక, మనం నేర్చుకున్న గుణపాఠంయొక్క బూడిద తప్పితే మనకు మిగిలేదేమీ లేదు.

మన కథల్లో సజీవమైన సంభాషణల్ని చిత్రించడం అభివృద్ధి చెందాలి. ఒక శాసనం చేసినంత మాత్రాన అది వచ్చేది కాదు. పాత్రలను గురించి సమగ్రమైన దృక్పథం వున్నప్పుడూ; ఆ ఉన్న పరిస్థితులను విపులంగా వర్ణించినప్పుడూ; దిన దినం మాట్లాడే భాషా - సరిగ్గా అందులోని కవిత్వమూ, హావభావాలూ, స్వర విశేషాలూ-ఇవన్నీ నిరంతరం కనిపెడుతూ వాటిని చిత్రించగలిగినప్పుడూ - మాత్రమే మన కథల్లో సజీవమైన సంభాషణ వస్తుంది. ఒక పాత్రకు తక్కిన పాత్రలతో ప్రత్యక్షంగా వుండే సంబంధాలనూ, అతని పరోక్ష ప్రవర్తననూ. చిత్రించడానికని - ఆ పాత్ర తలలో ఒక స్వగతాన్ని దూర్చి అనిపించడం మన రచయితలకు అలవాటయింది. కాని, మామూలుగా, ఆ స్వగతం - ఆ ప్రత్యక్ష సంబంధాలను గానీ, ఈ పరోక్ష ప్రవర్తను గానీ - చిత్రించదు. ఈ క్రింది వాక్యాలు చదివితే నా అభిప్రాయం స్పష్టపడుతుంది: "జిమ్మి బిరబిగిసిపోయాడు. కుక్కలకొడుకు. నేను చివరకు ఏదో తెచ్చిపెడతా ననుకున్నాడు. తాను ఆఫీసరు కనక

ఆ పోతోటాతో కొట్టుకుపోవాలని ఊహ. నిత్యం జరిగే యీ అద్భుతాలందరికీ తెలుసు. జిమ్మీ లెఫ్టినెంట్ జోన్సు కళ్ళల్లోకి అట్లాగే చూసి, జవాబు చెప్ప కుండా ఊరుకున్నాడు."

ఆరంభ రచయితల్లో ఈ రకం వ్రాత సర్వసాధారణమై పోయింది. దీన్ని వాడి, వాస్తవమైన సంభాషణనూ, అణగియున్న భావోద్రేకంయొక్క వాస్తవస్వరూపాన్నీ చిత్రించకుండా ఆ రచయిత తప్పుకుం టాడు. ఇక్కడ నాటకీయంగాకూడా రచయిత ఏ అభిప్రాయాన్నీ స్పష్టపరచ లేదు. మాటలద్వారా స్పష్టపరచకుండా, తాను చెప్పదలచుకొన్న దంతా పాత్ర యొక్క ఆంతర్యంలో ఇలా ఇమిడ్చి నప్పుడు, ఆ రచయిత చెప్పగలిగే దేమీ వుండదు.

పాత్రలయొక్క భౌతికచిత్రణ లేక పోవడం కూడా మన కథల్లో మరొక లోపం. తన పాత్రలు ఎలా వుంటాయో (ఈ సంగతి తరచూ, రచయితకే తెలి యదు) పాఠకులకు చెప్పడం మరచిపోతా నేమోనని రచయిత ఎంతో ఆదుర్దా పడ తాడు. కాని, చివరి పంక్తి చదివిందాకా, ఆ కథలోని ప్రధానపాత్ర ఒక నీగ్రో అనే సంగతి నాకు తెలియకుండా వున్న రకం కథలు అనేకం చదివాను. దాన్ని లోపింప జెయ్యడం ద్వారా రచయిత ఏ తాత్విక ప్రయోజనం పొందదలచుకున్నాడో, అది, పాఠకుడికి వాస్తవం తెలియకపోవడంవల్ల నిరర్థకమై పోతున్నది.

పార్కులోని ఒకవృద్ధుడు 'ఒకయువతి ఒడిలో ఒదిగే అదృష్టం ఇక ఈముఖానికి లేదు గదా!' అనుకుంటాడు. అక్కడే బెంచీ మీద కూర్చున్న పిల్లవాడు 'నాకు అపకారం చెయ్యని విషయాలను గురించే ఆలోచిస్తున్నాను. కళ్ళుండీ కానలేనివీ, కాళ్లు లేకుండానే కదలేవీ అయిన క్లిష్ట సమస్యలూ, విషయాలూ అనేకం వున్నాయి. ఆనాడు ఆ పక్షి నన్ను మా ముసలమ్మ దగ్గిరికి తీసుకొచ్చినప్పుడే, అది 'ఇదిగో నమ్మా, నీకు కాయలు తెచ్చా' నని చెప్పవలసింది" అనుకుంటాడు.

నిస్పృహతో క్రుంగి ధైర్యం లేకుండా వున్నవారి నోటినుంచే ఇలాంటి భావన వెలువడుతున్నప్పుడు, మన ప్రజల నిత్య సంభాషణ నుంచి— మన చుట్టూ వుండే కార్మికులు, వర్తకులు, పెట్టుబడిదారులు, రైతులు, న్యాయవాదులు వారి వారి పరి యాచకాలూ, వాదనలూ, చెలగాటాలూ, కొట్లాటలూ— వీటన్నిటినుంచీ, మనం ఎంత సామగ్రి సమకూర్చుకోవాలి! 'సింగే' అనే రచయిత, క్రిందుగా వున్న వంటయింట్లో ఐరిష్ రైతు స్త్రీలు మాట్లాడే మాటలన్నీ ఒక కంతలోంచి జాగ్రత్తగా విని గుర్తు పెట్టుకున్నాడు. అలాగే ప్రతి యువ రచ యితా నోట్సుతీసుకోవాలి. ప్రతివిషయం తన తలలోనుంచే అల్లిపారేస్తా ననుకోడం వృథా ప్రయాస. బయటి ప్రపంచం మీద కాక, తనమీదే తాను ఆధారపడే మన స్సులో నుంచి స్పర్థత తప్పితే మరేమీ రాదు.

మన సాహిత్యంలో మరీ విసుగెత్తి స్తున్న మరో సుతిమెత్తని సమస్యను గురించి చెబుతాను. అది జాలి గొలిపే పాత్రల చిత్రణ. మన కథల్లో చిత్రించ

డిన 'వర్ణ భేదాలకు బలియైన పాత్ర'ను గూర్చి చెప్పినప్పుడు ఇదివరకే ఈ విషయం సూచించాను. ఈ జాలి గొలిపే పాత్ర ఇంకా అనేక రూపాల్లో వుంటుంది— ఉద్యోగం ఊడిన గుమాస్తా, క్షయతో చచ్చే మనిషి, పొలంలోంచి వెళ్ళగొట్టబడే రైతూ, ఆకలిగొన్న పిల్లవాడూ— ఇవన్నీ జాలి గొలిపే పాత్రలే. మన కథల్లో ఈ పాత్రలు నిత్యకృత్యాలయి పోయాయి. ఈ పాత్రలు సాధారణంగా తమ ప్రభావాన్ని ఎందుకు కోల్పోయాయో ఆలోచించాలి. (ఒక్క మాట చెబుతాను— ఏ రకం పాత్రల జీవ శక్తులన్నీ ఉడిగిపోయాయని మనం అనుకుంటున్నామో, ఆ యా పాత్రలకు ఒక ప్రతిభావంతుడైన రచయిత మళ్ళీ జీవం పొయ్యవచ్చు. కాని, ఇక్కడ మనం మామూలు రచయితలను గురించే మాట్లాడుతున్నాం.)

ఈ దయనీయమైన పాత్ర, క్రమేపీ ప్రభావ రహితమై, క్షీణించి పోతున్నది. ఇలాంటి పాత్రలను గురించి ఎంత ఎక్కువ సాహిత్యం వస్తున్నదో, అంత తక్కువగా అది పాఠకుడి మనస్సును కదిలిస్తున్నది. ప్రజల తీరని బాధలు, తేడా లేకుండా మళ్ళీ మళ్ళీ చెప్పడంతో, పాఠకుడికి విసుగెత్తించి రచయిత నిజాయితీని సైతం శంకించే స్థితికి తీసుకుపోతున్నది.

ఇంతకంటె ఇంకా అగాధమైన సమస్య మరొకటుంది. ప్రజలు— ప్రత్యేకించి కార్మిక వర్గం— తను చుట్టూవున్న వాతావరణంలో ఒకవైపు అణచబడుతూ కూడా, దాన్ని ప్రతిఘటించి పోరాడే శక్తి కలిగి ఉన్నారనేది మనం చిత్రించాలనుకుంటున్నాం. కాని, ఒక స్టంటు పాత్రను చిత్రించి మన కథల్లో అంతా విజయం పొందినట్లు చూపించం. వ్యక్తుల్లోని ప్రతిఘటనా శక్తులను, రాజకీయంగానే కాక, మానవజాతిని గూర్చిన ఒక సత్యంగా, వాస్తవిక విషయంగా చిత్రించడానికి మనం ప్రయత్నించాలి.

ఈ ప్రతిఘటనా పునర్నిర్మాణశక్తులను మన రచయితలు చిత్రించలేకపోవడానికి చాలా కారణాలున్నాయి. వీటిలో ముఖ్యమైంది- నిస్పృహను నూరిపోసిన వేదాంతాల ప్రభావం. ఎంత ప్రయత్నించినా మానవులు ఎడబాటునూ, ఒంటరితనాన్నీ తప్పించుకోలేరనేదే ఈ వేదాంతాల సారం. వీటన్నిటికీ పైన, ఎల్లప్పుడూ మృత్యుచ్ఛాయ వ్రేలుకాడుతూ వుంటుంది. చావంటే జీవితానికి అంతమని కాక, జీవితంలోనే నిరంతర సహచారిణి అని వాళ్ళ దృక్పథం. ఈ రచయితల దృష్టిలో— అసలు ప్రకృతిసిద్ధమైన చావు, ధనిక సమాజం తమకు కలిగించే నిరాశా నిస్పృహలకు సంకేతమైంది. కనుక ఈ నిరాశాజీవితాన్ని మార్చడానికి వీల్లేదనీ, తప్పించుకోలేమనీ, ఇవి సామాజిక శక్తులవల్ల గాక, ప్రకృతిసిద్ధంగానో లేక దైవికంగానో వస్తున్నాయనీ వాళ్ళ అభిప్రాయం. కాని, మానవునియొక్క ఆ వేదనలూ, అపజయాలూ- అన్నీ ముఖ్యంగా, వర్గసమాజంలోని దోపిడీ దౌర్జన్యాల ఫలితంగానే వస్తున్నాయని మనం గుర్తించాం. ఈ పతిత సామాజిక పద్ధతులమీద విజయం సాధించడానికి ఏ ఏ విధానాలూ, ఏ ఏ మానవ శక్తులూ సిద్ధంగా వున్నాయో కూడా

మనకు తెలుసు. వాటిని కార్యోన్ముఖం చెయ్యడం మాత్రమే మనం నేర్చుకోవాలి. భవిష్యత్తుమీద విశ్వాసంకలిగించే విజ్ఞానం మనకున్నది కాబట్టి, ఆ విశ్వాసాన్నే తమ తమ జీవితాల్లో వ్యక్తీకరించుకునే సమర్థత గల పాత్రలను మనం సృష్టించాలి. ఇక్కడ మరో క్లిష్టమైన సమస్య వస్తుంది. ఇప్పుడు మామూలుగా ఒక అపజయాన్ని వర్ణిస్తూ చెప్పే కథలాగా కాక, మన కథలో రెండు రకాల గమనం అవసర మవుతుంది. ఏ నినాదంగానీ, సుఖాంతంగానీ- సాంకేతికమైన ముగింపుగానీ- ఈ పని చెయ్యలేవు. హఠాత్తుగా చేసే తీర్మానాలూ, పాత్రల్లో అలాగే తెచ్చే పరివర్తనలూ, అద్భుత చిత్రణలూ ఏమీ ఉపకరించవు. వీటన్నిటినీ కళాదృష్టిలో పూర్తి అపజయాల క్రింద పరిగణించాలి. లేదా, నిస్పృహావాదం సిగ్గుతో తన్నుదాను కప్పిపుచ్చుకోడానికి చేసే ప్రయత్నాల క్రింద పరిగణించాలి. మనం చిత్రించే పాత్రల కంటే ఎక్కువ స్పృహతోనూ, ఆందోళనతోనూ, ఆవేశంతోనూ, తీవ్రతతోనూ జీవిస్తున్న ప్రజలయొక్క వాస్తవ మానవ సంబంధాలూ, వాళ్ల లావాదేవీలు, వాళ్ల నిత్యకృత్యాలూ- ఇవే పైనిచెప్పిన పాత్రల ద్విముఖగమనానికి తోడ్పడతాయి.

ప్రజల బాధలను గురించి రచయితకు ఎంత గాఢమైన పరిజ్ఞానము ఉన్నప్పటికీ, తాను రచయితగా అభివృద్ధి చెంద దలచుకొన్నప్పుడు, అంతటితోనే ఆగరాదు. ఆ యా సంఘటనల్లో వారివారి భావాలను పూర్తిగా అర్థం చేసుకోడానికి రచయిత ప్రయత్నించాలి లేక పోతే అతను కాలాన్ని మాత్రమె గుర్తించిన వాడవుతాడు. అతని పాత్రల్లో తీవ్ర సంచలనం మాత్రమే కనిపిస్తుంది. రచయిత తన పాత్రలను నడిపించలేని అసమర్థతను ఈ తీవ్ర సంచలనం కప్పిపుచ్చవచ్చు గాని, అంతకంటే మరేమీ ఫలితం వుండదు. ఏదో ఒక ప్రత్యేక పాత్ర ఒక సుఖాంతానికి వచ్చిందా లేదా అనేది ప్రధానం కాదు. యాంటిగనీ గానీ, లియర్ గానీ, ఫాస్టు గానీ, సుఖాంతానికి రాలేదు. కాని ఈ పై మూడు పాత్రలలాగే ఏ మానవుడూ ప్రతిఘటించలేని సర్వ సాధారణ మైన విధిగా తన కష్టాలనూ, సుఖాలనూ ఒప్పించలేని పాత్ర నిరర్థక మవుతుంది. ఒక కల్పిత కథావస్తువు కాక, మానవుని లోని సజీవశక్తులూ, రాజకీయంగా మార్గదర్శకమైన నేటి మన కార్మికవర్గలక్ష్యం- ఇవే మన భావనా వైశాల్యాన్నీ, పాత్రల మనస్థైర్యాన్నీ, వైవిధ్యాన్నీ నిర్ణయించాలి.

ఈ వ్యాసమంతా ప్రారంభ రచయితలను గురించే కనుక, చిట్టచివరిమాట వారికొకటి చెప్పాలి. మీ ప్రతిభ మీ అంతరాత్మలోనే సానదేరవలసిన అనన్య సాధన మని చెప్పి మిమ్మల్ని నమ్మింపజూసే పొగడ్తలకు బలి కాకండి. అలా అయినట్లయితే మీరు మీ తప్పులను సమర్థించుకోడానికి తయారై, అంతకంతకూ వాస్తవ జగత్తుకు దూరమై పోయి, ఇంకా సుఖంగానే వున్నట్లు నటించే భగ్న ప్రేమికుడి లాగా కృత్రిమ కల్పనలకు పాల్పడవలసిన వారవుతారు.

జగత్తుకు దూరమైన ఏకాంతవాసం నుంచి యువ రచయిత ఎలా బయట పడి

తాడు? దీనికి జవాబు ఆచరణలోను, ఆలోచనలోనూ కూడా. ఉంది. ప్రజల నుంచీ, ప్రజల ఉద్రేకాలనుంచీ, పోరాటాలనుంచీ దూరంగా ఉండగలననీ; ఆలోచనా, పరిశీలనా లేకుండానే తాను ప్రతి విషయాన్నీ బలంగా ఊహించగలననీ; ఆవేశం గానీ, అనుభవంగానీ లేకుండానే అన్నీ తాను స్పష్టంగా చూడగలననీ ఎవ్వరూ భావించకూడదు. అలా భావించకుండా, యువ రచయిత ప్రజలతో కలసి మెలసి, వారి ఉద్రేకాల్లోనూ పోరాటాల్లోనూ తానుకూడా పాల్గొంటూ జీవించడమనేది మొట్టమొదట నేర్చుకోవాలి. తనకు తెలియని మనుషుల్ని గురించి గానీ, వస్తువుల్ని గురించిగానీ, స్థలాలను గురించి గానీ వ్రాయాలనుకొన్న రచయిత ఆ యా మనుష్యులతోను, వస్తువులతోను, స్థలాలతోను బాటసారి లాగా కాక, సన్నిహితంగా సంబంధంపెట్టుకొని అవగతం చేసుకోవాలి. కేవలం భావనాశక్తినుంచి పొంగుకొని వచ్చినట్లు కన్పించే ఊహా, ఆ మహత్తరమైన సంభావణా వైచిత్రీ ఇదంతా కూడా- రచయిత అనేకమంది స్త్రీ పురుషులను, బాలబాలికలను కలుసుకొనీ,వారి వారి కవళికల్ని కని పెట్టీ, వారివారి వాక్స్వభావాలను వినీ, పరిశీలించీ, అయోమయంతో గానీ, స్పష్టమైన దృక్పథంతో గానీ వారిని ప్రేమించీ, వారితో పోట్లాడీ,- అతను తెలుసుకున్న వేలకొలది ప్రజల అనేక చర్యలనుంచీ, సంభాషణల నుంచీ, ఆయా రీతులనుంచీ తీసిన సారం మాత్రమే. ఇంత సామగ్రి లేకుండా రచయితకు జీవితమే లేదు.

రెండోది- ప్రతి యువ రచయితా తన సోదరరచయితలతో కలసి మెలసి వుంటూ రచనను గూర్చీ, శిల్పానికి సంబంధించిన సమస్యలను గూర్చీ, రచనా ప్రయోజనం సాధించే విధానాలనుగూర్చీ, సంభాషణా చిత్రణను గూర్చీ, వర్ణనలు మొదలైనవాటిని గూర్చీ వారితో చర్చించాలి. తన రచనను సమిష్టి చర్చకు వదిలిపెట్టాలి. ప్రతిపంక్తినీ తీవ్ర విమర్శకు గురిచెయ్యాలి. ఇలా చేసినట్లయితే, రచయిత తాను ఒక తాత్విక సమస్యపైనగానీ లాక్షణికవిషయం మీద గానీ ఎంతోకాలం ఏకాంతంగా ఒక స్పష్టమైన దృష్టికోసం వెతుక్కోవలసిన పని వుండదు. తనకంటె అనుభవంగల రచయిత నుంచి ఆ విషయం ఒక్క క్షణం చర్చతోనే తెలుసుకోవచ్చు. ఇలాంటి చర్చల వల్ల అనుభవంగల రచయితలవిమర్శాజ్ఞానం కూడా పెరుగుతుంది. అది తమకు ఉపయోగపడుతుంది; ఇతరులకూ ఉపయోగపడుతుంది. కాని, తాము ఉద్రిక్తమైన సింహాల్లాగా, విమర్శహద్దులు దాటి 'అతి'కి పోకుండా వారు చూసుకోవాలి. ఈచర్చలకు నలుగురు రచయితలు కలిసే ప్రతిచోటూ తగిందే.

ఇక మూడోది - పురాణ ప్రబంధాలనూ తన సమకాలిక రచనలనూ నవలలనూ కవిత్వాన్నీ ఇతర కళలనూ యువ రచయిత నిరంతరం పఠించాలి; పరిశీలనా దృష్టితో అవగాహన చేసుకోవాలి. సైన్సులోకూడా అతనికి తగినంత జ్ఞానం వుండాలి. సైన్సుయొక్క స్వభావం ఏమిటో, దాని విధానం ఎలాంటిదో, ఈ నూతన జగత్తులో దాని స్థానం,

ప్రభావం ఎలాంటిదో అతను కనీసం తెలుసుకోవాలి. ఇది ఇంత స్పష్టమైన విషయమే అయినప్పటికీ, మన యువ రచయితలు తమ అభివృద్ధికి అవసరమైన విజ్ఞానంలో సగమైనా సంపాదించుకోవడం లేదనే సంగతి నాకు తెలుసు. ఇంతేకాక, మన రచయితలు మార్క్సు ఎంగెల్సు లెనిన్ స్టాలిన్ మొదలైన వారి శాస్త్రీయమైన విప్లవ సాహిత్యం చదివితీరాలి. ఈ విజ్ఞానం లేకుండా, అతను ఏ జగత్తునైతే అర్థం చేసుకొని సంస్కరిద్దామనుకొంటున్నాడో, ఆ జగత్తును శాస్త్రీయంగా దర్శించలేడు.

అసలు రచయితకు ఎలా వ్రాద్దామనేది కాక, దేన్ని గురించి వ్రాద్దామనేదే ముఖ్యం. అంటే అతను భౌతికంగానూ ఊహాలోను వైజ్ఞానికంగాను నిజమైన మానవుడుగా పెంపొందాలి. అప్పుడే అతను ఏది వ్రాసినప్పటికీ ఆ రచన, మానవుణ్ని మానవుడిలోని నిర్మాణశక్తులనూ ధ్వంసంచేసిన ధనికవాదంమీది ద్వేషంతోను, మానవజాతి అనేక కష్టాలుపడి సాధించిన విజయాల మీది ప్రేమతోనుకూడి, విప్లవచైతన్యంతో వెల్లి విరుస్తుంది.

కథానిక:

తుది ఘడియలు

శ్రీ తెన్నేటి సూరి

అంధకారం అరుస్తోంది—నిశ్శబ్దంగా.

గభీర, నిశ్శబ్దం — కాళరాత్రి.

కమిలిపోయిన కాళరాత్రి ముడతల్లో తోడేళ్లు మెసులుతున్నాయ్, అలికిడి లేకుండా.

క్లిక్—క్లిక్—క్లిక్—క్లిక్—

లష్— లష్— లష్— లష్—

వెలుగు వాహినులు కాళరాత్రి గర్భాన్ని భేదించుగుని నల్లని, ఓవర్‌కోట్ మీద కలుసుకుని, వలయాకారంగా, గుండ్రని వెలుగులమడుగు కోటు వెన్నుభాగం నడిమినుంచి వెలుగుచక్రం నెమ్మదిగా క్రిందికి దిగుతోంది. అంచులోనించి పైకి నెమ్మదిగా లేస్తోంది నికిల్ బందుల తోలు పెట్టె; బందులు చెలచెలా మెరిసినయ్.

"డాక్టరు!" "క్లిక్" మని తోడేలు టార్చిలైటు ఆర్పి, అంధకారంలోకి ఉఫ్న రహస్యంగా ఊదింది.

క్లిక్— క్లిక్— క్లిక్— వెలుగు వాహినులు ముడుచుగుపోయాయి...... దూరాన చీకటి ఎర్రగా నోరు తెరుచుగుంది. ఆ ద్వారంలోకి డాక్టరు ప్రవేశించాడు.

కొడిగట్టిన గోడచిమ్నీ, కొరివిదయ్యం నాలుకలా, సన్నగా, ఎర్రగా మండుతోంది. డాక్టరు నెమ్మదిగా గదిమూలకు .... వెనుక గోడనించి చిమ్నీతీసి చేతిలో పుచ్చుగుని, ఒక ఆజానుబాహుడు డాక్టరువెనుక నడుస్తున్నాడు.

"పెద్దబ్బాయ్" అంటూ కలవరిస్తూ, పక్కమీదరోగి, గిజాటుగా, ఒత్తిగిలింది.

డాక్టర్ స్టెతస్కోప్ తీసి చెవులకు తగిలించుగుని "ఇలా తిరుగమ్మా" అంటూ రోగిచెయ్యి పట్టుగున్నాడు. "అమ్మా"... అన్న వాక్యం విని, రోగి ఉద్రేకంగా మంచం మీదనించి లేచి, "నాన్నా"అని కళవళంగా డాక్టర్ని కావిలించుగుంది. వొణుకుతున్న అరచేతులు డాక్టరు మెడను తడిమి చూసినయ్.

......"కాదూ?" అని కొయ్యబారిపోయినయ్. రోగి "ఉస్సురన్న"దెంచుగుపోయి, పక్కలోకి దిగజారిపోయింది. కంగారుపడ్డ డాక్టరు కాలు నిలుపుగుని, కల్లోలంగా, దీపంపుచ్చుగున్న ధీశాలి కనుబొమ్మల్లోకి వెర్రిచూపులు చూశాడు. ఆ వ్యక్తి, "హుఁ" పెద్దబ్బాయ్ "అరుణ" అనుకుందిలెండి. ఈ పూట ఉపిరితపిరిగా నే వుంది"

"అరుణెవరు?"

"మా దొరగారి పెద్దబ్బాయ్"

"దాహం"..పక్కలో రోగినిశ్వాసం విడిచింది. సుబ్బన్న చిమ్నీ అక్కడపెట్టి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చాడు. నెమ్మ

దిగా రోగిని పైకి లేవతీసి, వెన్నాను కుక్కుమని గ్లాసు నోటి కందిస్తూ—

"అనవసరంగా ఖంగారుపడకు. నీకేమీ ఫరవాలేదు."

"అవునమ్మా, ఫరవాలేదు నేనున్నానుగా" అన్నాడు డాక్టరు.

"అరుణ తండ్రి రాలేదూ ?"

"ఇంటిచుట్టూ పోలీసు కాపలా కాస్తున్నారు" సుబ్బన్న సుబ్బలక్ష్మి చెవులో భయం భయంగా గుసగుసలాడాడు.

"హాఁ— అట్టాగా, అందుకా రాలేదు. సరే..." రోగి సమాధానపడి మనస్సు ఒక తీరానికి తెచ్చుకుని నెమ్మదిగా పక్కలో ఒదిగి పండుకుంది. ఆతల్లి పక్కలో డాక్టరు కూడా నెమ్మదిగా కూచున్నాడు. "వీలుచూసి అబ్బాయిని పిలిపించుదాం. కళ వళ పడబోకమ్మా మనస్సు పాడుచేసుగుంటే కష్టం"

"నేను బ్రతగను డాక్టరుగారూ! అబ్బాయిని చూడకుండా పోతానేమో నని ఆదుర్దాబడ్డా. నాకు ఏడుగురు బిడ్డలున్నా, వాళ్ళని చూడాలని నాకు బెంగగా లేదు. నాలుగు పాలచుక్కలిచ్చిన పాపానికి ఆ బిడ్డని, కత్తుల బోను ల్లోకి నడిపించాను. అలా ఎందుకు చేశానో నాకు నాకే అర్థంకాదు."

"నీకేమీ ఫరవాలేదమ్మా. మనస్సు కొంచెం ఖంగారైంది. అంతే. ఒక చిన్న ఇంజెక్షనిస్తాను హాయిగా వుంటుంది. — సుబ్బన్నా! ఉడుకులాంపట్టీ నుదురు మీద వెయ్యి......"

డాక్టరు ఇంజెక్షన్ చేశాడు. సుబ్బలక్ష్మికి కొంచెం హాయి చిక్కింది.

"డాక్టరుగారూ ? కొంచెం సేపు మాట్లాడాలని వుంది, నాకు ఇపుడు హాయిగానే వుంది. కొంచెం మాట్లాడొచ్చా ?"

"ఎక్కువ మాట్లాడ్డం మంచిదిగాదు... మళ్ళా హైరానవుతుంది."

"కొంచెంసేపు—నెమ్మదిగా మాట్లాడతాను."

"అరుణసంగతేగా ?...డాక్టర్ గారికి నే జెబుతాలే, నువ్వు కాసేపు కళ్ళు మూసుకు పడుకో—"

"అరుణసంగతి నువ్వేం జెబుతావ్ ?" ఒక్క ప్రాణంతో చవితి చంద్రుడులాగు ఒక సన్నని చిరునవ్వు సుబ్బలక్ష్మి పెదవుల మీద నెలపొడుపైంది.

డాక్టరు గ్రహించాడు: ఆ తల్లి హృదయంలో ఏదో ఒక గొప్ప ఆవేశం వుందనీ; అది బయటికి చెప్పేసుకుంటే గాని, ఆతల్లి హృదయవేదన తగ్గి హాయిగా నిద్రపోలేదనీ, అంత ఆవేశాన్ని అణచుకో మనటం అదీ మంచిది కాదనుకున్నాడు.

"సరే...ఆవిణ్ణే చెప్పనియ్యిసుబ్బన్నా ఫరవాలేదులే : కొంచెం అలా కులాసాగా మాట్లాడుకుంటేగాని హాయిగా వుండదేమో కూడానూ"

సుబ్బలక్ష్మి నెమ్మదిగా మాట్లాడుతోంది—

"డాక్టరుగారూ! మీరు ఎంత ధైర్యం చెబుతున్నా, నాస్థితి నాకు తెలుస్తోంది. నేను బ్రతకను; చచ్చిపోయేలోగా ఆ బిడ్డని చూడాలని నాప్రాణం పీకుతోంది. నేనాబిడ్డని సర్వవిధాలా నాశనం చేశాను.ఆపదలలోకి యీడ్చాను.సుఖంగా

మహారాజులా బ్రతకాలిసిన బిడ్డకి లేని పోని గంగ వెర్రులెత్తించాను"

"ఏమిటీ—"

"దాసుగారి పేరు మీరు వినేవుంటారు. హరికథలవీ చెబుతూవుంటారు?—"

"మీ దొరగారిసంగతేగా — మొన్న చూశానుగా"

"అవును మొన్న చూశారుగా—అన్నట్టు మరచిపోయాను. వారు ప్రశాస్తిగా సంగీతం పాడుతారు, కవిత్వం అదీ వ్రాస్తారు. రామాయణమంతా, హరికథగా వ్రాసి గొప్ప కీర్తి సంపాయించారు."

"అవును విన్నాను."

"వారియింటికి ముందు ఒక పెద్ద తల సావిడివుంది. ఆ తలసావిట్లో అహోరాత్రులూ, వీణలు, మద్దెళ్లూ, ఫిడేళ్లూ ఘోరు కొలిపి పోతూవుండేవి. ఆసావిట్లో ఎడంచేతివేపున కొంతభాగం అడ్డం కట్టి వుండేది; అందులో వర్షాకాలమన్ని రోజులూ రొండు భోగంమేళాలు దిగి కాచుకుతాగుతూ వుండేవాళ్లు—ఆ మూడు మాసాలూ దాసుగారి దగ్గిర ఆటా పాటా చెప్పుకుని వర్షాలు వెలవంగానే ఊళ్ళమీద వెళుతూ వుండేవాళ్లు.

"ఇవతలప్రక్క సావిట్లో; ఒకనాటకం కంపెనీ వుండేది. హరిశ్చంద్రా, గయోపాఖ్యానం, మోహనవిజయం — అంటే 'పిష్వానారాయణరావు వధ' అంటారు చూడండి, ఆనాటకం మాఅయ్యగారు తెలుగులో వ్రాశారు— ఈ నాటకాలు గరిడీ జెప్పుకుంటూ ఉండేవాళ్లు

"ఇంకా పది పన్నెండుమంది మంగలి పిల్లలూ ఆడపిల్లలూ, మా దొరగారి దగ్గర సంగీతం చెప్పుకుంటూండేవాళ్లు.

"అయ్యగార్ని చూట్టానికి ఎంతెంత దూరంనుంచో, పెద్ద పెద్ద విద్వాంసులు వొస్తూండేవారు. సాయంత్రమయేటప్పటికి ఆ సావిట్లో ఏదోవొక సంగీత కచేరీయో, భరతనాట్యమో, వుండేది.

"మా వూళ్లో, వారికి మంచి పలుకుబడి వుంది. వూళ్లో నలుగురితో చెప్పి, ఆ వొచ్చిన విద్వాంసులికి, తృణమో ఫణమో ముట్టజెప్పి, సంతోషపెట్టి పంపుతూండేవారు.

"చైత్రం, వైశాఖం మాసాలు రెండూ, చింతావారి కూచిపూడి మేళం మావూళ్లోనే మకాం.

"శరభలింగానికి జంగంకథలో, కాలికి గండపెండేరం వేయించింది అయ్యగారే!"

"ఆ యింటిని కళాసరస్వతి విలాసమందిరంగా చేసుకున్నదల్లేవుంది. ఎంత చక్కని వాతావరణం! ఆవాతావరణంలో పెరిగితే, ఎలాంటివాళ్లయినా గొప్ప తేజోవంతులు అవడానికి అవకాశం వుంటుంది"

"ఆ,..... అదే చెప్పొస్తున్నా. ఒక తమాషా" అని సుబ్బన్న వంక చూసి సన్నగా చిరునవ్వు నవ్వింది.

"ఏం? మా వెంకప్ప సంగతి డాక్టరుగారికి చెప్పి, వేళాకోళం పట్టిద్దామనా?"

"మా మరిది అయ్యగారింట్లోపని చేస్తూ ఉండేవాడు. ఆ అబ్బాయి వాళ్ల మేనమామనీ. పినతండ్రి పెత్తండ్రి బిడ్డల్నీ, పోగుచేసి, ఒక భాగోతంజట్టు తయారు

చేశాడు. చెబితే మీరు నమ్ముతారో, లేదో... ఆ అబ్బాయే సైరంధ్రివేషం వేసి, చీరా, రవికా కట్టుగుని, గోరండిన చెయ్యి పెట్టుగు నుంచుంటే, అచ్చు మా అత్తయ్యలాగుండేవాడు."

డాక్టరు, "అరుణసంగతి చెబుతావను కున్నాను. ఇదంతా చెబుతున్నావేం? అంత హైరాన పడకూడదు."

"ఊఁ... అదే చెప్పుగొస్తున్నాను—"

"ఈయన దొరగారి వ్యవసాయంమీద పనిపాటులు చేస్తూండేవారు. దొరగారే... మా పెళ్లి చేసింది. అప్పణ్ణించీ, నేను ఆ యింట్లోనే చాకిరీ చేస్తూ బ్రతికాను. ఆ యింట్లో తిరుగుతూంటే, నాకూ పాడాలని ఉత్సాహమేసింది. భరతనాట్యం చూస్తూవుంటే, నేర్చుగుంటే బాగుండు ననిపించేది. నవ్వుతారేమోనని సిగ్గుపడి, నాలోనేను ఇదౌతూ వుండేదానిని. చివరికి నాయనమ్మగారి దగ్గిర భగవద్గీతలు నోట చెప్పించుగున్నాను."

డాక్టరు ఆశ్చర్యపడ్డాడు. "నీకు చదువొచ్చా?"

"రాదు. ఆవిడికీరాదు. ఆవిడ బుచ్చమ్మగారని ఒకావిడదగ్గిర శ్లోకం అర్థంగూడా నోటనే చెప్పుకున్నారు. అట్టానే నేనూ చెప్పుకున్నాను."

"తమాషాగానే వుంది. వినాలనుంది. కాని, నువ్వు ఇప్పటికే చాలా అలసిపోయావ్. ఇంక ఎక్కువగా మాట్లాడటం మనకి మంచిదికాదు. అరుణ సంగతేదో చెబుతావనుకున్నాను. ఎందుకు— ఇదంతా చెబుతావ్..."

"అదే చెబుతున్నాను. మీకు విసుగ్గా వుందా ?"

"లేదు"

"హైరానపడతావేమోనీ..."

"హాఁ మా దొరసానికి లేకలేక ఒక మొగబిడ్డ పుట్టాడు. అప్పుడే నాకూ, మొదటికానుపు. తల్లిదగ్గర పాలు లేక పోతే అరుణకూడా, నేనే పాలిస్తూ ఉండేదాన్ని. ఒకరోజున బిడ్డకి పాలిస్తూ నడవాలోకూర్చున్నా. ఆ...రోజు నాకు ఇప్పటికీ జ్ఞాపకం.

దాసుగారి పినతండ్రి కొడుకు దాసుగారితో దెబ్బలాడుతున్నాడు. కటకటాల గదిలో దాసుగారు రామాయణం వ్రాస్తున్నారు, వెంకటనారాయణగారు గాంధీగారి మాటమీద స్వారాజ్యంకోసం చదువు మానేసి ఇంటికొచ్చాడు. రోజూ పేపరు తెచ్చి, అన్నగారికి చదవి వినిపిస్తూండేవాడు. ఆయన ఆవేళ ఎంతో ఉక్రోషంగా అన్నగారితో దెబ్బలాడారు. "లలితకళలన్నీ మీ చేతులో పెట్టుకూచున్నారు. అవసరపడితేజాతిని జాతినీ కదిలించి రణరంగంలోకి దూకించే శక్తులు మీదగ్గిరున్నాయి. కాని, లాభమేమిటి? మీవల్ల జాతికికావలసిన ప్రయోజనమేమీ లభించటంలేదు. మీరు ఈ ప్రజాపోరాటాలనే మీ గుర్తించకుండా' ఇప్పుడీ రామాయణమేమిటి ? మీబోట్టి పెద్దలంతా, శక్తివంతులంతా ఇలా నిర్లక్ష్యంగా వుండటమే మనజాతి యీ దౌర్భాగ్యస్థితికంతా మూలం. ఇంకా మనజాతి బానిసలుగా వున్నామంటే దానికి బాధ్యులు మీరే" అన్నారు

దాసుగారు రాసేరాసే కలం అక్కడ పెట్టి ఇలా సమాధానం చెప్పారు.—

"వెంకటీ! నువ్వన్నదంతా నిజం. కాని నా అసమర్థతను కూడా నువ్వు గుర్తించాలి. కళారూపాలన్నీ మాదగ్గిరున్నాయ్. కాని కావలసిన రాజకీయ సాంఘిక విజ్ఞానం మాదగ్గిర లేదు. ఇప్పుడు మేము దాన్ని సాధించగలుగుతామని తోచదు. మా చదువంతా అదో వానా కాలపు చదువు. ఈ కళారూపాన్ని మీ కందజేస్తాం. మీ నూతన విజ్ఞానాన్ని యీ శిల్పాల్లో పోతపోసుకుని జాతిని ముందుకు తీసుకుపోండి, అర్రుడిగి వోదిలెయ్యాల్సిన స్థితిలో మమ్మల్నింకా ఏం చెయ్యమంటావ్."

అరుణ నా వొళ్ళో పాలు తాగుతున్నాడు. ఆబిడ్డవంక చూస్తే తండ్రి పోలికలన్నీ కనిపించినాయి. ఈ బిడ్డ, చదువుకుని ఈ రెండు చైతన్యాల్ని, పోత పోసుకుని ముందుకు నడుస్తాడనీ, మాబోటి కష్టజీవులకంతా అండగా నుంచుంటాడనీ ఒక ఆశ నాలో కలిగింది. అప్పణ్ణుంచీ, ఆ బిడ్డకు అదే దృష్టి వుండేటట్లు చూస్తూ వొచ్చాను. అనేక వెర్రిమాటలు చెప్పాను."

"సుఖమనేది "భ్రమ" అన్నాను. చుట్టూ వున్న జనం అన్నంలేక అటుమటిస్తూ నరకకూపాల్లో బాధ పడుతూంటే, నీకు "సుఖ" మేమిటన్నాను. సుఖం కోసం జాతిదుస్థితి చూసుకోకుండా నడిచే వ్యక్తి "పిరికిపంద" అని పసిబిడ్డ రక్తాన్ని రెచ్చగొట్టాను. జాతి నుద్ధరించిన "మహా కవివై కలకాలం కీర్తినార్జించుకుని నక్షత్రాలున్నదాకా బ్రతకమని వెర్రిఆశలు చూపించాను ఆ బిడ్డగతి ఇప్పుడేమైందో, తెలుసా? తోడేళ్ళమధ్య లేడికూన బ్రతుకయింది, ఇంటిచుట్టూ ఆ పోలీసుల్ని చూశారా, నాలుగు ధారల పాలిచ్చి పెంచాననే వ్యామోహంతో చచ్చిపోతాననే బెంగతో వెంపర్లాడి బిడ్డ నన్ను చూట్టానికివొస్తే పట్టేసి ఉరికంబ మెక్కించాలని ఎలా కనిపెట్టుక్కూచున్నారో చూశారా?! అబ్బ...తల్లి వొడిలోనుంచి బిడ్డను లాక్కుపోయి చీరుకు తినాలని చూసే ఈమనుషులు-ఏమిటి డాక్టరుగారు! నా మూలాన బిడ్డ యీ కత్తుల బోనులో ఇరుక్కుపోయాడని కన్నతల్లి ఎంత ఏడుస్తోందో......లోపల్లోపల. పైకి అనక పోయినా, బిడ్డను నేను పాడుచేస్తున్నాననేకోపం. బిడ్డమీద కోపంవొచ్చినప్పుడల్లా ఆ తల్లిచెక్కిళ్ళలో ఎర్రగా...నాకు కనుపించుతూనే వుండేది. అజ్ఞానం,... బిడ్డగొంతు కోశేశాను."

డాక్టరు ఉద్రిక్తుడై లేచినుంచున్నాడు. "క్షమించు తల్లీ! ఏదో వొక సామాన్య పేదరాలికి చికిత్స చేస్తున్నాననుకున్నాను. వీరమాతవని గుర్తించుకోలేక పోయాను. బిడ్డ నమస్కరిస్తున్నాడు. నన్ను కూడా అశీర్వదించుతల్లీ! చేతులు ముకుళించి నమస్కరిస్తాడు.

"అదేమిటి డాక్టరు గారూ! నేను తక్కువ కులంలో పుట్టాను. మీరు బ్రాహ్మలు. మీరలా నమస్కారం చెయ్యకూడదు, ఈ అపచారానికి లేచి, మీ పాదాలకి నమస్కరించాలిసింది. పక్కలోనించి లేవలేను. క్షమించండి - నమస్కరిస్తుంది

"ఇందులో నువ్వు విచారించవలసింది ఏమీలేదు తల్లీ! ఈ జాతిలో నీకీర్తి చిర స్థాయిగా వుంటుంది. అరుణను యోద్ధగా తయారుచేసి జాతికి అందించావు. తెలుగు దేశం నీకు ఋణపడివుంది"

"అంత పెద్దమాటలనకండి. నా బ్రతు కెంత... నేనెంత... కడుపులో బాధగా వుండి మీతో చెప్పుకున్నాను. ఇప్పుడే మీతో మనస్సులో కొంచెం చిక్కు తీసు కున్నట్టుగావుంది. నిద్దరొస్తోంది. కొంచెం పడుకోనా?"

"ఆ... విశ్రాంతి దీసుకో తల్లీ! నేను మళ్లా ఉదయం పొడవగానే వస్తాను."

సుబ్బలక్ష్మి నెమ్మదిగా కన్ను మూస్తోంది. డాక్టరు మందులుపెట్టె సర్దు కుని, బయలుదేరాడు.

ఇంతసేపూ, తన సర్వస్వాన్నీ కోల్పో తున్న దీనుడిలా తలుపు మొత్త నానుకుని కన్నీరు కారుస్తూ మోకాళ్లమీద తల వేలవేసుకుని కూచునున్నాడు సుబ్బన్న. డాక్టరుగార్ని వీధివాకిలిదాకా పంపించ టానికి వెంట వెళ్లాడు. "బాబూ! ఈ పూట కొంచెం తెలివిగానే మాట్లాడు తోంది."

"ఊఁహ్...అని, నిస్పృహగా నవ్వాడు డాక్టరు. అరుణ ఎక్కడున్నాడు? నీకే మన్నా తెలుసా?"

"వూళ్లోనే తిరుగుతున్నాడుట. దీని కిల్లా వుందని ఆ పిల్లడు ఎంత కొట్టుకు లాడుతున్నాడో!... తల్లి ఏమికన్నదో... ఇదే పెంచింది. ఆ పిల్లడు దీనిమీదే పంచ ప్రాణాలూ, పెట్టుకు బతుగుతూ వుం టాడు."

"ఒకసారి లోపలకొచ్చే అవకాశ ముంటే బాగుండును"

"ఆమ్మో... ఆ... ఎదురవుండా, డాబా అరుగుమీద చూశారా?"

టార్చిలైట్లు నాలుగూ, చక్కన వెలిగి, డాక్టరు మొహంమీద పడ్డయ్. "అబ్బా" అంటూ డాక్టరు బాధగా కళ్లు మూశాడు. మళ్లా నాలుగు లైట్లూ, ఒక్కసారి ఆరిపోయినయ్, అంధకారం అలుముకు పోయింది. కారుమేఘాలు దట్టంగా పట్టి, ఆ... కాళరాత్రి ఫెళ ఫెళా గర్జిస్తోంది. సన్నగా చినుకుకూడా సాగింది. డాక్టరు చకచకా, గేటు దాటి అంధకారగర్భం లోకి నడిచిపోయినాడు.

సుబ్బన్న నిస్పృహగా కాళరాత్రి గర్భంలోకి చూస్తూ, వరండాలో నుంచు న్నాడు. అతనికి ప్రపంచమంతా ఏదో... తుఫానులో చిక్కుకుని నశించిపోతున్నట్లు భయమేసి; దిగాలుపడి చూస్తున్నాడు.

× × ×

జోరున కుంభవృష్టి కుమ్మరిస్తోంది. ఆకాశగర్భంలో జీమూతాలు పరుగులు తోలుతూ భయంకరంగా వుంది. ఆకాశం పెద్దపెట్టున ఫెళ ఫెళా విరిగి, మీదపడి పోయినట్టు ఒక్క ఉరుము ఉరిమింది. "గప్పు"మని మండి ధామ్మని వాళ్ల తోపు మీద గగనాన్నుంచి ఒకపిడుగు దూకింది. ఆ మంటతో ఆకాశం మరింత కమిలి కరుడుకట్టి పోయింది. హడలిపోయిన దిగ్భాగాలు హాహాకారంగా అర్చేసినయ్.

తడిసి నీళ్లు కారుతున్న వోవర్ కోటుతో హాటు మొహంమీదికి ముందుకు

దించుకుని డాక్టరు వర్షానపడి వొచ్చేస్తున్నాడు. రోడ్డుమీద మోకాలు బంటిగా పట్టిన నీళ్ళలో తొందర తొందరగా నడుస్తూ. బురదా, నీళ్లూ చింది రొమ్ముల దాకా కొట్టుకుంటున్నయ్. మళ్లా టార్చిలైట్లు డాబావరండాలో నుంచి డాక్టరు తోలుపెట్టిమీద పడి, ఆరిపోయినై.

"డాక్టర్..." అంటె ఒక తోడేలు.

"అది" చస్తోంది కావున్ను అప్పుడే ఆదుర్దాగా మళ్లా పరుగెత్తుకొస్తున్నాడు." అన్నది ఇంకో తోడేలు.

"దాని చావుగాదు మనచావుగా వుంది" మూడోది.

"పెద్దపెద్ద వాళ్లు పిలిస్తేనే పలికేడవడీ డాక్టరు. యీ కూలిదానికోసం యీ వుప్పెన్నబడి వొస్తున్నాడేమిటో"

"అరుణగాడికి అసలీ విషయం తెలుసునో లేదో...మనం అనవసరంగా చస్తున్నాము.

"వీళ్ళకి మటుకు ఎట్టా తెలిసేడుస్తుంది? వాడెక్కడున్నాడో"

"అయినా ఇదంతా మన పిచ్చిగానీ,. దీని అజ వాడికి పట్టిందటరా?...

డాక్టరు తలుపు కొట్టాడు.

"ఎవరు?"

"డాక్టరు"

"సుబ్బన్న కాశ్చర్యం వేసింది. వొచ్చి తలుపుతీసి చూశాడు. ఆ వ్యక్తి చెకచెకా లోపల ప్రవేశించాడు. ఓవర్ కోటూ హాటూ, తీసి దణ్ణెంమీద పారేశాడు.

"హాం... పెద్దబ్బాయ్...నువ్వా!..."

"ఇష్. తలుపు వేశై—అరుణపోయి సుబ్బలక్ష్మి పక్కలో కూచున్నాడు. సుబ్బలక్ష్మి చెయ్యితీసి నెమ్మదిగా పిసుగుతున్నాడు' "ఎంతచిక్కిపోయిందీ," అని తనలో తను బెంగపడుతూ...

ఆ స్పర్శతో సుబ్బలక్ష్మి, అరుణ చెయ్యి తడిమి చూసింది. "హా,... అరుణా,..."అంటూ చక్కన కళ్లు విప్పి చూసింది.

"ఆ...నే...నే...అమ్మ"

"నానా,...చివాల్న లేచి కావిలించుకుని,' వలవలా ఏడ్చింది.

చిక్కి శల్యమైపోయిన ఆతల్లి వెన్నుపాము నిమురుతూ కన్నీటితో కళవళంగా కుమిలిపోతున్నాడు.

ఆ... తల్లీ, బిడ్డా, పరస్పరం హృదయాలు పెనవేసుకుని ఒక్కక్షణం ఏకంగా నిరామయమై పోయారు. సుబ్బలక్ష్మికి చివాల్న ఒక స్ఫురణ కలిగింది. అతని బుజాలు రెండూ పట్టుకుని, "అడుగో" అంటూ తీవ్రంగా ముఖంలోకి చూసింది.

"ఏవిటీ!"

ఎలా లోపలికొచ్చావ్? బయట వాళ్లు లేరూ?

"వున్నారు. డాక్టరుగారి డ్రస్ వేసుకొచ్చాను."

ఛెళ్లున చెంపమీద కొట్టింది ఆవేశంతో గజగజా వొణికిపోతూ— "ఏమిటి? ఏం పనిచేశావ్! వాళ్లకి తెలిస్తే?......"

ఆతల్లికి తనమీద ఎంత ప్రేమవున్నదో అరుణకు అర్థమయింది. "తను వ్యర్థుడు. ఆ తల్లి ఋణం ఎల్లాతీర్చుకుంటాడు? "కన్నీ గాడులుతున్న కళ్లతో— పరవాలేదులే

అమ్మా" అంటూ నెమ్మదిగా పక్క మీద పడుకో పెట్టాడు.

అరుణ తొడమీద చెయ్యి పెట్టుకొని సుబ్బలక్ష్మి కన్ను మూసింది. ఒక క్షణానికి ఒక...ఎక్కిలి. "అబ్బ!..." అని మూలిగింది. అరుణ గుండెలమీద రాచాడు.

"నాన్నా!" సుబ్బలక్ష్మి జాలిగా అతని వంక చూసింది. కను కొలకుల్లోనించి కన్నీళ్లు దిగజారినయ్.

"ఆయన ఏరీ?"

సుబ్బన్న ఆదుర్దాగా దగ్గరకొచ్చాడు.

చెయ్యి తడిమి "బిడ్డలు......" అని వలవలా ఏడ్చింది. సుబ్బన్న ప్రక్క మీద కూలబడిపోయాడు.

"అమ్మా!"

"నాన్నా!" అని చెయ్యిపట్టుకుని కళ్లు తెరిచి అతని మొహంలోకి చూసింది. ఆ జ్యోతులు రెండూ ఆరిపోయి ప్రపంచం చీకటిపడిపోయింది

జాతీయగీతం

శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రి

పవిత్రభారత సవిత్రికో హో
స్వతంత్రోత్సవం సాగింది
లాల్ కిలాపై అశోకచక్రపు
త్రివర్ణ కేతన మెగిరింది ॥పవిత్ర॥

మతం తలపక గతం తడవక
ద్వేషం రోషం సకలం చూడక
స్వతంత్రభారత జయపతాకకు
సోదరులారా మ్రొక్కండి ॥ప॥

నెత్తురు లోడ్చిన సత్తువ లూడ్చిన
పిశాచదాస్యం నశించిందనీ
ప్రపంచమంతా ప్రతిధ్వనింప
స్వతంత్ర శంఖా లూదండి ॥ప॥

పోరుల ద్రిమ్మందిన కారలకుందిన
స్వతంత్రయోధులస్మరించుకొంటు
ముదశ్రుతర్పణ హృదంబుజార్పణ
స్వతంత్రులారా సలపండి ॥ప॥

అమోఘ శక్తుల సమీకరించుక
సమస్తభారత సమైక్యమెంచుక
హిమాద్రి మొదలు కుమారివరకు
భారతవిజయం పాడండి
స్వతంత్రభారత జయపతాకతో
యువతీ యువకులు నడవండి ॥ప॥

సోవియట్

యువ రచయితల మహాసభ

సాహిత్యరంగంలో నూతనంగా ప్రవేశించిన యువకులకోసం, యువతులకోసం, మాస్కోలోని సోవియట్ రచయితల సంఘం యాజమాన్యానజరిగిన సమావేశానికి 150 మంది యువరచయితలూ, కవులూ హాజరయినారు. ఇరవై ముప్పై సంవత్సరాల మధ్య వయస్సు గల ఈ రచయితలు సోవియట్‌లోని వివిధజాతుల నుంచి వచ్చారు. వీరిలో రష్యన్లు, యుజ్‌బెక్కులు, యుక్రేనియన్లు, లాట్వియన్లు, బెలోరష్యన్లు, జార్జియన్లు, ఆర్మీనియన్లు, ఎస్టోనియన్లు ఉన్నారు.

ఈ సమావేశం యువ రచయితలకు పెద్దల సలహాలూ విమర్శలూ అందజేయడానికీ, పెద్దలతో వ్యక్తిగత సంబంధం కలిగించడానికీ, ఉద్దేశించ బడింది.

సోవియట్ వచన రచన పద్య రచనల యొక్క ప్రధాన కర్తవ్యాలను గురించీ, సోవియట్ నైతిక సమస్యలను గురించీ సోవియట్ రచయితల కవుల ఉపన్యాసాలతో ఈ సమావేశం ప్రారంభమైంది. దీని అనంతరం యువరచయితల రచనలను గురించి సవిమర్శకంగా చర్చలు జరిగాయి. వారి వారికి సన్నిహితమైన రీతులుగల పెద్దలతో యువరచయితలకువ్యక్తిగత సమావేశాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి.

ఈ మహాసభా కార్యక్రమమంతా యువజన పత్రికల్లోను, వార్తాపత్రికల్లోను ప్రచురింపబడింది. 'కమ్సొమోల్‌స్కాయా, ప్రవదా' లోను 'మాస్కోవ్‌స్కీ కమ్సొమొలెట్జ్'లోను ఈ మహాసభను గూర్చి ప్రత్యేక అనుబంధాలు ప్రచురించారు. యువ రచయితల రచనలను గూర్చి 'లిటరేచర్నయాగజెటా' అనేక ప్రత్యేక వ్యాసాలు ప్రచురించింది.

సాహిత్యం యొక్క బాధ్యతలనుగూర్చి సోవియట్ యువక కమ్యూనిస్టు లీగు కార్యదర్శి నికోలాయ్ మైఖెలోవ్ ఇలాఅన్నాడు. "సాహిత్యం, శత్రువుతో, ఎప్పుడు పడితే అప్పుడు ముష్టాముష్టి తలపడే సైనికుడి వంటిది. సాహిత్యం రంగంవెనుక ఉండవలసిందికాదు; యుద్ధరంగంలో ప్రథమశ్రేణిలో నుండి ముందుకు నడపవలసింది."

సోవియట్ సాహిత్యబాధ్యతలను గురించి సోవియట్ రచయితల సంఘ ప్రధానకార్యదర్శి అలెగ్జాండర్ ఫెడయేవ్, ఒక విపులమైన నివేదిక ఇచ్చాడు. సాహిత్యంలో జీవితాన్ని సత్యంగా చిత్రించడం, మానవులను సజీవంగా వర్ణించడం,—ఇదే రచయిత యొక్క కర్తవ్యమని ఫెడయేవ్ ఉపన్యసించాడు.

ఈ సాహిత్య సమస్యలన్నీ పరిశీలిస్తే తేలే పర్యవసానం ఏమంటే— సోవియట్ పౌరుణ్ని అతని నూతన నైతిక జీవితాన్ని అతని ఊహాలనూ ఉద్రేకాలను అతని భావప్రపంచాన్ని సత్యదృష్టితో సాహిత్యంలో ప్రతిబింబించడమనేదే అన్ని సమస్యలకూ ప్రధానమైన పరిష్కారమార్గం. నూతన సోషలిస్టు సమాజంలోని ఈ మానవుడే సోవియట్ సాహిత్యానికి ప్రధాన వస్తువు. సోవియటు కళాకారుడు, తన సమకాలికుల లోని అభ్యుదయ ధోరణులను గమనించగలిగివుండాలి; అభ్యుదయ పంథాలో తన కథానాయకుణ్ణి చిత్రించగలిగివుండాలి. ఈ కథానాయకుడు వాస్తవిక జీవితంలోని వాడే; కాని, మరే ఇతర సమాజంలోని మానవులకంటె ప్రత్యేకమైన స్వభావధోరణులు కలిగినవాడు కావాలి.

దేశీయ సాహిత్యంలో అనేక విచ్ఛిన్నధోరణులు పొడసూపుతున్నప్పుడు కూడా సోవియట్ సాహిత్యం ప్రపంచములోనిఉత్తమ సాహిత్యపంథానే అనుసరించింది. ఉత్తమ రష్యన్ సాహిత్యానికి పుష్కిన్, నెక్రసోవ్, టాల్‌స్టాయ్, చెకోవ్, గోర్కీల రచనలే నిదర్శనం. వారి రచనల్లో మానవుడే ప్రధానపాత్ర వహించాడు కాబట్టి, వారి సాహిత్యం మానవత్వంతో కూడుకున్నది కాబట్టి, వారు సోవి

యట్ సాహిత్యానికి మార్గదర్శకు లైనారు.

యువరచయితలు తమ కార్య క్రమాన్ని ఒక నిర్మాణంలో పెట్టు కోవలసిన అవసరాన్ని గురించి ఫెడ యేవ్ నొక్కి-వక్కా-ణించాడు.

మహా సభలో సోవియట్ నాటక సాహిత్య సమస్యలను గూర్చి కాన్స్టాంటిన్ సిమనోవ్ చర్చించాడు. రంగంమీాది ప్రదర్శ నానికి అనుగుణంగా వున్నట్లు కని పిస్తూ, ఏ ఆశయాలూ, నిజమైన మానవోద్రేకాలు యేవీ, లేనటు వంటి, నాటకాలు వ్రాసే చెక్క-డపు పనితనంగల రచయితలను సిమనోవ్ విమర్శించాడు. ఎంత చక్క-ని శిల్పం వున్నప్పటికీనాటక రచయిత వూహామాత్రమైన జీవిత చ్ఛాయను చిత్రించకూడదు. కేవలం జీవితాన్ని మాత్రమే అతను చిత్రించాలి.

సోవియట్ కవిత్వాభ్యుద యాన్ని గురించి విక్టర్ పెట్రెసోవ్ విపులసమీాక్ష చేశాడు. మెకో విస్కీ- కవితాలక్షణాలు తరువాతి తరాల రచయితలలో నుంచి ఆయన ఎత్తిచూపాడు. యువరచ యితలను గురించి ప్రస్తావిస్తూ, సెర్కి-నెరోప్షటోవ్ వ్రాసిన మహాగ్నినీ 'మెకేల్లు' కొనిన్ వ్రాసిన 'యుద్ధంనుంచి తిరిగివచ్చిన వారికి' అన్న కావ్యాన్ని ఉదహ రించాడు.

సోషలిస్టు కళాదృష్టి, వివిధ విభిన్న కళాధోరణుల విశాలమైన ద్వారాలు తెరచిందని పెట్సోవ్ అన్నాడు. సోవియట్ కవితాసంప్ర దాయాలు ఎంత విశాలమైనవో తెలుసుకోవాలంటే ఒక్క- నిదర్శ నం చాలు. 19 వశతాబ్దపు రష్యన్ కవిత్వధోరణుల్లోవేరూనినటివార్డో విస్కీ-యొక్క-'వాసిలీ టెర్కి-న్'నూ ఇరవయ్యో శతాబ్దపు చక్క-టి కవితా సంప్రదాయంలో నుంచి పొంగివచ్చిన యాన్టో కోల్సీ- యొక్క- 'సన్'నూ పోల్చి చూస్తే ఈ విషయం బోధపడుతుంది.

ఉత్తమ కళాసృష్టికోసం జరిగే సంఘర్షణ, దాని పర్యవసానంలో, ఉత్తమాదర్శాలకోసం జరిగే సం ఘర్షణే అవుతుంది. నీతిలేకుండా కళ అనేది ఏదీ ఉండదు. ఏ కవిత్వ రచన అయినప్పటికీ భావౌన్నత్యం లేకుండా కళాదృష్టిలో ఉన్నత

శిఖరాల నధిరోహించ జాలదని పెర్ట్సోవ్ నొక్కి చెప్పాడు.

సోషలిస్టు వాస్తవికత దృష్ట్యా, కవిత్వంలో స్పష్టమైన చిత్రణా, ఉచితమైన భాషా, ఉత్తమమైన నిరాడంబరత్వమూ ఉండాలి. కాని, ఏమాత్రం తేల్చిపారెయ్యడాన్ని గానీ, వట్టి ఫోటోగ్రఫీనిగానీ మనం పూర్తిగా ఎదుర్కొంటాం. కవిత్వం మానవ జీవితాన్ని గురించిన సమగ్రమైన కళా దృష్టితో మన అనుభవాన్ని పెంపొందించాలి గాని, దానంతట అదే అతి సాధారణమైన పరిస్థితులకు దిగజారిపోరాదు. 'జీవితప్రకృతి నిరలంకారమైన సువర్ణంలాంటిది. అందువల్లనే ఆపుతడిని ఇతడి నుంచి ప్రత్యేకించి గుర్తించలేక చాలా మంది స్వీకరించడానికి నిరాకరిస్తా' రని ఉత్తమ రష్యన్ విజ్ఞానవేత్తా 19వ శతాబ్దపు ప్రజాస్వామికవాదీ అయిన చెర్నిషేవిస్కీ వ్రాశాడు. ఈ సువర్ణాన్ని ఏరుకోడంలోఉండే సమర్థతే కవికి ముఖ్యంగా కావాలి అని పెర్ట్సోవ్ చెప్పాడు.

రచయితకు నిజాయితీ అనేది తప్పనిసరిగా వుండాలని ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ అన్నాడు. తన భావ ప్రపంచములోనుంచి పాఠకుడు విశాల విశ్వాన్ని సందర్శించేటట్లు చేయడంలో రచయిత సమర్థుడు కానట్లయితే అతని రచన ఏదో చెక్కడప్పని కావచ్చుగాని, కళా సృష్టిమాత్రం కాదు.

టిహాన్గోవిస్కీ, నేడు ప్రజల్లో కవిత్వం ఎంత ప్రచారంలో వున్నదీ, సంగ్రహంగావివరించాడు. యువరచయితలు తమ కవిత్వం పుస్తకాలబీర్వాల్లోనుంచిప్రజల్లోకి పోయి ప్రచారం పొందేటట్లు చూసుకోవడం ప్రధాన కర్తవ్యమని ఆయన ఉద్బోధించాడు.

శామ్యూల్ మార్షక్ అనే కవి బాల సాహిత్యాన్ని గురించి మాట్లాడాడు. అత్యంతం ఉపయోగకరమైన ఈబాలసాహిత్యం వంకకు యువరచయితలు దృష్టి మరల్చాలని ఆయన చెప్పాడు.

యువరచయితలఉపన్యాసాలు సభలో చెప్పుకోదగినంతగా ఉత్సాహం రేకెత్తించాయి.

సెర్గీనెరోవ్ పెటోవ్ అనే కవి, అనేకమంది యువరచయితల రచన

లను గురించి ప్రేక్షకులకు పరిచయం చేశాడు ఈ యువరచయితల్లో చాలామంది యుద్ధరంగంలో పనిచేశారు, వారి ప్రథమ రచనలు కూడా యుద్ధ విషయాలను గురించే వచ్చాయి

ఈ యువరచయితలను పరిచయం చేస్తూ, నెరోవ్ పెటోవ్ ఇలా అన్నాడు యుద్ధవిషయాలను గురించి కాక, ఈ రచనలు "మరో విధంగా వుండడానికి అవకాశం లేదు యుద్ధరంగంలోని మహాగ్నుల మధ్య, సొరంగాలలో మాతొలిరచనలు వ్రాయబడ్డాయి మేము చూసిన విషయాలను గురించీ, మేము అనుభవిస్తున్న జీవితాన్ని గురించీ వ్రాశాము

"శాంతియుతమైన పరిశ్రమా, దేశ పునరుద్ధరణా, గంభీరమైన పునర్నిర్మాణ కార్యక్రమాలతో కూడిన ఇప్పటి జీవితం మా రచనల్లో నూతన వస్తువును సమకూరుస్తున్నది"

ప్లాటూన్ వొరొంకో యుక్రేనియన్ యువ కవులను గురించి మాట్లాడాడు సిడార్ కోవ్పాక్ నాయకత్వంక్రింద పనిచేసిన గొరిల్లా దళంలో పాటూన్ వొరొంకో కూడా ఒకడు ఆయన వ్రాసిన పాటలు తోటిసైనికులకు యుద్ధగీతాలుగవినియోగించాయి

బెలోరష్యా, లెనిన్‌గ్రాడ్, యుజ్‌బెకిస్థాన్, మోల్డేవియా, కజకిస్థాన్ మొదలైన వివిధ ప్రజాస్వామికాలనుంచి వచ్చిన యువ రచయితలు తమ తమ రచనలను పరిచయం చేశారు

మహాసభా సాధారణ సమావేశానంతరం, యువరచయితలకార్యక్రమాన్ని గూర్చి సవిమర్శకంగా చర్చించుకోడానికి, మూడురోజులు ప్రత్యేక సమావేశాలు జరిగాయి

ఎ సుర్కోవ్, ఇ డాల్మటొవిస్కి మొదలైన సుప్రసిద్ధ కవుల ఆధ్వర్యాన జరుపబడిన 7 కవితా సమావేశాల్లోను మొత్తం ఎనిమిది వందల గీతాలను గురించి చర్చించారు

వచన రచన మీద జరిగిన ఐదు సమావేశాల్లోను నలభై మంది రచయితలరచనలను గూర్చి చర్చించబడింది

(మిగతా 40 వ పేజీలో)

ప్రాణం కైపోరు ★ ప్రమథేశ్

[తెలంగాణా ప్రజల సమరంపైన]

ఇక నెత్తురు లేదని తెలిసీ
దాహం తీరని కొరడా
"ఎదురిస్తే
మృత్యుశిక్ష
కాదంటే
మరఫిరంగి
వద్దంటే
విషవాయువు
నోరెత్తిన
మట్టి కొట్టు
కాళ్ళక్రింద పడిచావండి
అణిగి మణిగి చావండి
అవరోధం చెప్పకండి
తోలుకరా నీకన్నదాన్ని
తోలుకరా నీభార్యను
తోలుకరా నీతోబుట్టువు
రాత్రికి నీపలికజల్సాకై,
రానంటే నెత్తురుచూస్తా"
ప్రజను పశువుచేసి
పగలు రాత్రి
సాగిన 'ప్రాణవేట',
లక్షలాది కొంపలార్చి

లక్షల కధికారులు
జమీందార్లు జాగీర్దార్లు
దేశముఖులు అమీన్లతో
అహర్నిశలు
అవిచ్ఛిన్నమై జరిపిన
నర మాంసపుడిన్నర్
నర రక్తం
త్రాగితూగు కల్లుపాక
ఇది న్యాయం
ఇది ధర్మం
ఇది స్మృతిశాస్త్రం
ఇది తెల్లదొరల పదచ్ఛాయ
మొలిచిన నల్లదొర ఛత్రచ్ఛాయ
ప్రళయం వస్తున్నది—
గగనంలో
గాలి వాన
మొదటి మెరుపు మెరసిందటు—
దిగ్వలయం
వణికి వణికి చలిదుప్పటికప్పుకుంది
భూమి కడుపు
భూకంపపు
కాలి గజ్జ కట్టుకుంది —

బ్రహ్మాండం
నిప్పులు ఉమ్ముస్తోంది—

గ్రామగ్రామంలో
మరఫిరంగి పేర్చిన
కార్చిచ్చుల మగ్గిన
పచ్చనికాపరాల బూడిగుట్ట
క్రోధమన్న ప్రాణంతో
పునర్జన్మ లెత్తుతోంది—

జానిసజగత్తు కదలింది—
ఓర్చదురా ఇక
ఓర్చ లేదు
ఓర్చదురా మాప్రజ.

పేర్చిన కార్చిచ్చుల
చిత్రవధల చీకటిగది
నీ పరిపాలన

ఓర్చదురా
ఇక ఓర్చ లేదు
ఓర్చదురా మాప్రజ !

పదండిరా పదండి
పల్లెపల్లె కదలిరండి
ఒకటి కండి
కదన భూమికురికి రండి
ప్రళయాగ్నుల కురియరండి
పదండరా
పదండి పదండ

గృహిణులు, గృహస్థులూ
పిల్లలు పాపలు
గడపగడప కదలిరండి !
పదండిరా ! పదండి !

అభిమన్యులు అర్జునులూ
రుద్రమలూ మాంచాలలు
రండి రండి పదండి
ధరిత్రి మనదిమనది
చరిత్ర మనది మనది
'తెలంగాణా' మనది మనది
'కింగ్ కోటి' మనది మనదే
హైద్రాబాద్ మనది మనది
బ్రతుకు మనది భావి మనది
సమ సమూ మనది మనది
రండి రండి కదలిరండి

దోచిన మన ఆస్తులు
కాల్చిన మన ఇండ్లూ
కూల్చిన మన కొంపలు
మరల మనం
మహాక్రమణ చేద్దాం !

ఇపుడిపుడే
మన ముందే
కూలినకోటికోటి వీరులశవములు
వెనువెంటనె
లేచినిల్చి
ముందుకురికి

'చావదురా ప్రజచావదు
చావదురా చావదు"
అంటున్నవి.
పదండిరా పదండి పదండి—
మరవకండి నరహంతల
కటకటాల కౌగిట
మంచుగడ్డలై మారిన
మానవతుల
ఫాలస్థల వీధుల
ఆరలేదు
భయస్వేద బిందువులవి !
పదండిరా పదండి

మన కోటలుమనంకట్టి
మన భూములు మనంపండి
మన రాజ్యం మనంఏలి
మన బ్రతుకుల బ్రతికించే
మహారణం
రమ్మంటుంది
పదండిరా పదండి !

ప్రతినరుడూ
తను నరుడని తెలిసిన
చైతన్యోచ్ఛస్థాయీ రణవిముక్తి
పిలుస్తోంది!
పదండిరా ! పదండిరా ! పదండి !

(37 వ పేజీ తరువాయి)

ఎస్ మార్షక్, వి. స్మిర్నోవ్వాల ఆధ్వర్యాన జరిగిన బాల సాహిత్య సమావేశాల్లో, పిల్లల కోసం వ్రాసినకథలూ పద్యాలూ పాటలూ చర్చించ బడ్డాయి.

మాస్కోలో వున్న కాలంలో సుప్రసిద్ధ కళావేత్తలను కలుసుకొని, వారి సలహాతీసుకోడానికి యువ రచయితలకు అవకాశం చిక్కింది. సైబీరియానుంచి వచ్చిన నికోలాయ్ మీాసెక్, సెవోలాడ్ విష్నేవిస్కీతో ఒక రోజు గడిపి, ఆయనకు తనయుద్ధ గాథలను చెప్పాడు. చాలామంది యువకవులు నికోలాయ్ టిఖనోవ్ సలహాలను పొందారు.

ఈ సమావేశ ఫలితాలను స్పష్టంగా వివరిస్తూ,యుక్రేనియన్ రచయిత ప్లాటాన్ వొరోంకో ఇలాఅన్నాడు:

ఈ మహాసభ ఇందులో పాల్గొన్న వారికే కాక, పాల్గొన లేకపోయిన మన సోదరులందరికి కూడా మహత్తరమైనప్రయోజనం కలిగిసుందని నేను నమ్ముతున్నాను"

— సోవియట్ 'లిటరేచర్' నుంచి

★ కోసక్ ★

మూలం చెకోవ్

అనువాదం నటరాజు

●

మాక్సిం దక్షిణరష్యాలో నివసించే ఒక రైతు. ఒకనాటి ప్రొద్దున్నే పడుచు పెళ్ళాన్ని వెంటబెట్టుకుని చర్చికిపోయి, దైవంయొక్క ఆశీర్వాదం పడి పవిత్రం చెయ్యబడిన ఈస్టర్ గొట్టెను కళ్ళనద్దుకుంటూ ఉత్సాహంగా ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఇంకా పొద్దు పొడవనేలేదు. తెల్లవారేముందు నింగి నీలాలపై తెరలు తెరలుగా కదిలే మసకవెల్తురు ముసుగుల్ని చీల్చుకుంటూ ఎర్రటి బంగారపురంగుల్లో తూర్పు దిక్కు తళుక్కుమంటోంది. అంతటా ప్రశాంతత......... పిట్టలింకా నిద్ర మేల్కో లేదు. దూర దూరాన పచ్చటి పరిసరాల్లో కోకిలపాట వినపడుతోంది. ఊరిబైట ఎత్తున దిబ్బలపైన నిద్ర మత్తులో రెక్కలూపుతూ ఎగురుతోంది డేగ. ఎటుచూసినా ఆ మైదానంలో మరొకప్రాణి మెదులుతున్నట్టు కనపడ్డం లేదు.

ఈవేళ క్రైస్తు అవతరించాడు. ఇంతకంటే మహాపండుగ మరొకటిలేదు. ఇల్లాగే అనుకుంటూ ఆనందంగా బండి ముందుకు నడిపిస్తున్నాడు. వయస్సు ముదిరిన తర్వాతగాని మాక్సిమ్‌కి పెళ్ళికాలేదు. ఈనాడు ఇల్లాలితో కలిసి ఈస్టర్ పండుగ చేసుకుంటున్నాడు ఇక అంతకంటె ఆనందం మరొకటేముంది! అతనికిప్పుడు. కళ్ళపడిన ప్రతివస్తువూ ఎంతో అందంగా కనబడుతోంది. మనసులో మధుర భావాలు మెదులుతున్నాయి. ఒక్కసారి తన వ్యవసాయంమాట గుర్తుకొచ్చింది. ఎక్కడా ఏచిక్కూ లేకుండా సాఫీగానే సాగిపోతోంది. ఏదో వచ్చే ఆదాయంలో ఇల్లు పొదుపుగా చక్కబెట్టుకుంటే అంతేచాలు—అతను కోరేది కూడా అదే—ఇంటినిండా కావలసినవన్నీ వున్నాయి. ఒక్కసారి భార్య ముఖంలోకి ముచ్చటగా చూశాడు. ఆమె తనకెంతో అందంగా, అణకువగా అగపడింది. తూర్పు దిక్కుమీద మెరిసే అరుణ కాంతులు, నేలమీద పచ్చటి పచ్చిక, టకటకమంటూ నడిచేబండి, పైన రివ్వునెగిరే డేగ—వీటినిచూసి సంతోషం పట్టలేక పోయాడు. దారిమధ్యలో బండిదిగి ప్రక్కనున్న దుకాణంలోకిపోయి సిగరెట్ కాల్చుకుని, ఒక గ్లాసు పానీయం పుచ్చుకున్నాక మరీ చెప్పలేనంత ఆనందం అనుభవించాడు.

"ఈరోజొక పర్వదినం అన్నారు పెద్దలు" అంటూ తోటివాళ్ళతో ముచ్చటించ సాగాడు

"అవును, నిజంగా ఈ రోజొక పర్వదినం. లిజావెటా ! ఒక నిమిషం ఆగు

మరో క్షణంలో సూర్యుడు నాట్యం చేస్తాడు. చూసిపోదాం. ఏటా, ఈస్టర్ పండుగనాడు నాట్యంచేస్తాడు. సూర్యుడి క్కూడా ఇదొక పండుగే.

"సూర్యుడికి ప్రాణంలేదు" భార్య అన్నది.

"అబ్బే, కాదు, కాదు. అక్కడకూడా మనుషులున్నారు. నిజం ముమ్మాటికి నిజం. ఇవాన్ కూడా నాతో చెప్పాడు. అన్ని గోళాల్లోనూ మనుషులున్నారుట. సూర్య లోకంలో చంద్రలోకంలో కూడా! నిజంగానే.....కాని చదువుకున్నవాళ్ళు అబద్ధం చెప్పారేమో! ఎవడికి తెలుసు. అంతా మాయ! ఆగు, అటుచూడు. ఆ కదిలేది గుఱ్ఱంకాదూ? ఆ, అదే.

ఇంటికిపోయే దారిమధ్య, వంపుతిరిగిన కొండలోయ కెదుట కదలకుండా నిలబడ్డ చోటే నిలబడి, ఎండుగడ్డిని వాసనచూస్తూ వున్న ఒక గుఱ్ఱం మాక్సిమ్ దంపతుల కళ్ళపడింది. ప్రక్కనే ఒక చిన్న రాతి గుట్టమీద ఎర్రటి జుట్టుగల కోసక్ మోకాళ్ళమీద తల వాల్చుకుని, పాదాల కేసి చూస్తూ కూర్చున్నాడు.

"ఓహో! ఈవేళ ఇక్కడ క్రీస్తుఅవత రించాడు" మాక్సిమ్ ఆశ్చర్యంతో అరి చాడు.

"నిజంగా యీవేళ క్రీస్తు అవతరిం చాడు" కోసక్ తల పైకెత్తకుండానే జవాబిచ్చాడు. "నీ వెక్కడికి వెడుతు న్నావు"

"సెలవుమీద ఇంటికిపోతున్నా"

"అయితే ఇక్కడ కూర్చున్నా వేందుకు?"

"ఎందుకా.....జబ్బొచ్చి పడిపో యాను.....కదలడానిక్కూడా ఒంట్లో ఊపిరిలేదు.

"ఏం, ఏంబాధ!'

"ఒళ్ళంతా ఒకటేపోటు"

"అయ్యో! యెంత దురదృష్టం. అందరూ హాయిగా పండుగ చేసుకుం టుంటే, నీకీ దురవస్థ దాపరించిందే! ఊళ్ళోకి పోకూడదూ! పోనీ సత్రంలో కైనా సరే. ఇక్కడుంటే ఏంలాభం."

కోసక్ మెల్లిగా తల పైకెత్తి నీర సంగా వున్నకళ్ళతో తనకెదురుగావున్న మాక్సింమ్ దంపతుల్ని, గుర్రాన్ని పరీక్షగా చూశాడు.

"చర్చికి వెళ్ళివస్తున్నారా?"

"అవును"

"అందరికీ అక్కడ పండుగ. నాకీ రోడ్డుమీద పండుగ. దేవుడు నన్నింటికి జేర్చదలచుకోలేదు. తలుచుకుంటే గుర్రా నెక్కి ఒక్క దూకులో ఇంటికిపోయి పడ గలను. కాని ఒంట్లో ఊపిరిలేదు...... మిమ్మల్ని చూస్తే చాలామంచి మనుషుల్లా కనబడుతున్నారు.

ఆ"యీస్టర్ రొట్టె ఈదారి పోయే వాడిక్కూడా పెడితే మీకెంతో పుణ్య ముంటుంది. నన్నీ పండుగపూటకూడా పస్తు పడుకోకుండా చూడండి"

"ఈస్టర్ రొట్టేనా! తప్పకుండా... ఆగు, ఇప్పుడే ఇస్తా" మాక్సిమ్ అన్నాడు. మాక్సిమ్ చటుక్కున జేబులో చెయ్యిపెట్టి వెతుకుతూ ఒక్కసారి భార్య ముఖంలోకి చూసి అన్నాడు

"నా దగ్గర చాకు లేదే! ఎల్లాగ కోసేది. రొట్టె విరుస్తే పొడైపోతుంది ఎల్లాగ. చిక్కొచ్చి పడిందే. చూడు నీదగ్గర చాకుందేమో"

కోసక్ చాకు తీసుకొద్దామని మూల్గుతూ లేచాడు.

"ఏమిటి నీ ఉద్దేశ్యం. రొట్టె కోస్తే మాత్రం నేనూరుకోనేది లేదు; రొట్టెను కోసి తగలేసి ఇంటికి తీసికెడితే, చూచిన వాళ్లు నన్నేమనుకుంటారు. ఊళ్ళోకి పోయి ఎక్కడో అక్కడ నాల్గు ముద్దలు అడుక్కో!" అన్నది భార్య. రుమాల్లో చుట్టియున్న ఈస్టర్ రొట్టెను భర్త చేతుల్లోంచి లాక్కొని "కొయ్యడానికి వీల్లేదు. ఏపనికైనా ముందు మంచీ చెడ్డా చూసుకోవాలి. ఇది కొయ్యరొట్టె కాదు. పవిత్రమైన ఈస్టర్ రొట్టె. కోస్తే కళ్లుపోతాయి. మహాపాపం మెడచుట్టుకుంటుంది."

"సరే, బాగా నేవుంది. కోసక్! కొప్పడకు. మా ఆవిడ అడ్డుపెడుతోంది. నమస్తే, మధ్యదారిలో నీ అదృష్టం బాగుంటుందిలే!"

మాక్సిమ్ కళ్లెం విదిలించాడు. టకటక్ మంటూ బండి సాగిపోయింది. కొంతసేపైనాక భార్య సణగడం ప్రారంభించింది. ఇంట్లో అడుగెట్టకముందే రొట్టెను రెండు ముక్కలుచేస్తే ఎంతో దోషం. ఎంతో హానికరం అంటూ నొక్కి నొక్కి నిర్ధారణ చేసేసింది. తూర్పు దిక్కున పైకెగబ్రాకుతున్న సూర్య కిరణాలు దూదిపింజల్లా కదులుతున్న మబ్బుల్లోంచి దారిచేసుకుంటూ నేలమీద పడుతున్నాయి పైన ఆకాశంలో పిట్టకూతలు ప్రతిధ్వనిస్తున్నాయి. ఇప్పుడు మైదానంలో మూడు డేగలు మాత్రం ఒకదాని తరువాత ఒకటి దూర దూరంగా ఎగురుతున్నాయి. పచ్చగడ్డిమీద మిడతలు గంతులేస్తున్నాయి.

ఆ కొండలోయదాటి దాదాపు ఒకమైలు దూరం వచ్చినాక మాక్సిమ్ వెనక్కి తిరిగి చుట్టూ ఒకసారి కలియజూసి దూర పరిసరాల్లోకి దృష్టి సారిస్తున్నాడు.

"ఇక మళ్ళీ ఆ కోసక్‌ను చూడలేను. పాపం. నిర్భాగ్యుడు. మధ్యదారిలోనే జబ్బొచ్చి పడిపోయాడు. అంతకంటె దురదృష్టం ఏముంది. ఇంటికి పోవాలి. కాని పోయేశక్తి లేదు...ఏంచేస్తాడు. ఎక్కడో మధ్యదారిలోనే పడిపోయి ప్రాణం విడుస్తాడేమో! రిజావెటా! పాపం నోరువిడిచి అడిగినందుకు రొట్టెలో కాస్త ముక్కైనా పెట్టాల్సింది. పండుగపూట పస్తు పడుకోనివ్వకండి అన్నప్పుడైనా మనం విధిగా ఇచ్చి తీరాల్సింది"

పొద్దు పైకిలేస్తోంది. సూర్యుడు నాట్యం చేస్తున్నదీ, లేనిదీ మాక్సిమ్ మళ్ళీ అటుతిరిగి చూడనేలేదు. ఇంటికిపోయి దారిపొడుగునా మౌనంగా ఏదో ఆలోచిస్తూనే వున్నాడు. ఏదో ఒక తెలియని వేదన ఆతన్నావహించింది. పండుగనాటి వుత్సాహం మచ్చుకైనా లేక మాయమైపోయింది. "ఇంటికివచ్చినాక పనివాళ్ళని పల్కరిస్తూ" ఈవేళ క్రీస్తు అవతరించాడోయ్" అంటూ ఏదో విధంగా మాటలధోరణిలో పడ్డతర్వాత మనస్సుకి రవంత వుపశాంతి లభించింది. కాని తిండి తినబోయేముందు తనవంతు

ఈస్టర్ రొట్టెను నోట్లో వేసుకోబోతూ భార్యవైపు విచారంగాచూస్తూ అన్నాడు.

“పాపం కోసక్‌కి కాస్త ముక్కయినా ఇవ్వలేకపోయాం. ఆమాత్రం వుపకారానికి మన మనసొప్పిందికాదు.”

“ఏమిటీ! అంతా ఛాదస్తం. నామాట మీద పడి పీక్కుతినేస్తున్నావు.” బుజాలూపుతూ భార్య ఆశ్చర్యంగా అనసాగింది; “ఎక్కడో నడిరోడ్డుమీద ఈస్టర్ రొట్టెను దారేపోయేవాడికి దానం చెయ్యడం ఎక్కడ నేర్చుకున్నావు. అదేం కొయ్యరొట్టి అనుకున్నావా? ఇప్పుడైతే ఎవరికైనాసరే పిలిచిపెట్టు. రొట్టి కోసి బల్లమీద సిద్ధంచేసి వుంచాను— నీ కోసక్‌కని కూడా! నాకుమాత్రం మళ్లా కళ్లు తింటే గిట్టదా!”

“సరే బాగానేవుంది. కోసక్ అడిగినప్పుడు తప్పకుండా కాస్త ముక్కైనా పెట్టాల్సింది...పాపం .ముష్టి వాడికంటె కనాకష్టంగావున్నాడేం ఇంటికిదూరంగా ఎక్కడో నడిరోడ్డుమీద జబ్బొచ్చి పడిపోయాడే!”

మాక్సిమ్ గ్లాసులో సగం టీ మాత్రం తాగాడు. తిండి తినేలేదు. మరేదీ ముట్టుకోనేలేదు. ఆకలి అణగారిపోయింది. తాగిన టీ వికారం పుట్టించింది. మళ్ళీ ఏదో ఆందోళన. విచారంతో కృంగిపోయాడు. ఏదోవిధంగా ఎంగిలిపడ్డ తర్వాత దంపతులిద్దరూ పడగ్గదిలోకి పోయారు. రెండుగంటలు గడిచాక లిజావెటా లేచి చూసేటప్పటికి మాక్సిమ్ ఒక్కడు కిటికీకెదురుగా నిలబడి బైటికి తీక్షణంగాచూస్తున్నాడు.

“అప్పుడే లేచావా!” భార్య అడిగింది. ఎందుకో! కంటికి కునుకే పట్టింది కాదు. లిజావెటా! మన కేమాత్రం కనికరం మంటూలేదు. ఇద్దరం కోసక్‌ని నిర్దయగా చూశాం.” నిట్టూర్చుతూ అన్నాడు.

“మళ్ళీ కోసక్ మాటేనా! నిమిష నిమిషం నీ బుర్రలో బొంగరంలా తిరుగుతున్నాడన్న మాట” ఆవలిస్తూ అన్నది భార్య.

“రాజుకు సేవచేశాడు. రక్తంకూడా ధారపోసి వుంటాడు. మనం అతన్ని పంది లాగ చూశాం. అతన్ని ఆదరంగా మన ఇంటికి తీసుకొచ్చి కడుపునిండా భోజనం పెట్టాల్సింది. అంతవరకూ ఎందుకు ఆఖరికి కాస్త రొట్టెముక్క యివ్వలేకపోయాం.”

“నువ్వాయీస్టర్ రొట్టెను అపవిత్రం చేస్తున్నా మాట్టాడక ఊరుకున్నాననుకో. అందులో అది దైవప్రసాదం కూడా. నీవక్కడే, ఆ నడిరోడ్డుమీదే రొట్టె రెండు ముక్కలుగా చేసేసేవాడివి. ఇంటికి తిరిగివచ్చేటప్పటికి అందరిలోనూ తలవంపులు నాకు రాకపోయేవా?”

మాక్సిమ్ ఏంజవాబు చెప్పకుండానే ఛటుక్కున వంటింట్లోకి పోయాడు. రొట్టెముక్క నొక రుమాల్లోచుట్టి మళ్ళొక డజను కోడిగుడ్లు మూటకట్టి తిన్నగా పనివాళ్ళ దగ్గరికి పోయాడు.

“కుజ్మా. ఆసితారు అక్కడపెట్టు. గుర్రాన్నెక్కి తిన్నగా ఆ కొండలోయ దగ్గరికి వెళ్లు. అక్కడే ఒకచిన్న రాతి గుట్టమీద జబ్బులో పడివున్న కోసక్ కనబడుతాడు. ప్రక్కనే ఒక గుర్రం

కూడా వుంటుంది నువ్వీమాట తీసుకు పోయి అతనికిచ్చిరా. ఎక్కడికీపోడు. ఇంకా అక్కడే వుంటాడులే."

మాక్సిమ్ మనస్సు కాస్త కుదుట పడింది. ఎన్ని గంటలు ఎదురుచూచినా కుజ్మా తిరిగి రానేలేదు. వేచి, వేచి, ఆఖరికి విసుగెత్తి తనుకూడా ఒక గుర్రాన్నెక్కి ఆదుర్దాగా అక్కడికే బయల్దేరాడు. సరిగ్గా ఆ కొండలోయ కెదుట కుజ్మాను కలుసుకున్నాడు.

"ఏం, కోసక్ కనబడ్డాడా? "లేదు. ఎక్కడ వెతికినా అతనిజాడ కనపడలేదు"

"హు......ఏంఅవస్థ." కుజ్మాదగ్గర మాట తీసుకుని మాక్సిమ్ గుర్రాన్ని దూకిస్తూ, వేగంగా దౌడుతీస్తూ ముందుకు పోయాడు. పోతూ ఒక పల్లెలో కనపడ్డ రైతుల్ని పిలిచి అడిగాడు.

"స్నేహితులారా! గుర్రం మీద పోతూవున్న కోసక్ ని మీరు చూచారా? అతడీదారినే పోయాడా! ఎర్రటి గుర్రం మీద పోతూవున్న ఎర్రతల మనిషి మీక్కనపడలేదూ!"

ఆ రైతులు అదేదో వింతగా ఒకరి ముఖాల మరొకరు చూసుకుంటూ, ఎవరో ఆ కోసక్ మా కసలు కనపడలేదన్నారు. 'ఇప్పుడే ఈ దారిన పోస్టుమన్, ఒక్కడే పోయాడు. తర్వాత మరెవళ్లూ ఈ దారిని పోనేలేదు"

వెతికి, వెతికి, మాక్సిమ్ మిట్ట మధ్యాహ్నం వేళకి ఇంటికి తిరిగివచ్చాడు.

"ఆ కోసక్ మాత్రం నాకు మరుపు రాడు. నువ్వేంచేసినా సరే." భార్యతో అన్నాడు "నా మనస్సుకు ఏమాత్రం శాంతి నివ్వకుండా వున్నాడు ఎప్పుడూ అదే, అతన్ని గూర్చే ఆలోచిస్తున్నా. ఒకవేళ దైవం మన మనశ్శుద్ధిని తనిఖీ చేద్దామనుకున్నాడేమో? అందుకే, ఏదేవతకో ఈ కోసవేషం వేసి పంపించాడేమో! ఆ గుట్టమీద కూర్చోమన్నాడేమో! అప్పుడప్పుడు, అల్లాగ జరుగుతూ వుంటుందికూడా. లిజావెటా! నీకాసంగతి తెలుసా. తప్పంతా మనదే. కోసక్ యెడల కఠినంగా ప్రవర్తించాం.

"అస్తమానం, కోసక్, కోసక్ ఒకటే ఘోరణి ఆమాటనే అంటిపెట్టుకుని నన్నూరికే వేధించేస్తున్నావు. కల్లజీడిలా అంటుకుంటే వదిలిపెట్టకుండా వున్నావు." ఇక ఏమాత్రం సహించలేక గట్టిగాఅరిచింది.

"యేమ్, తెలిసిందా! నీకసలు దయంటూలేదు. దాక్షిణ్యం అంతకంటేలేదు..." భార్య ముఖంలోకి చూస్తూ అన్నాడు

పెళ్ళయిన యిన్నాళ్ళకి యిల్లాగుణం ఇల్లాంటిదని ఈ నాడే తెలిసికున్నాడు.

"అవును. నాకు దయాలేదు; దాక్షిణ్యమూలేదు" చేతిలోవున్న చెమిచాతో చప్పుడు చేస్తూ "కాని, చిత్తుగా త్రాగి మత్తెక్కి చిందులు త్రొక్కే ప్రతివాడికీ ఈస్టర్ రొట్టిమాత్రం, ఎంత ఏడ్చినా మొత్తుకున్నా ఇవ్వను."

"కోసక్ త్రాగనే, లేదు"

"లేదూ! చిత్తుగా త్రాగాడు"

"ఐతే నువ్వొక మూర్ఖురాలివి"

మాక్సిమ్ ఛటుక్కున బల్లదిగి నిల్చున్నాడు. తనభార్య కఠినత్వాన్నీ, మూర్ఖత్వాన్నీ, దెప్పుతూ, ఎత్తిపొడుస్తూ తిట్టినా

రంభించాడు. ఆమె కూడా కోపాన్ని హెచ్చు స్థాయిలోకి తీసుకొచ్చి, తిట్టుకు తిట్టు అందిస్తూ, ఆఖరికి వెక్కి వెక్కి ఏడుస్తూ పుట్టింటికి పోతానని బెదిరిస్తూ పడకగదిలోకి పోయింది. మాక్సిమ్ దాంపత్య జీవితం మీద అడుగుపెట్టిన మొదటి కలహం యిదే. గడపదాటి బైటవాకిట్లో, ఏంతో చక, విసుగ్గా, ఇటూ అటూ టచ్చాడుతూ తనకళ్లయెదుట భార్య మొఖాన్ని బొమ్మలు గీస్తుంటే అదెంతో వికృతంగా, అసహ్యంగా కనపడింది. కోసక్ మాత్రం, మాటిమాటికీ మనస్సులో మెదలుతూనే వున్నాడు. అంతకంతకి పిల్చిపిప్పి చేసేస్తున్నాడు. మాక్సిమ్ ఇప్పుడిప్పుడే తన అవస్థను అర్థంచేసుకుంటున్నాడు. జబ్బుపడిన కళ్ళని, నీరశించిన నడకని గుర్తించసాగాడు.

"అప్పుడతని ఎడలఎంతో నిర్దయగా ప్రవర్తించా" మెల్లిగా అనుకున్నాడు.

చీకటిపండింది. ఏదో అ కు రా ని కి అందని ఆవేదన అతన్నావహించింది. భరించలేని బాధ గభీమని గుండెమీద విరుచుకుపడింది. పూర్తిగా కృంగిపోయి భార్య ముఖంచూసి మండిపడుతూ, ఏదిక్కూ తోచక చిత్తుగా త్రాగేశాడు. ఎప్పుడో పెళ్ళికాని క్రితం తరుచుగా త్రాగేవాడు. త్రాగిన మత్తులో మయిమరచి ఈమాటా ఆమాటా. ఇష్టంవచ్చినట్టు వాగేశాడు. నీ ముఖంచూస్తేనే అసహ్యం. ప్రొద్దున్నే పుట్టింటికి పంపేస్తాలే, అంటూ భార్యని అవహేళన చేస్తూ అరిచేవాడు. ఈసర్ట పండుగలో, సోమవారంనాటి ప్రొద్దున్నే మనశ్శాంతికోసం చిత్తుగా త్రాగేశాడు. మళ్ళీ మరోసారి, కైపెక్కి తల తిరిగేదాకా త్రాగాడు.

అదే, అతని పతనానికి ప్రారంభం.

అతని ఆవులు, గొర్రెలు, గుర్రాలు ఒక్కటొకటిగా దొడ్డిదాటి దూరమైపోతున్నాయి. మాక్సిమ్, అడ్డూ అపూ లేక, అదేపనిగా త్రాగేస్తున్నాడు. అప్పులు పెరిగాయి. ఇల్లాలంటే అసహ్యం ఏర్పడింది. తనభార్య కఠినురాలవడం వల్లనే తనకీ దుర్దశ దాపరించిందని నిర్థారణ చేసుకున్నాడు. అదీకాక, అన్నింటికంటె ఎక్కువగా, తాను కోసక్ యెడల చేసిన అపరాధం, దేవుడికి ఎంతో ఆగ్రహం కల్గించి వుంటుందనుకుంటున్నాడు. లిజా వెటా తన కుటుంబ నాశనం కళ్ళారా చూసింది. తప్పెవరిదో ఆమెకు మాత్రం బోధపడలేదు.

విశ్వసాహిత్యములో విప్లవ రీతులు

షా నేర్పిన వ్యంగ్య ప్రదర్శన.

★

రచయిత : శ్రీ పి. వి. రాజమన్నారు

అభ్యుదయాత్మకమైన ఏ సాహిత్యం కూడా ఒకే ఋజుమార్గం అనుసరించదు. కాలానుసారంగా మారుతూ వుంటుంది. రవీంద్రుడు దీన్నే నదీ ప్రవాహాలతో పోల్చాడు. నది కొంతకాలం సరాసరి నేరుగా ప్రవహిస్తుంది, కొంత దూరం వెళ్ళి హఠాత్తుగా వంపు తిరుగుతుంది. ఒకొక్కచోట దగ్గర దగ్గరలోనే వంపులు తిరుగుతుంటుంది. మళ్లీ తిన్నగా పోతుంది. ఒకప్పుడు నెమ్మదిగా ప్రశాంతంగా ప్రవహిస్తుంది. మరియొకప్పుడు త్రుళ్లిపడుతూ అతిరభసంతో పరుగెడుతుంది. సాహిత్యం కూడా అలాగే. దీన్నే విప్లవం అంటే అనవచ్చును. విప్లవం అనే భావంలో విపరీతం ఏమీ లేదు. ప్రపంచ పరిణామంలో అభ్యుదయ మార్గానికీ, విప్లవానికీ సన్నిహిత బాంధవ్యం ఉంటుంది, ఉండకతప్పదు. అభ్యుదయ భావంలో మార్పు ప్రధానాంశం. విప్లవానికి మార్పే ప్రోద్బలం, ఆశయం.

ఒకయుగంలో సాహిత్యరీతులు ప్రధానంగా ఆనంద ప్రదాయకంగా ఉంటవి. ఉపదేశంకన్నా ఆనందమే లక్ష్యంగా ఉంచుకొంటారు ఆ యుగం కవులు. దేశంలో శాంతి, సంపద, సమృద్ధి ఉన్నప్పుడు కవిత ఈమార్గం అనుసరిస్తుంది. ఇంగ్లాండులో ఎలిజబెత్ రాజ్యం చేసిన రోజులు, మన దేశంలో విక్రమాదిత్యుని కాలం, విజయనగర సామ్రాజ్య వైభవ యుగం ఉదాహరణలు.

ఇతర యుగాల్లో సాహిత్యం ఉపదేశ ప్రధానంగా వికసిస్తుంది. ఇంగ్లాండులో ఎలిజబెత్ తర్వాత యుగం అలాంటిది. సంస్కృతవాఙ్మ

యంలో సహా ఈ భేదం గోచరిస్తుంది. కాళిదాసునాటకాలకును, ప్రబోధ చంద్రోదయానికిని ఎంత వ్యత్యాసం ఉందో చూడండి.

ఆధునికయుగంలో ప్రపంచం విషమ పరిస్థితులతో నిండిపోయి ఉండటంచేత, ఆధునిక సాహిత్యంలో ఆనందంకన్న ఉపదేశమే ప్రబలంగా స్ఫురిస్తూవుందని చెప్పవచ్చును. వాస్తవికత, యదార్థజీవిత చిత్రణ, సంఘ సమస్యాలోచన - సాహిత్యంలో స్పష్టమవుతూ ఉన్నవి.

విశ్వసాహిత్యంలో నవయుగ రచయితలలో అగ్రగణ్యుల్లో ఒకడు బెర్నార్డ షా. జన్మభూమి ఐర్లాండు. భాష ఇంగ్లీషు అయినా షా నిస్సందేహంగా విశ్వకవి.

అతడు నవలలు, వ్యాసాలు వ్రాసినా ఆయన ప్రతిభ అంతా నాటకాల్లోనే మూర్తీభవించి ఉంది. దాదాపు ౪౦ నాటకాలు వ్రాశాడు ఇదివరకు, తొంభైఏళ్లు దాటినా ఇంకా వ్రాస్తూనే ఉన్నాడు. ఇతని రచనలన్నింటిలోనూ ఉపదేశలక్షణం సామాన్యంగా సంపూర్ణంగా వ్యక్తమవుతుంది. షా ఈ విషయం మాటిమాటికి తానే ప్రకటించిఉన్నాడు. “నాటకం అంటే కెమేరాతో ప్రకృతి చిత్రాలు తియ్యడంకాదు. మానవునికిన్నీ పరిస్థితులకున్నూ జరిగే పరస్పర సంఘర్షణను ప్రదర్శించటమే నాటకం” అని అన్నాడు. ఈ సందర్భంలో ఇతనికి చాలావరకు ఇబ్సెన్ అనే నార్వేదేశపు నాటకకర్త మార్గదర్శకుడు.

ఇతని రచనలలో మహత్తరమైన విశేషగుణమేమంటే - సంస్కారదీక్ష. ప్రతిక్షణమూ ప్రత్యక్షమవుతూ వుంటుంది. అయితే ఇతడు మహాకవి గనుక నీతిని వాచ్యరూపంగా బోధించడు. వ్యంగ్యరూపంగా వాచ్యంకన్నా నిశితంగా బోధిస్తాడు. సాంఘిక జీవితంలో, వ్యక్తిజీవితంలో పాదుకొన్న అసత్యాలు విచ్చలవిడిగ జరిగే అన్యాయాలు, నివురుగప్పిన నిప్పు మోస్తరుగా దహించివేసే దౌర్జన్యం వీటిమీద ప్రయోగిస్తాడు తన బుద్ధిబలం. తన దివ్యదృష్టి, తన చాతుర్యం. పనికిమాలిన వెర్రి నమ్మకాల్ని, నిరర్థకమైన శుష్కాచారాల్ని,

లోకాన్ని మోసబుచ్చే కపట వేషాల్ని నిర్మూలనం చెయ్యడానికి కంకణం గట్టుకొని తన యావత్ శక్తి ధారపోసిన మహానుభావుడు.

అసత్యం, అక్రమం, అన్యాయం, అవినీతి - వీటిమీద ఇతడు ప్రయోగించే అస్త్రం - దూషణ కాదు. అంతకన్నా బాగా హృదయంలో గ్రుచ్చుకునే అస్త్రం - పరిహాసం, వెక్కిరింపు. దీన్నే ఇంగ్లీషులో శటైర్ అంటారు. తప్పుచేసిన వాడిని తిట్టి కొట్టి బాధించడం కన్నా, ఆతప్పు బహిరంగం చేసి నలుగురిలో అవమానించి పరిహాసించడం ఎక్కువ ప్రయోజకంగా ఉంటుంది.

వక్రోక్తి ఇతని రచనకు జీవం. ఎటువంటి విషమ సాంఘిక సమస్య గురించి అయినా, శాస్త్రసిద్ధాంతం గురించి అయినా, ఆర్థిక విషయం మీదైనాసరే ప్రేక్షకుల్ని పాఠకుల్ని విరగబడి నవ్వేటట్లు చేయగల సామర్థ్యంఉంది ఇతనికి. హాస్యరసం ఎన్నివిధాల నిష్పన్నం కాగలదో ఇతని నాటకాలు, ఉపోద్ఘాతాలు చదివితే తెలుస్తుంది.

అయితే ఇతని పరిహాసంలో ద్వేషం ఏమాత్రమూ ఉండదు. మనతోబాటు అతడూ నవ్వుతూ ఉంటాడు. అతని విశాల హృదయంలో నీచత్వానికి, మాత్సర్యానికి దురాగ్రహానికి చోటేలేదు.

ఇతని రచన ధ్వని ప్రధానమైనది. వ్యంజనచేత నీతిని స్ఫురింపజేయడంలో రాజు ఇతడు. భాష ఉపయోగించడంలో ఇతని కౌశల్యం అసమానం. హఠాత్తుగా విన్నప్పుడు విపరీతంగా తోచినా ఇతని వాక్యాలు ఆలోచనానంతరం సన్మానార్హంగావుంటవి. ఉదాహరణకు కొన్ని—

"స్వాతంత్ర్యం అంటే బాధ్యత. అందుచేతే చాలామందికి స్వాతంత్ర్యం అంటే భయం."

"జీవితమంతా ఆనందమయితే ఏ మానవుడు భరించగలడు. అలాగైతే ప్రపంచం నరకమైపోతుంది."

"గౌరవస్థుడు లోకాన్ని అనుసరించి నడుచుకుంటాడు. వెంకివాడు లోకం తనని అనుసరింపజెయ్యాలని ప్రయత్నిస్తాడు. అందుచేతే అభ్యుదయం ఎప్పుడూ వెంకివాడివల్లనే కలుగుతుంది."

"జీవితంలో చింతకు రెండు కారణాలు. కోరింది లభించక పోవడం ఒకటి. కోరింది లభించడం ఇంకొకటి."

ఇలాంటివి ఎన్నో.

బెర్నార్డ్ షా వ్రాసిన నాటకాలన్నింటిని విపులంగా విమర్శించాలంటే పెద్దగ్రంథం వ్రాస్తేగాని చాలదు. ప్రతీనాటకానికి అతడు దీర్ఘంగా ఉపోద్ఘాతం వ్రాసి ప్రకటించాడు. ఆ నాటకం ఏ విషయం గురించి వ్రాశాడో ఆ విషయంమీద తన అభిప్రాయాలు నిర్భయంగా విస్పష్టంగా విశదీకరించాడు.

షా నాటకాల్లో వస్తుభేదం అనంతం. అతడు వర్ణించని పరిస్థితులు, అతడు వెల్లడి చేయని లోపాలు, అతడు ఖండించని కపట కృత్యాలు, అతడు వెక్కిరించని మూఢాచారాలు, అతడు ప్రదర్శించని సంఘ సమస్యలు ఈ ప్రస్తుత ప్రపంచంలో లేవనే చెప్పవచ్చును. సాహిత్యం, కళలు, వైద్యం, రాజకీయాలు, జాతిమత విరోధాలు, ఆచారాలు - అన్నీ ఇతని నాటకాలకు సామగ్రే. ఇవి అన్నీ ఇతని సంస్కారవహ్నికి ఆహుతులు కావలసినవే. ఈ సంస్థ పవిత్రమైనది, ఈ వ్యక్తి గొప్పవాడు అనే ఆటంకం పాటించనివాడు. సీజర్ అంతవాడిని పరిహసించను వెనుదీయడు. క్రైస్తు అంటే గౌరవం ఉన్నా ప్రస్తుత క్రైస్తవ మతాచారాల్లోవున్న దోషాల్ని వెలిబుచ్చడానికి జంకడు.

విడోయర్సు హౌసెస్ అనే నాటకంలో బీదవారికి ఇళ్లు ఎక్కువ అద్దెలకిచ్చి అక్రమంగా ధనార్జనచేసే భాగ్యవంతుల దుర్మార్గం బయటపెట్టాడు. ఈ దురాచారం కేవలం వ్యక్తిగతమే కాక, సంఘంలోవున్న చీడపురుగులాంటిదని వివరించాడు. నవనాగరికతకు ఆధారభూతంగా వున్న కొన్ని భావాల్ని వేరుతో పెకలించివేస్తేగాని, మానవమాత్రుడు సదభిప్రాయుడైనప్పటికీ సుడిగుండంలో పడిపోయి బయటకి రాలేడని నిరూపించాడు. కథానాయకుడు ట్రెంచ్ ఆదర్శజీవుడే. మంచి ఆశయాలు గలవాడే. సార్టోరియస్ అనేధనవంతుని కుమార్తెను పెండ్లాడ నిశ్చయించుకొంటాడు.

కాని, తనకు మామగారు ఇచ్చే కట్నాన్ని అంగీకరించనంటాడు. ఎందు కంటే మామగారి డబ్బు బీదల నోళ్లుగొట్టి అన్యాయపు టద్దులమీదుగా సంపాదించినదని తెలుసుకోవడంవల్ల. అయితే పాపం తనఆ సికూడా అటువంటిదే, ఆ మసితగిలిందేనని తరువాతగ్రహిస్తాడు. తుదకు క్రమేపి దిగజారి పోతాడు. అధర్మపు వలలో పడి పోతాడు. ఆఖరుకు మామగారితో కలిసి ఇంకా ఎక్కువ ధనం ఎలా సంపాదించడం అనే ఆలోచనకు దిగుతాడు. "సీలన్ సీల యమర్చినట్లు" సంఘంలో వున్న బంధానుబంధాల ప్రాబల్యం చూపించి ఇట్టి బంధాలు తెంపడం పరమ కర్తవ్యమని వ్యంగ్యంగా సూచిస్తాడు.

ప్రపంచంలో సాధారణంగా సత్యాన్వేషణ చాలా తక్కువ. లోకులు పైమెరుగులు చూచి మోసపోతారు. వేషాలకే విలువ ఎక్కువ. ఆత్మ శుద్ధిలేకపోయినా ఆచారంనటిస్తే నమ్ముతారు. పాత్ర లోపల మురికిగా వున్నా వెలుపలికి తళతళా మెరుస్తుంటే తృప్తి పడతారు. స్వార్థపరులు తమ కార్యాలకోసరం దొంగవేషాల్ని, అబద్ధపు సిద్ధాంతాల్ని, కృత్రిమ విశ్వాశాల్ని ప్రచారం చేస్తూ వుంటారు. ఈమాయామయవనికను, మోసపు తెరను, చింపివేయడం బెర్నార్డుషా దృఢసంకల్పం.

ఆరమ్స్ అండ్ దిమాన్ అనే నాటకంలో యుద్ధమంటేపరాక్రమ ధైర్య సాహసాదులకు అవకాశం కల్పించే గొప్ప సంస్థకాదనిన్నీ, దౌర్జన్యం, క్రౌర్యం, నిర్హేతుక విరోధం, దురహంకారంతో నిండిన దుర్మార్గమనిన్నీ చిత్రించాడు.

డెవిల్స్ డిసైపిల్స్ మొదలైననాటకాల్లో మతాచారాల్లో ఎన్నికృత్రిమ వేషాలు, మూఢవిశ్వాసాలు వ్యాపించియున్నవో చాటించాడు. లోకం పూజనీయుడని గణించే ఆచార్యుడికన్న పరమపాపి అని ఎంచేవాడికే ఒకొక్కప్పుడు ఆముష్మికచింత నిజంగా ఉంటుందనిధ్వనింపజేస్తాడు.

డాక్టర్స్ డైలెమాలో ప్రస్తుత కాలంలో వైద్యవృత్తి నవలింబించి, ప్రసిద్ధిబడసి అధికధనార్జనచేసే డాక్టర్ల మీద దాడివెడలినాడు. ఆన్ గెటింగ్ మారీడ్ లో వివాహ

సంబంధం గురించి ఎట్టి అవివేకపు టభిప్రాయాలు ఉన్నవో ఎత్తిచూపాడు. యాపిల్ కార్ట్, జనీవా లాటి నాటకాలు రాజకీయ సమస్యలపైన నిర్దాక్షిణ్యమైన విమర్శలతో క్రిక్కిరిసి ఉన్నవి. జాన్ బుల్స్ అదర్ ఐలెండ్‌లో ఇంగ్లీషు వాళ్లనీ, ఐరిష్ వాళ్లనీ, సమానంగా వెక్కిరిస్తాడు, ఇద్దరి తప్పులూ వర్ణించి.

బెర్నార్డుషా రచనా రీతికి ఉదాహరణంగా మన తెలుగు నాటకంతో పోల్చిచెప్తే వ్యక్తమవుతుంది. చింతామణిలో విషయం వేశ్యాలోలత్వం, దానివల్ల కలిగే బాధలు. మిసెస్ వాలెన్స్ ప్రొఫెషన్ లో కూడా వేశ్యావృత్తే. అయితే ఎంత భేదం వుందో చూడండి రెంటికీ. చింతామణిలో కవి ఘోషించేదేమంటే వేశ్యలు సంసారాన్ని కూల్చేవాళ్లు. కేవల ధనార్జనమే వాళ్ల పరమావధి. అందుచేతవారి సాహసం ఒకవ్యసనంఅని. షా నాటకంవేరేపంథాలో నడుస్తుంది. వేశ్యావృత్తి హీనమైందే. నిజమేకాని ఆవృత్తికి మూలకారణాలేవి? ఏ స్త్రీగాని తనదేహాన్ని అమ్ముకొని జీవించాలంటే, మనసార ఇష్టపడుతుందా? ఈ యంశముల చర్చఎక్కువగా ఉంటుంది. మిసెస్ వాలెస్ వృత్తి పడుపు వృత్తే. అయితే యేవిధంగా ఏకారణంచేత ఈవృత్తి అవలంబించిందోతనకథఅంతాతనకూతురితో చెప్పుకుంటున్నప్పుడు ఎట్టి కఠిన చిత్తుని మనసైనా కరగకమానదు. తల్లిమీద అసహ్యాభావంతోవుండిన కూతురికి ఆమెమీద అప్పుడు గౌరవంకూడా కలుగుతుంది. ఇది ఒకభాగం. ఇంకోభాగం లోకంలో జరిగే కపటనాటకాన్ని ప్రదర్శించడం. ఈ వృత్తినే ఒకవ్యాపారంగా నడిపించడానికి ఏర్పాట్లు చేసి, పెట్టుబడిపెట్టి మహాపట్టణాల్లో, శాఖలు స్థాపించి అధిక లాభం సంపాదిస్తున్న పెద్దమనుష్యుల గుట్టు బయటపెట్టడం. అందులో ఒకరు సర్ పదవికూడా పొందిన గరాణా మనిషి. మిసెస్ వాలెస్ అంటుంది ఒకచోట"అబ్బ ఈ ప్రపంచంలోని కపటం చూస్తే నాకు వెకసంగా వుంది" అని.

ఈ విధంగా వేశ్యావృత్తిని విమర్శించారు షా ఈ నాటకంలో వ్యంగ్యంగా.

షా చూపిన రచనారీతిని అనుసరించడానికి ప్రస్తుతం మన దేశంలో గొప్పఅవకాశాలున్నవి. ప్రతి రంగంలో, రాజకీయ, ఆర్థిక, మత ఆచార వ్యవహారాలలో ఎంత కపటం వ్యాపించి ఉంది. ఎందరు ధూర్తులున్నారు. ఎందరు ఆషాఢ భూతులు, ఎందరు కుహనాసన్యాసులు, ఎందరు వేషగ్రాండు. సాంఘిక జీవితంలో ఎంతకుళ్ళు ఉంది, ఎన్ని నిరర్థక నియమాలున్నవి. ఎట్టి అమానుష శాసనాలు లేవు? కృత్రిమ భావాలు, సత్యాన్ని ఎలా కప్పివేస్తున్నవో. నాటకరచయితలకు, కథకులకు ఎంత వస్తుసామగ్రియైనా ఉంది షా వంటి రచయితలకు.

షా చూపిన మార్గం ఆంధ్ర రచయితలు అనుసరించకపోలేదు. చిన్నకథలు, నాటికలు, ఏకాంకాలు వ్రాస్తున్నవాళ్లు అనేకులు కొద్దిగా గొప్పగా షా రీతులలో పరిచయం గలవారే. గుడిపాటి వెంకటచలంగారి రచనలలో కుటుంబరావుగారి కథల్లో, ఆముంచర్ల గోపాలరావుగారి నాటకాల్లో షా ఛాయ కనబడుతూ వుంది. ఉదహరించడానికి రెండుమూడు పేర్లుమాత్రం. ఇంకాఎందరోవున్నారు. మొన్నమొన్నే పద్మరాజుగారి నాటకం "విలాశిని" చదివాను. అందులోనూ ఆఛాయయే.

అయితే యింకా చాలా అవకాశంవుంది. షావంటి విప్లవ రచయితలు మనకింకాకావాలి, స్వాతంత్ర్యంవచ్చాక తెగని సమస్యలు ఇంకా ఎక్కువవుతవి గాని తగ్గవు. సత్యం కనబడకుండా అడ్డు కప్పిన తెరలు, చింపివేయవలసినవి అనేకములున్నవి. కపటం. క్రౌర్యం కావరం,కల్మషం-వీటివల్ల మన దేశంలో నిండుకొన్న అంధకారం తొలగించడానికి పూనుకొనే షా వంటిరచయితలు కావాలి,

తమసోమా జ్యోతిర్గమయ.

ఎ. ఐ. ఆర్. కు కృతజ్ఞతతో—

వేకువ కేక

శ్రీ పిలకా గణపతిశాస్త్రి

నరనరాల జీర్ణించిన,
తరతరాల నుండికన్న,
వెన్నెన్నో పాడుకలలు!
ఎన్నెన్నో పీడకలలు!

పోయె మాయమయ్యె నోహూ!
రేయి తెల్లవారె నోహూ!

బంగరు మువ్వల గలగల,
చెంగలించు తురగమ్ముల,
నింగి మెరయు, వైద్యుతసిత
భంగములై స్వతంత్రతా

రధ శిఖర పతాక మదే!
పృధివి కదలి యాడునదే!

కలకలమను మహోదయము!
పులుగులగళ నిస్వనమ్ము!
అదె! విజయ మహమ్ము లెందు!
నిదుర వీడికదలి రండు!

శతసహస్ర గళము లెగుర!
జయమ్మనుడు! జనులారా!

నరనరాల జీర్ణించిన,
తరతరాల నుండి కన్న,
వెన్నెన్నో! పాడుకలలు!
ఎన్నెన్నో పీడకలలు!

పోయె మాయమయ్యె నోహూ!
రేయి తెల్లవారె నోహూ!

మైదానంలో

మూలం : రవీంద్రనాథ మైత్రా

అనువాదం సూ గి

★

మధుమండల్ తన కుమార్తె ఉదాసీని ఎనిమిదవఏటనే కన్యాదానంచేశాడు. తొమ్మిదోయేడు రాగానే ఆపిల్లది పసుపు కుంకుమకు దూరమై పుట్టింటికి చేరింది. "ఎంత దౌర్భాగ్యురాలివే మా అమ్మా" అని రాగాలెట్టారు తల్లీ తండ్రీ.

ఆత్మీయుడైన ఊళ్లోశతవృద్ధు ఒకాయన వచ్చి, "ఒక మంచికుర్రవాణ్ణి చూసి, మళ్ళీ ముడెట్టేసెయ్ మండల్ పసిపిల్ల పాపం!"అని సలహా ఇచ్చాడు.

మండల్ పెద్దకొడుకు యదు ఎంట్రన్స్ క్లాసుతో చదువుమానేసి, తమ పూర్వపురుషుల ప్రాభవా[illegible]శయాలను నిలబెట్టాలని తాపత్రయ పడుతున్నాడు. అతడు ముఖం చిట్లించుకుని, "అలాంటి మాటలు తలపెట్టకండి. ఇలాంటి అశాస్త్రీయమైన పనులు మా ఇంటావంటా ఏనాడూ లేవు; ఇహనిప్పుడా—" అంటూ తన వాదానికి విరుద్ధమైనదో,అవిరుద్ధమైనదో, ఎక్కడిదో ఒకశ్లోకం ఉదహరించి- సలహాఇవ్వ నికి వచ్చిన ఆయన్ని స్తబ్ధుణ్ణిచేశాడు. హా తర్వాత ఉదాసీ భవిష్యత్తును గురించి ఆలోచనలతో తలలు పగలగొట్టుకోవాల్సిన అవసరం లేకపోయిందెవరికీ. ఉదాసీ నిర్వికారంగా రోజులు గడిపేస్తోంది.

ఆరు సంవత్సరాలు ఇలాగే గడిచిపోయాయి. ఈలోపుగా, సంసారంలో అట్టే జరిగిన మార్పులేవీ లేవు కాని. మధుమండల్ తన షావుకారిదగ్గిర గుమాస్తాగిరీ వదిలేసి స్వయంగానే వడ్డీవ్యాపారం మొదలెట్టాడు. యదు పెళ్లిచేసుకుని పెళ్లాన్ని కాపురానికికూడా తెచ్చుకున్నాడు. పెళ్లి అయిన సంవత్సరమే బావమరది మాణిక్ సహాయంతో 'మండల్ క్షత్రియసమాజ్' అనే పేరుతో ఒక సంస్థను లేవదీశాడు. కొత్తభార్య ప్రేమాలాపాల్తో పోగా మిగిలిన సమయమంతా సమాజసేవకు వినియోగిస్తూ, ఉండటంవల్ల, మరో పని చేద్దామన్నా అతడికి తీరిక చిక్కేదికాదు. ఉదాసీ ఆడుకోవటం చూసినప్పుడప్పుడు నాలుగు చీవాట్లువేసి, తన భార్య దగ్గిరకు చదువుకోమని పంపుతూ ఉండేవాడు. ఈవిధంగా ఉదాసీ తన పదహారవయేట బాలశిక్ష పూర్తిచేసింది.

ఆ యేడాశ్వయుజమాసంలో ఈసమాజపు వార్షికోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని మండల్‌పూర్ గ్రామమంతా ఉత్సవాలతో తేలిపోయింది. వార్షికోత్సవానికి నెల్లాళ్లక్రితంనుంచే ప్రయత్నాలు విరివిగా సాగించారు. ఊళ్లో మిగతా ఆడపిల్లలతోపాటు ఉదాసీకూడా రంగుకాగితాల తోరణాలు తయారు చెయ్యటంలో నిమగ్నురాలయింది. మామిడిఆకుల తోరణాలు, రంగుకాగితాలతోనూ అలంకరించిన వీధుల్లోంచి— ఒకనాడుదయం కలకత్తానుంచి ఆహ్వానితులైన ఉపన్యాసకులు

మధుమండల్ గారి వీధివరాండాలోకి వేంచేశారు. వాళ్ళతోపాటు యదు స్నేహితుడు లలిత్ కూడా వచ్చాడు. లలిత్ కాలేజీ విద్యార్థి; సభల్లో అక్కడా ప్రబోధగీతాలు పాడటానికి తిరుగుతూ ఉంటాడు తరచుగా. అవసరమయితే గిరజాల క్రాఫు విదిలించుకుంటూ ఉపన్యాసాలు కూడా ఇస్తూ ఉంటాడు. అందుమూలంగా దేశంలోని అందరి నాయకులతోనూ అతడికి కావలసినంత పరిచయం ఉంది.

ఆ సభలు పూర్తిఅయినాయి; నిద్రగోతున్న సంఘంలో చైతన్యాన్ని పురికొల్పి, ఉపన్యాసకులంతా మర్నాడు కలకత్తా ప్రయాణమయినారు. యదు బలవంతం వల్ల లలిత్ మాత్రం ఉండిపోయాడు. తన భార్యకు సంగీతం నేర్పించాలని యదుకు ఎన్నాళ్ళనుంచో మహా ఉబలాటంగా ఉంది. అందుకనే మామగారి దగ్గిరనుంచి వచ్చిన లాంఛనాలలో హార్మోనియమ్ కూడా ఒకటి రాబట్టాడు. కాని, దాని ప్రయోజనం ఇంతవరకూ ఏర్పడలా. ఆ సుయోగం ఈసారి లభించింది. యదు ఈ ప్రస్తావన తీసుకువచ్చేసరికి మధుమండల్ కొంచెం అభ్యంతరాన్ని వెలిబుచ్చాడు; కాని అది నిలవలేదు. ముసలివాడు ఇహ తనకు వడ్డీలుఅదీ రావలసిన బాకీ వసూళ్ళ కనేనెపంతో ఖాతాపుస్తకాలు చంకనెట్టుకొని పొరుగూరు వెళ్ళాడు.

మధుమండల్ వెళ్లిపోయినా శిష్యురాలు గదిలోంచి బైటికిరావటానికి అంగీకరించలా. ఎవరో ఒకరు ముందుకువచ్చి నేర్చుకోడం మొదలెడితే ఆ శిష్యురాలు కూడా వస్తుందనే విశ్వాసంతో, యదు ఉదాసీని లాక్కువచ్చి కూర్చోపెట్టాడు. ఉదాసీ మొదట్లో అభ్యంతరం చెప్పింది; కాని తల్లి "ఆడుపడుచువి నీకు కూడా అంత సిగ్గెందుకే? పట్నంలో ఉండే పెద్దమనుష్యులబ్బాయి తనంతటతాను నేర్పుతానని రావటం ఎంత అదృష్టం!" అన్నది. అంచేత అంత అదృష్టవతి ఉదాసీ నఖశిఖపర్యంతం శరీరం కుంచించుకుని గురువుగారి ఎదుటకు వచ్చికూర్చుంది. లలిత్ ఒక్కక్షణం శిష్యురాలి శరీరమంతా కలయచూసి, చిరునవ్వు నవ్వుతూ "నువ్వు సంగీతం నేర్చుకుంటావా?" అని అడిగాడు.

ఉదాసీ తల ఊగిస్తూ అంగీకారాన్ని తెలియచేసింది.

"ఏదీ కాస్త పాడు, ఏమాత్రం పాడగలవో?"

"ఏమీ పాడలేను" అందిఎలాగయితేయేం. "సరే, నేనుపాడతాను, నువ్వు నా పాటతోపాటు నీ గొంతుకూడా కలిపి పాడు" అని అతడు పాడటం మొదలెట్టాడు. కాని ఎంత ప్రయత్నించినా ఉదాసీకి గొంతు పెకల్లేదు. లలిత్ పాడుకుపోతున్నాడు; అతడి కంఠస్వరం తన మనస్సునూ, శరీరాన్నీ ఏదో బంధిస్తున్నట్లు తోచింది ఉదాసీకి. అతడి పాట పూర్తిఅయినా ఉదాసీ కదల్లేదు. లలిత్ ప్రశ్నతో ఆమె కాస్త మత్తు వదిలింది. "నువ్వు ఇలా పాడగలవా?" అని ప్రశ్నించాడతను.

ఉదాసీ అతడికేసి కన్నెత్తి చూడకుండానే "నేర్చుకుంటే పాడగలను" అంది

"నువ్వు హార్మోనియం వాయించటం ఎప్పుడు నేర్చుకుంటే అప్పుడు నీకు కొత్తది ఒకటి కొని ఇస్తాను" అన్నాడు యదు.

ఉదాసీ సంతోషంతో వెళ్లిపోయింది. కొత్తహార్మోనియంమీద మోజువల్లనయితే నేం, మరేకారణంవల్ల నయితే నేం మర్నాడు నేర్చుకునేందుకు రావటానికి ఆమె నంత బలవంతం చెయ్యాల్సిన అవసరం లేకపోయింది. రెండు మూడు రోజుల్లోనే ఆమె లలితుడితోపాటు నిస్సంకోచంగా అతడి గొంతులో గొంతుకలిపి పాడటం నేర్చుకుంది. "అభాగ్యురాలి ఇంత తెలివీ ఎందుకూ పనికిరాదుకదా! రాత!" అన్నది తల్లి. యదుభార్య కుముదిని కేసి వక్రదృష్టి పరపి "ఉదాసీ కాలి గోరుకు ఉన్న తెలివికూడా ఎవ్వరికీ లేదు ఈ ఇంట్లో" అన్నది.

మొదట్లోఉండే సంకోచం ఎప్పుడైతే పోయిందో అప్పుడింక ఉదాసీని ప్రోద్బలం చెయ్యాల్సినంత ఆదుర్దా పడాల్సిన అవసరం లేకపోయింది లలితుడికి. 'రీడ్సు' నొక్కటం నేర్పే మిషతో అతడు ఆమె వ్రేళ్లను నొక్కేవాడు; ఉదాసీ మొదట్లోలాగా చెయ్యి గబుక్కున వెనక్కి తీసుకోవటంలా ఇప్పుడు. పాటలోని మందరస్థాయిని నేర్పుతూ ఉదాసీ ముఖం దగ్గరకు ముఖం చేర్చేవాడు. అతడి నిట్టూర్పు ఆమె పెదవులకు సోకేది. ఆమె శరీరం ఏదో వివశమైపోతూ ఉండేది— అయినా ముఖం ప్రక్కకు తిప్పుకుందామనే బుద్ధి పుట్టేది కాదు.

దసరాపండుగలు వెళ్లిపోయాయి. ఆశ్వయుజపూర్ణిమనాటి రాత్రి; లలిత్ ప్రక్క మీద కూర్చుని, బైట చింతచెట్ల ఆకుల సందుల్లోంచి వెన్నెల పడుతున్న వేపుకేసి చూస్తున్నాడు. ఉదాసీ ఒక పళ్లెంనిండా కొబ్బరి లవుజులూ, రసగుల్లాలూ తెచ్చి ఆ పళ్లెం చప్పుడయ్యేట్లుగా అతడి మంచం మీద పెట్టి, వెనక్కి తిరిగి వెళ్లబోయింది. లలిత్ ముఖం పైకెత్తి "వెళ్లడమేనా?" అన్నాడు.

ఉదాసీ ముఖం తిప్పుకుంది.

"నేను రేపు వెడుతున్నాను."

ఉదాసీ తుళ్లిపడింది. ఇతడు వెళ్లిపోతే ఇంక తనకు చేసే పనిఅంటూ ఏమీ ఉండదేమో అనిపించింది. ఉదాసీ విహ్వలభావాన్ని గమనించాడతడు. మరుక్షణంలోనే ఉదాసీని హృదయానికి హత్తుకుని "నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా ఉదాసీ?" అని అడిగాడు.

ఆ ప్రశ్నలోని అర్థాన్ని ఉదాసీ సరిగ్గా గ్రహించలేక పోయింది. అతడి భుజం మీద తల ఆనించి, అప్పటికే "ప్రేమిస్తున్నా" అంది.

ఆ రాత్రి ఉదాసీ కంటికింక కునుకు పట్టలేదు. మర్నాడుకూడా లలితుడిప్రయాణం సాగలేదు. దీపావళి వెళ్ళిన మర్నాడు యదుతల్లికి సాదాభి వందనంచేసి లలిత్ కలకత్తా వెళ్ళిపోయాడు. ఆ క్రితంరోజు రాత్రి ఉదాసీని చాటుగా పిలిచి, ఆమె ముఖం ముద్దెట్టుకుని, "నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను ఉదాసీ!" అన్నాడులలిత్.

ఉదాసీ కన్నీళ్లు తుడుచుకుని కొంచెం నవ్వి "ఎప్పుడు!? అని అడిగింది.

"కలకత్తా వెళ్ళాక ఏర్పాట్లన్నీ చేసి ఉత్తరం రాస్తా. యదు నిన్ను స్కూల్లో చేర్పించటానికి వస్తాడే- అప్పుడు"

ఉదాసీ లలితుడి హృదయంలో తల దాచుకుని "సరే" అన్నది నిట్టూరుస్తూ.

లలిత్ వెళ్లిపోయాక ఉదాసీకి ఏమీ తోచలా. సావాసకత్తె లెవరైనా పిలవటానికి వస్తే, ఆమె ఇంట్లో ఏమూలనో కూర్చుని ఉండేది. బలవంతంగా పట్టుకుని లాక్కుపోతే, వాళ్ళ ఆటలు చూస్తూ నుంచునేది: కానీ ఆ ఆటల్లో పాల్గొనటానికి తనకేం ఉత్సాహం ఉన్నట్లు కన్పరచేది కాదు. లలిత్ ఆమెను ఇంగ్లీషు నేర్చుకోమని చెప్పి వెళ్ళాడు. అంచేత చదువు విషయంలో రవంతైనా అశ్రద్ధ వహించేది కాదు. ఇదివరకు తెల్లవారు ఝామున లేచి పూలకోసం బయలుదేరే సమయంలో ఇప్పుడు 'ఫస్టుబుక్' తెరిచి ఇంగ్లీషు చదువుతూ కూర్చుంటోంది. యదు చూసి సంతోషిస్తూ - మధ్య మధ్య ఉత్సాహం కలిగిస్తూ "క్రిస్టమస్‌లో కలకత్తా తీసుకెళ్లి నిన్ను స్కూల్లో చేర్పిస్తాను" అని అంటూ ఉండేవాడు.

ఉదాసీ ఆ మాటవిని మరింత వుత్సాహంతో బిగ్గరగా ఏ. బి. సి. డీలు చదివేది.

కలకత్తా చేరాక వారం వారం ఓఉత్తరం రాస్తూవుంటానని చెప్పటమయితే చెప్పాడు లలిత్; కాని అన్నయ్యకు చేరినట్లు రాసినకార్డు తప్ప మరో ఉత్తరమేమీ వ్రాయలా అతడు. యదు జేబులోంచి ఆ ఉత్తరం దొంగతనంగా తీసుకుని ఉంచుకున్నది ఉదాసీ. అవకాశం ఉన్నప్పుడల్లా ఆ ఉత్తరం ఒకసారి చదువుకుంటూ వుండేది. చదవగా చదవగా ఆ ఉత్తరం అంతా ఆమెకు నోటికివచ్చింది. అయినా కొత్త ఉత్తరం రాలేదు.

ఒకనాడు ఉదాసీ పట్టుపడింది. ఉత్తరం హృదయంమీద పెట్టుకుని పరధ్యానంగా కూర్చుని వున్నదామె. కుముదిని ఎప్పుడు వెనకాలకు వచ్చి నుంచుందో ఆమె గమనించలేదు. వదిన కంఠస్వరంతో ఉలిక్కిపడి ఉత్తరం దాచటానికి ప్రయత్నించగానే, కుముదిని గడ్డం పుచ్చుకుని శకున్తలవయినావల్లేవుందే!" అన్నది నవ్వుతూ.

కుముదిని వాళ్ళ ఊళ్ళోఉన్న ఆడపిల్లల స్కూల్లో ఎనిమిదోక్లాసు పాసైనాక, పాతిక ముప్పై నవలలు చదివి ఒక విధంగా పండితురాలైంది అని చెప్పటం అవసరం.

కుముదిని మాటలతో ఆ ఉత్తరాన్ని గుప్పిట్లో ముడుచుకుని లేచి నుంచుంది ఉదాసీ. కుముదిని ఆ ఉత్తరం లాక్కోటానికి ప్రయత్నించగానే, ఉదాసీ ఆమె కాళ్ళమీదపడి "నీకాళ్లు పట్టుకుంటాను వదినా!" అని ఏడ్చింది.

ఉదాసీ అప్పటికి మాత్రం బ్రతికిపోయింది. కాని ఆట్టేసేపు ఆత్మరక్షణ చేసుకోలేకపోయింది. బ్రతిమాలి, బులిపించి, మరిపించి సాయంకాలానికల్లా కుముదిని అన్ని సంగతులూ తెలుసుకుంది. మనస్సులో గడ్డకట్టుకున్న ఆనంద - సంతాపాల భారాన్ని, మరో వ్యక్తిముందర దింపుకుని ఉదాసీకూడా తేలికపడింది. అంతా విన్నాక కుముదిని ఆశ్చర్యాన్ని కానీ, కోపాన్ని కానీ ప్రకటించలేదు:

పైగా "ఈసారి * అల్లుళ్ల పండుగకు రమ్మని లలిత్ కు ఉత్తరం రాయనా ఏం?" అని వేళాకోళ మాడింది.

ఉదాసీ పారిపోయింది.

ఈలోపుగా ఉదాసీ కబుర్లేమిటి అని ప్రశ్నిస్తూఒక కార్డువ్రాశాడులలిత్. తర్వాత రెండుమాసాలు గడచిపోయాయి. ఉదాసీ 'ఫస్టుబుక్' పూర్తిచేసి, 'శెకండ్ బుక్' ప్రారంభించింది. అప్పటికీ లలిత్ దగ్గిర నుంచి కబురేమీ రాలేదు.

కొద్దిరోజులు పోయాక చటుక్కున ఒకనాడు బ్యాగ్ ఒకటి చేతపట్టుకుని యదు కలకత్తా ప్రయాణమైనాడు. ఉదాసీ నమస్కరించుదామని వచ్చి, అన్నగారి ముఖంకేసి చూసి భయముతో వెక్కివెళ్లింది. క్రితంరోజు రాత్రి కుముదిని ముఖతః ఉదాసీకి సంబంధించిన సంగతి ఒకటి విని - యదు దిగులెట్టుకుని రాత్రల్లా నిద్రపోలేదు. హఠాత్తుగా కలకత్తా వెళ్లటానికి కారణ మేమిటని తల్లీ తండ్రీ ఇద్దరూ అడిగారు. యదు వుదాసీ ముఖంకేసి కోపంగా చూసి "పనిఉంది" అని జవాబిచ్చాడు ముక్తసరిగా.

అన్నగారిముఖం చూసేందుకు వుదాసీకి భయం వేసింది. వదినను చాటుగా పిలిచి "అన్నయ్య యెందుకు వెళ్లాడు వదినా?" అని అడిగింది.

కుముదిని తనవిచార ముఖాన్ని వీలైనంత వరకు సంతోషవంతంగా మార్చుకుని "నీ వరుణ్ణి వెతకటానికి" అంది.

ఉదాసీగోజాలాగానే పారిపోయింది.

కోడుకూ - కోడలికీ మధ్య తగాదా వచ్చిందేమో అనుకుని, కోడల్ని ఇంతవరకు ఏమీ అడగలా అత్తగారు. కాని వారం గడిచినా యదు కలకత్తానుంచి రాకపోయే సరికి శంకితురాలై 'యదు హఠాత్తుగా కలకత్తా ఎందుకు వెళ్లినట్లు' అని కోడల్ని పిలిచి అడిగింది. ఆ దిగులునంతా ఇంక కుముదిని ఒక్కతే భరించలేకపోయింది. ఏలైనంత స్పష్టంగా తనసందేహ విషయాన్ని అత్తగారికి తెలియచేసింది. విని కళ్లు రెండూ ఇంతింత చేసుకుని కింద చతికిల పడి ఏడవటం మొదలెట్టింది.

ఆరోజున కుముదిని ఉదాసీని గదిలోకి తీసుకువచ్చి కూర్చోపెట్టింది. ఆమె చిన్ననాటి స్నేహితురాండ్రకు బాగా యుక్త వయస్సు వచ్చిం తర్వాతనే పెళ్లిళ్లు అయినాయి. స్త్రీ జీవితాల్లోని అనేక రహస్యాలు తెలుసామెకు. లలిత్ వెళ్లిపోయిందగ్గిర్నుంచీ ఆమె ఉదాసీని ఒకకంట కనిపెడుతూనే ఉంది. వారిద్దరి విషయమై మనస్సులో ఆమెకు ఓ అనుమానం కలిగింది. తుదకు ఆ సంగతే ఆమె లీలగా సూచించింది. కొన్నాళ్లనుంచీ ఉదాసీని ఒక ప్రశ్న అడగాలని ప్రయత్నిస్తోంది— కాని అతి సంకోచంమూలంగా అడగలేకపోయింది. ఇవాళ ఉదాసీని గదిలోకి తీసుకువచ్చి, గడ్డం పుచ్చుకుని "నా దగ్గిర దాచవుకదా ఉదాసీ?" అని అడిగింది.

వదిన ఏమడుగుతుందో తెలుకోలేకపోయింది. "దాచను వదినా!" అన్నది.

కాని, ఆ తర్వాత కుముదిని అడిగిన ప్రశ్నకు ఉదాసీ సిగ్గుతో చచ్చిపోయింది,

* జ్యేష్ఠశుద్ధ షష్ఠి అల్లుళ్ళ నాహ్వానించి గౌరవించే పండుగ.

కుముదిని ఆమెను గుండెకు హత్తుకుని ఎన్నెన్నో నచ్చచెప్పింది. ఉదాసీ వదిన పమిటచెరగును ముఖానికి అడ్డంపెట్టుకుని ఆ ప్రశ్నకు ఎలాగో జవాబు చెప్పింది.

కుముదిని అన్నీ విని "గదిలోకూర్చో; ఎవరి ఎదుటకీ రావద్దు. తెలిసిందా?" అంది.

ఉదాసీ ఆమె ఎందుకలా అన్నదీ గ్రహించలేదు. అయినా మరో ప్రశ్న వెయ్యకుండా "సరే" అంది.

కాస్సేపయాక ఉదాసీ అతికష్టంమీద ముఖం పైకెత్తి వదిన ముఖంకేసి క్రీగంట చూచింది. చమత్కారంగా ఉండే వదిన ముఖం పూర్తిగా నల్లపడిపోయింది.

ఎవరి ఎదుటకీ రావద్దని వదిన ఎందుకు నిషేధించిందో ఉదాసీ గ్రహించలేదు; గ్రహించటానికి ప్రయత్నించనూ లేదు. అయినా అకస్మాత్తుగా ఇంట్లో యావన్మందీ తనకు విముఖంగా ఉన్నట్లు కనిపెట్టింది. తండ్రి ఆమెను చూచి ముఖం ప్రక్కకు త్రిప్పుకునేవాడు. తల్లి అన్నం కంచం తీసుకువచ్చి దూరంగా నుంచుని ఎడంచేత్తో ముందుకు త్రోసేది. ఉదాసీ అభిమానంగాసగం సగం తిని, ఆ కంచం అలాగే వదిలేసేది; మునుపటిలాగా ఎవరూ ఆమెను బ్రతిమాలి తినిపించేవారు కాదు. ఎక్కువగా మాట్లాడటం ఆమె కెన్నడూ అలవాటు లేదు; తనేమీ ఎవర్నీ అడిగేది కాదు. యదు బావమరది మానిక్ ఇంతకు పూర్వం ముఖం ఎత్తి ఆమెతో ఎన్నడూ మాట్లాడి ఎరగడు. ఇవాళతడు తలుపు చాటునుంచి చూసి నవ్విన నవ్వుకు ఉదాసీకి శరీరమంతా జెర్రులు ప్రాకినట్లయి గదిలోకి పోయి పడుకుంది.

వదినతోతప్ప ఇంకెవరితోనూ ఆమె ఎన్నడూ ఎక్కువగా మాట్లాడి ఎరగదు. కాని, ఆనాడు వదినతో ఆమాట చెప్పినప్పట్నించీ— మళ్లీ ఆమెతో ముఖం ఎత్తి మాట్లాడిఎరగదు. కాని ఇంటిల్లిపాదీ ఇలా విముఖంగా ఉండటం ఆమె సహించలేక పోయింది.

ఆరాత్రి కుముదిని గదిలోనికి రాగానే ఉదాసీ ఆమెచేతులు పట్టుకుని "నేనేం చేశాను వదినా? అందరూ—" అంటూనే ఏడవసాగింది.

ఇంత పెద్దపిల్ల—ఏమీ ఎరగదు; కుముదిని తెల్లబోయింది. ఒక్క క్షణమయాక ఉదాసీతల నిమురుతూ— "పిచ్చిగా ఏడవకు ఉదాసీ! మనస్సు కుదుటపరచుకుని నే చెప్పేది విను!" అంది.

ఉదాసీ ముందర యదార్థాన్ని మరుగు పరచటంవల్ల ఇంక లాభంలేదు. కుముదిని అన్నీ స్పష్టంగా చెప్పేసింది. విని ఆమె తలవంచుకుని నిశ్చలంగా అలాగే కూర్చుంది.

ఉదాసీ సంతానవతి కాబోతుంది.

ఉదాసీ కళ్ళముందునుంచి చటుక్కున ఏదో తెర తొలగిపోయినట్లయింది. ముసలి వాళ్ళ నోటివెంట ఈ సంగతులు చాలా సార్లు విన్నదామె. సావాసకత్తెలు ఒక చోట కూర్చుని స్త్రీ జీవితంలో ఈ పరివర్తనలోని అర్థాన్ని స్పష్టపరిచేందుకు ఎంతో ప్రయత్నించేవారు. ఎన్నడూ అర్థంకాలా. ఇవాళ తెలుసుకుంది ఉదాసీ. మధ్యమధ్య తన శరీరంలోని ఒక విశేష పరివర్తనం ఉదాసీకి కంటపడుతూ ఉండేది.— అదికూడా ఈ నాటివరకూ అర్థం

చేసుకోలేదామె. ఇవాళ ఉదాసీ సిగ్గుతో తన శరీరంకేసి తనే చూసుకోలేకపోయింది. మర్నాడు పగలల్లా బొంత ఒకటి కప్పుకుని గదిలో కూర్చుందామె. కుముదిని క్రమశః ఇందులోని సాధకబాధకాలను ఉదాసీకి తెలియచేసింది భయంతో ఉదాసి ముఖం వివర్ణమయ్యింది. ఊళ్లోమర్నాక యువతి సంగతి—కొంత తనకూ తెలుసు —అప్పుడు ఈవిషయికమైన జ్ఞానం అంతగాలేదు. చాలారోజులనాటి సంగతైనా ఇవాళ ఆ జరిగినగాథంతా కళ్ళ ముందర కొత్త — రూపంతో కన్పించసాగింది. దొరటోపీపెట్టుకున్న ఇన్‌స్పెక్టరు గుర్రంమీద ఎక్కి ముందు వెడుతున్నాడు. అతడివెనకాలనే వోళ్లంతా ముసుగువేసుకున్న యువతి ఒకామె; ఆమెవెనుక ఇద్దరు చౌకీదార్లు మోచేతులతో తోసి ముందలికి నడిపిస్తున్నారామెను. వీధికి రెండువైపులా నిలబడి కొంతమంది యువకులు నవ్వుకుంటున్నారు. వెనకాల ఒక ముసిలిది కిందపడి తల బాదుకుంటోంది. తర్వాత ఇంక ఆమె ఆయువతిని చూడలేదు. కాని మర్నాడు ఏదోజరిగిందని స్నేహితురాండ్రద్వారా విని చాటుగా వాళ్లతోకూడా ఆముసిలిదాన్ని చూడటానికి వెళ్లింది ముసిలిది మెడకు ఉరిపోసుకుని ఇంట్లో దూలానికి వ్రేలాడతోంది. ఆమె కళ్లసంగతిజ్ఞాపకం వచ్చేసరికిఇవాళ కూడా భయమేసింది, ఉదాసీకి. ఆముసిలిది లాగానే తన తల్లికూడా మెడకు ఉరిపోసుకుంటుందా! అనిపించింది. ఉదాసీ వణికిపోయింది. కుముదిని వెళ్లబోతూంటె ఉదాసీ వటుక్కున ఆమె కాళ్లమీదపడి

"ఇంకనాకు జరగవలసిందేమిటి వదినా?" అని ఏడ్చింది

"లలిత్ నిన్ను పెళ్లిచేసుకుంటే అన్నీ సమసిపోతాయి. మీఅన్నయ్య అతడ్ని తీసుకురావటానికే వెళ్లారు కలకత్తా భయందేనికి?" అని ఊరడించింది

ఈ మాటవల్ల ఉదాసీకి అంధకారంలో వెలుగుకన్పించింది. లలిత్ ఈ సంగతి విన్నాడంటే ఒక్కరోజుకూడా ఆలస్యం చెయ్యడు. అందులో ఆమెకేమాత్రం సందేహంలేదు. ఆదే నన్నమాటేమిటి — లలిత్ వస్తాడనే ఆలోచనతో ఆ రాత్రి ఆమెకు దిగులంతా పోయింది. రాత్రి అంతా తన పరిస్థితినిగురించి ఏమీ ఆలోచించుకోలా ఆమె. మాటిమాటికీ లలిత్ ముఖం జ్ఞాపకం రాసాగింది. రాత్రంతా కనీసం ఒక్కఇరవైసార్లన్నా - "అన్నయ్యకు అతడుకనిపించేట్లుచెయ్యితల్లీ !" అని చేతులుజోడించి ఇష్టదేవతను ప్రార్థించింది.

ఇష్టదేవత ఆమెప్రార్థన ఆలకించింది. లలిత్ యదుకు కన్పించాడు.

లలిత్ సాయంకాలం షికారువెళ్ళి వచ్చేసరికి యదువచ్చియున్నాడు. లలిత్ నవ్వుతూ "ఇంతచిక్కిపోయినట్లున్నావేమోయ్ యదూ ?"అని పలకరించాడు.

యదుకు వళ్లుమండిపోతుంది. కాని అతికష్టంమీద ఆత్మసంవరణ కావించుకుని "నిన్ను చుద్దామని వచ్చాను; ఉత్తరమయినా వ్రాశావుకాదేం ?" అన్నాడు.

"తీరికవుండటంలేదు భాయీ! తెలుసుగా దేశసేవకోసం బయల్దేరితే—"

తర్వాత మళ్ళీమాట మార్చేసి "ఉదాసీ ఎలాఉంది? స్కూల్లో చేర్పిద్దామను కున్నావుగా?" అని అడిగాడు.

ఎలాగయినా సరే లలిత్ కు ఉదాసీని ఇచ్చిపెళ్ళిచేసేసి ఈ కళంకాన్ని పోగొడ తాను-అనిప్రతిజ్ఞ చేసుకునివచ్చాడు యదు. లలిత్ ఉదాసీ పెళ్ళి చేసుకుందామనుకుంటు న్నాడని భార్య చెప్పగా విన్నాడతను.

లలిత్ ప్రశ్నించిన అవకాశాన్ని పుర స్కరించుకుని,"అందుకేగావచ్చింది!అందరి ఉద్దేశ్యమూ ఉదాసీని నీచేతుల్లో అప్ప గించి—"

లలిత్ నవ్వుతూ "బాగుంది స్కూల్లో చేర్పించివెళ్లు - గార్డియన్ గా వుండి మంచీ చెడూచూస్తూ ఉంటాను. ఊళ్లోఆడవాళ్లు ఒక వేళ —"

యదు ఆమాటకు అడ్డువచ్చి "అవన్నీ నువ్వు ఎలా చెయ్యగలిగితే అలాచెయ్యి. ఉదాసీకి పెళ్లి చెయ్యాలనుకుంటున్నాం నువ్వు ఆమెను—" యదు చెప్పబోయేది వూహించుకునేసరికి లలిత్ ముఖం గంభీర మయింది. సాంధ్యకాంతిలో యదు దాన్ని చూడలేకపోయాడు.

లలిత్ మెదలకుండా ఊరుకోవటం చూచి— "ఉదాసీ దాని వదినతో అన్నీ చెప్పేసింది. ఈ స్థితిలో—"

లలితుడి ముఖం వాడి పోయింది. నాలుగువైపులా చూసి— "మా అమ్మ ఉన్నది, తెలుసుగా. ఆమెను—"

యదు ఇంక వుండపట్టలేకపోయాడు. అతడు బిగ్గరగా అరుస్తూ "ఆమెకు ఆశ చూపినప్పుడు అమ్మసంగతి జ్ఞాపకం రాలేదేం? ఇప్పుడామెను నట్టేట్లో ముంచి—" ఇలాంటివే ఇంకా ఏవేవో అంటున్నాడు; అవి వింటూంటే యదు చేతిప్రక్కన నుంచునే సాహసం లేక పోయింది లలితుడికి. అతను గుమ్మం దగ్గిరికి జరిగివెళ్ళాడు. "నువ్వు దాన్ని పెళ్లిచేసుకోకపోయి నట్లయితే —" అన్నాడు యదు.

లలిత్ ఆ మాటకు జవాబు స్పష్టంగా చెప్పకుండా "నువ్వు కొంచెం బైటికి రా! యదూ! నువ్వు పడుకునేందుకు ముందు ఏర్పాటుచేసి వస్తాను" అన్నాడు.

"ఎందుకు? ఇక్కడో?"అని అడిగాడు యదు. "కొంచెం ఇబ్బంది అవుతుంది."

ఇద్దరూ బైటికి వెళ్ళారు. హారిసన్ రోడ్డులో ఒక హోటల్లో యదు వుండటా నికి ఏర్పాటుచేసి "రేపు ప్రొద్దున్నే వస్తాను నేను: నువ్వు ఇక్కడేవుండు. రేపు అన్ని సంగతులూ మాట్లాడుకుని దీనికి తగిన ఏర్పాటు చేద్దాం"

అని లలిత్ బైటికి వెళ్ళిపోయాడు. యదు నిశ్చింతుడయినాడు.

కాని, మర్నాడుదయం పది గంటల దాకా యదు హోటల్లో ఎదురుచూస్తూ కూర్చున్నాడు. అయినా లలిత్ రాలేదు. అప్పుడిహ అతడే స్వయంగా అతడి మెస్ కు వెళ్లాడు. "అతడు నిన్నరాత్రే మేదినీపూర్ వెళ్లాడు. అక్కడ సభలో అతడు ప్రబోధగీతాలు పాడాలిట!" అని చెప్పాడు మెస్ మానేజరు.

యదు ఆదుర్దాగా "ఎప్పుడు వస్తాడు మళ్ళీ ?" అని అడిగాడు.

"సామానులన్నీ తీసుకునే వెళ్ళాడు. ఎప్పుడు వచ్చేదీ సరీగ్గా తెలియదు"

లలిత్ పారిపోయినట్లు గ్రహించాడు యదు. అయినా ఇంకా కొద్దిరోజులు అతడికోసం ప్రతీక్షించాడు.

లలిత్ తిరిగి రాలేదు.

ఉదాసీ ఒక్కతేకాదు; ఉదాసీ తల్లీ-తండ్రి, కుముదినీ అందరూ లలితుడి రాక కోసం ఎదురుచూస్తున్నారు. ఏదోవిధంగా ఉదాసీని లలితుడికి అప్పగిస్తేనే విముక్తి. తర్వాత ఏమయినా కానీ... ఇలా ఊహిం చుకోవటంవల్ల అంత బెంగలోకూడా అందరికీ కాస్త శాంతి లభించింది. అంచేత యదు రాగానే ఉద్విగ్న ముఖాలతో ముగ్గురూ అతడ్ని చుట్టుముట్టారు. యదు మెల్లిగా లలితుడు తనకు కనిపించిన సంగతి యావత్తూ ఒక్క నిమిషంలో చెప్పేశాడు. విని తల్లి రాగాలు మొదలెట్టింది. మధు మండల్ పాలిపోయిన ముఖంతో ఊపిరి బిగపట్టుకుని "అయితే ఏమిటీ వుపాయం?" అని అడిగాడు.

యదు వుదాసీవున్న గదికేసి చూస్తూ" ఆలోచిద్దాం" అన్నాడు.

ఉదాసీ కొన్నాళ్లనుంచీ ప్రతిరోజూ తెల్లవారిందగ్గిర్నుంచీ కిటికీ ఒక్క రెక్క తెరిచి నదిఒడ్డునే ఉన్న రోడ్డుకేసి చూస్తు ఉంటోంది. లలితుడు వచ్చే దారి అదే. ఇవాళకూడా అక్కడే నుంచుంది. అన్న గారిని చూడగానే మరొక వ్యక్తి వస్తూ ఉంటాడనే ప్రత్యాశతో ఆమె గుండె గుబగుబలాడింది. చిందరవందరగా ముఖం మీదపడ్డ జుట్టును సవరించుకుని, పమిట చెంగునుతల మీదనుంచి అవగుంఠనం లాగా లాక్కుంది. అన్నయ్య ఇంట్లోకివచ్చేశాడు; అయినా దారిలో ఇంకా ఎవరూవస్తున్నట్లు కనపడలా. 'లలిత్ పడవలో ఉండి ఉంటాడు. సిగ్గుచేత రాలేకపోయినాడే మో!'అనుకున్నది ఉదాసీ. కాని చటు క్కునతల్లిఏడుపు విని తలుపుదగ్గిరకువచ్చి, యదుమాటవినిఒక్కమాటలో లలిత్ రాలే దని తెలుసుకుంది. ఆమె యింకా అక్కడ నుంచోలేకపోయింది.

... ...

ఉదాసీ ఇంక గదిలోంచి బైటికి రావ టం మానేసింది. తలుపుసందుల్లోంచి వంట ఇంట్లో పనులు చూస్తూఉండేది; మనుపు ఉదాసీ లేకపోతే ఈ పనులుసాగేవికావు. ఇప్పుడు తల్లి ఒక్కతే చేసుకుంటోంది. తల్లిదగ్గిరకెళ్ళి ఒకసారి కూర్చుందామని ఆమెకు బుద్ధిపుట్టింది కాని, ఎవ్వరూ పిలి చిన పాపాన పోలేదు. ఆ రోజున ఉదాసీ మేపుతున్న ఆవు పలుపు తెంపుకుని హంగామా చేయసాగింది. మధుమండల్ దాన్ని పట్టుకుని కట్టివెయ్యలేకపోయాడు. ఉదాసీ బైటికివచ్చి ఆవు వంటిమీద చెయ్యి వెయ్యగానే తండ్రి ఆమెకేసిచూసిన చూ పుకుఉదాసీ భయపడి వెనక్కి తప్పుకుంది.

చాప సిద్ధంగావున్న రోగివున్న గదికేసి బంధువులంతా ఎలా చూస్తూఉంటారో— అలాగే ఆమె తలుపులు మూసుకుని కూరు చున్న గదికేసి అందరూ శంకితదృష్టితో చూస్తూ గుసగుసలాడుకోవటం— ఉదాసీ చూసింది. వదిన కూడా కొన్నాళ్లనుంచీ అదోమోస్తరుగా ఉంటోంది. సరిగ్గా మాట్లాడటంలా, ఏమన్నా అడిగితే కోపంతో రుసరుసలాడుతుంది. ఉదాసీ భయంతోముడుచుకుని గువ్వలాగాఅలాగే కూర్చునేది. కుముదిని అన్నం కంచంతీసుకు

వచ్చి మెదలకుండా గదిలోపెట్టి వెళ్లేది. ఇంకా ఏమయినా కావాలా, అక్కర్లేదా అనికూడా అడిగేది కాదు ఇప్పుడామె స్నేహితురాండ్రు కూడా రావటం లేదు ఇంటికి ఇరుగుపొరుగు ఆడపిల్లలు ఇంటికి రావటానికి ప్రక్కనే వున్న సందుకు యదు ఆరోజునే తడిక అడ్డం కట్టించి మూయించాము. కిటికీ తెరవగానే ఆకాశంలోవున్న సూర్యుడు లగాయతూ క్రింద నున్న గడ్డిపోచవరకూ తన శరీరావయవాల కేసి చూస్తున్నట్లే అనిపించేది యంత్రపు బొమ్మలాగా గదిలో సామానులు అక్కడివి ఇక్కడా— ఇక్కడివి అక్కడా సర్దుతూ రోజులు గడుపుతోంది ఉదాసీ. తన పరిస్థితి జ్ఞప్తికి రాగానే చెంపనచెయ్యి ట్టుకుని ఆలోచిస్తూ అలాగే కూర్చునేది. ఆ ఆలోచనలకు అంతు కన్పడకపోయేసరికి దిండులో ముఖం దాచుకుని పడుకునేది.

ఉదాసీకి ఇలాగే గడుస్తున్నాయి రోజులు.

... ...

ఆ రోజున తల్లి చెరువుస్నానానికి వెళ్లి వచ్చి యదు చేతులు పట్టుకుని "ఏదో ఒక ఉపాయం చూడు నాయనా! ఇంక నేను సహించలేకుండా ఉన్నాను"అని ఏడ్చింది.

యదు విహ్వాలుడై అలాగే నుంచున్నాడు.

అసలు సంగతి ఇదీ. వుదాసీ తల్లి రేవుకు స్నానానికి వెళ్లింది. ఆ వీధి అమ్మలక్కలంతా చేరారక్కడ ఘోష్‌గారి భార్య "ఏమమ్మా! వుదాసీ కనిపించిచాలా రోజులయింగా. ఎంచేత' నమ్మా" అని అడిగిందట.

ఆమె గజగజలాడిపోయి ఒక క్రమానికి" "జ్వరం" అన్నది.

ఘోష్‌గారి భార్య ప్రక్కనున్న ఆవిడ్ని మోచేత్తో మెల్లిగా పొడిచి చిరునవ్వు నవ్వుకుని" జ్వరమా! నాకు తెలియనే లేదమ్మా! ఇవాళన్నా వచ్చి చూస్తాను" అంది.

తల్లి ఇహ స్నానంకూడా చెయ్యలా. వెంటనే ఇంటికి తిరిగి వచ్చింది.

మధుమండల్ బైటినుంచి అన్నీ విన్నాడు. తర్వాత భార్యను చెయ్యిచ్చుకుని వంటఇంటి వైపుకు తీసుకువెళ్ళి "గర్భం ఎలా ధరించిందో అలాగే అనుభవించనీ!" అన్నాడు.

ఆమె హడలిపోయి నోరు నొక్కుకుని ఊరుకుంది.

భార్యను హడలగొట్టి మధుమండల్ బైటికి వచ్చి ఆలోచిస్తూ కూర్చున్నాడు. అన్నీ ఏర్పాటుచేసి ఎవరితోనయినా ఉదాసీని కాశీ పంపించేద్దాం అన్న సంకల్పం వున్నదతడికి మనస్సులోనే అందుకు మంచివాడ్ని ఒకణ్ణి వెతుకుతున్నాడు. ఇవాళ చటుక్కున భార్య మాట వినేసరికి అతడికి నెత్తిన పిడుగు పడ్డట్లయింది ఊళ్లో పరిస్థితులన్నీ బాగా తెలుసలడికి ఈ సంగతి ఒకవేళ ఏ విధంగానైనా ఊళ్లోపొక్కిందంటే పోలీసు స్టేషన్ వరకూ పాకుతుంది. తర్వాత జరగవలసిందంతా జరుగుతుంది ఆట్టే ఆలోచించినకొద్దీ అతడి అవయవాలన్నీ పట్టు తప్పి పోయాయి.

యదు వచ్చి చూసేసరికి తండ్రి కొయ్యబొమ్మ లాగా కూర్చుని వున్నాడు

యదును చూడగానే "యీ పాపాన్ని ఎలాగో అలా వదిలించేసెయ్ యదూ, చివరికి ఈ ముసలితనంలో జైలుకుపోయి కూర్చోనా ?" అన్నాడు మధుమండల్.

ఊళ్లో ఉదాసీని గురించి చెవులు కొరుక్కోవటం యదు విని వున్నాడు. ఆపద నెత్తిమీదికి వచ్చినట్లు ఇవాళ గ్రహించాడు. పోలీసులమాట వినేసరి అతడికీ భయంవేసింది.

రాత్రల్లా మధుమండల్ ఎన్నెన్ని విధాలో ఆలోచించాడు. తెల్లవారు ఝూమున - పోలీసులు వచ్చి ఇంట్లో వారి నందర్నీ బంధించి తీసుకుపోయినట్లు-కల గన్నాడు. 'గోవింద' 'గోవింద' అంటూ కళ్లు నులుముకుంటూ లేచి బైటికివచ్చాడు. అప్పటి కించుమించు తూర్పు తెల్లారింది. బైట అరుగుమీద ఎవరో కూర్చుండటం చూశాడు. "ఎవరూ ?" అని పిలిచాడు.

"చౌకీదారును" అని సమాధానం వచ్చింది.

మధుమండల్ మతిపోయినవాడిలాగా ఒక్క క్షణం ఆ చౌకీదారుకేసి అలాగే చూస్తూ ఊరుకుని – తర్వాత మనస్సు కొంచెం స్థిమితపరచుకుని "శేఖ్ ! ఇంత ప్రొద్దున్నే ఏమిటి ?" అన్నాడు.

"మండల్ గారి విధవకూతురు గర్భిణి అయింది అని ఇన్‌స్పెక్టర్ గారికి తెలిసి వారి ఇంటికి కాపలా వుండమని నియమించారు నన్ను" అని మఫీజ్ శేఖ్ సంక్షేపంగా తెలియచేశాడు.

మధుమండల్ భయంతో గుడ్లప్పగించి క్రింద చతికిలపడ్డాడు. అతడి నోటినుంచి మరో మాట పెకల్లేదు

తెల్లవారుఝూమున ఉదాసీకి నిద్ర మత్తుగా వుంది హఠాత్తుగా చౌకీదారు పేరువిని ఆమె త్రుళ్లిపడి లేచింది. గది తలుపులు సందుచేసుకుని చౌకీదారుని చూసి కొయ్యబారిపోయింది. ఒక్క క్షణంలో - ఆ యువతిగాథ - జ్ఞాపకం వచ్చింది. భయంతో ఏడుస్తూ ఇంట్లో ఏమూలనో పడుకున్న తమ్ముణ్ణి గట్టిగా కావలించుకుని పట్టుకుని అతడి హృదయంలో తలదాచుకుంది. ఉలిక్కిపడి మేల్కొని తమ్ముడు నిధుకూడా అరుస్తూ లేచి కూర్చున్నాడు.

యదుకు చౌకీదారు వచ్చిన సంగతి తెలియదు; ఈ కేకలువిని పరుగెత్తుకువచ్చి చూసేసరికి ఉదాసీ నిధును కావిలించు కుని గజగజ వణికిపోతోంది. "ఏమిట్రా నిధూ ?" అని అడిగాడు. నిధు ఏమీ చెప్పలేకపోయాడు. ఉదాసీ వీధివైపు వేలెట్టిచూపుతూ బిగుసుకుపోయిన కంఠంతో "చౌకీదార్" అన్నది.

చౌకీదార్ మఫిజ్ శేఖ్ ప్రస్తుతం మధుమండల్ దగ్గర అయిదు రూపాయలు 'మామూలు' తీసుకుని ఆనాటికి వెళ్లిపోయాడు. అయినా వుదాసీ గదిలో ఒక మూల దుప్పటి ఒంటినిండా ముసుగెట్టు కుని భోషాణంచాటున కూర్చుంది కదల కుండా. రెండుజాము లయిపోయినా ఆమె అక్కడినుంచి లేవలేదు. రోజూ లాగానే కుముదిని - అన్నం కంచం తీసుకు వచ్చి గదిలో పెట్టి వెళ్లిపోతోంది. ఉదాసీ ఆమె కాళ్లచప్పుడు విని త్రుళ్లిపడి అతి నిస్సహాయ స్థితిలో వున్నట్లు ఒక్కసారి కుముదిని ముఖంకేసి చూసింది కాని

కుముదిని ఏమీ మాట్లాడలేదు. క్రమశః మెల్లాఅంతా సాయంకాలపు చీకట్లు ఆవరించినా – ఆ గదిలో సాంధ్యదీపం వెలగలేదు. ఉదాసీ చీకట్లోనే కూర్చుని వుంది. ఇంట్లో భయంకరమైన ఏర్పాట్లు ఏవో జరిగిపోతున్నాయి–ఎవ్వరికీ తీరుబడి లేకుండా వుంది.

చివరకు రాత్రి జాము ప్రొద్దుపోయాక తల్లి దీపం చేతపుచ్చుకుని వుదాసీ గదిలోకి వచ్చి చూసేసరికి – ఆ కంచం అలాగే పడివుంది. వుదాసీ మోకాళ్లమీద తల ఆనించుకుని కూర్చుని వుంది. తల్లి ఆమెను కావిలించుకుని "ఇహ ఈ జన్మకు యీ ఇంట్లో మెతుకులు రెండైనా నోట్లో వేసుకుని వెళ్లు అమ్మా!" అని ఏడ్చింది. వుదాసీ మతిపోయిన దానిలాగ తల్లి ముఖంకేసి చూస్తూ ఊరుకుంది. ఏమీ మాట్లాడలా. బైటనుంచి మధు కంఠం నొక్కుకున్న స్వరంతో "చాలా ఆలస్య మయిపోతోంది. బైటికిరా అమ్మా!" అన్నాడు. వరండాలో నుంచునివున్న కుముదిని చటుక్కున గదిలోకి వెళ్లి వుదాసీని బైటికి తీసుకుని వచ్చింది.

మెల్లాలో మరోవైపున నల్లటి కంబళీ కప్పుకుని, చేత్తో చిన్న మూట ఒకటిపుచ్చుకుని ఒకవ్యక్తి నిలబడి ఉన్నాడు. అతడు మాణిక్. అయిదు వందల రూపాయలు రొఖ్ఖమూ, రానూ పోనూ ఖర్చులూ పుచ్చుకుని తీర్థాలలో మంచివాడిని గాచూసి ఎవరికయినా ఉదాసీని అప్పగించిరావటానికి ఒప్పుకున్నాడతడు.

గుండెలమీదిదాకా ముసుగులాక్కుని యంత్రపుబొమ్మలాగా ఉదాసీ ఆ మెల్లా దాటి ఇవతలకు వచ్చింది. తల్లీ, తండ్రీ, అన్న– ఎవరివైపూ చూడలా. సంపంగి చెట్టు దగ్గరఉన్న ఆమె బొమ్మరిల్లుకూడా దాటి ఇవతలకురాగానే తల్లి కాసిని అటుకులు అవీ చిన్నమూటకట్టి తీసుకుని పరుగెత్తుకుంటూ వచ్చి, "రోజల్లా ఏమీ తినలేదు; ఇవైనా తీసుకువెళ్లుఅమ్మా!"అన్నది. చెట్లచాటున చీకట్లో నుంచునిఉన్న మధు మండల్ భార్యచెయ్యిపట్టుకుని "ఊరుకో" అన్నాడు. ఉదాసీ తల్లీ, తండ్రీ ఇద్దరి మాటలూ విన్నది; కాని వెనక్కి తిరిగి చూడలా.

... ...

మైదానంలోకివచ్చాక మాణిక్ వెనక్కి తిరిగి "నీకు కష్టం వచ్చింది ఉదాసీ!" అన్నాడు.

"లేదు" అన్నదామె.

"ఇంటికి దగ్గరలోఉన్న రేవుకు వెడితే ఎవరికయినా తెలుస్తుంది. అంచేత సాత్ ఫూక్ రేవుకు వెడుతున్నాం. ఎంతో దూరం లేదు, అయిదు క్రోసులే"

ఉదాసీ అతి ప్రశాంతంగా నిట్టూర్చి "కానీ!" అంది.

కానీ! అప్పుడే విముక్తి! విముక్తి! ఉదాసీకి పైన నిరవధికమైన ఆకాశం; నాలుగువైపులా ఎటు చూసినా ఎడారి. ఎదురుగా అవధి కనిపించకుండా ఉన్న ఈ మార్గం. చాలారోజుల కివాళ ఉదాసీకి పృథివి ఎంతో బాగున్నట్లుతోచింది.

మైదానంలో నుంచి చలిగాలి రివ్వున వీచింది ఒకసారి.

మాణిక్ వినయంగా ఉదాసీకిదగ్గరగా వచ్చి, "ఇంకొంచెం తొందరగా నడవ

గలవా ఉదాసీ? ఇంక రెండు క్రోసులే; ఉదయం కాకముందే పడవ ఎక్కగలం" అన్నాడు. ముళ్లు గుచ్చుకున్న కాళ్లకేసి చూసుకుంటూ "నడవగలను" అంది ఉదాసీ.

నెత్తిమీదనుంచి ఒక పిట్ట అరుస్తూ పోయింది. కొంచెం దూరం పోయాక "కొంచెం నుంచో మాణిక్ దాదా! కాస్త అలుపుతీర్చుకుంటా" అంది ఉదాసీ.

"కొంప మునుగుతుంది! ఈ వెదురు చెట్లకు అవతలివైపునే థాణా. ఇక్కడ నుంచోటమా ఇంకా?" అన్నాడతడు.

థాణా పేరువిని వణికిపోయింది ఉదాసీ. "అయితే పద పరుగెడదాం మాణిక్ దాదా!" అంది.

ఇద్దరూ గబగబా నడిచారు; కాని ఆ నడక కాస్సేపే. దారిమలుపులో ఎదురుగా వున్న కసివిందచెట్లక్రింద నుంచుని "ఇంక నడవలేను దాదా! అలుపు వచ్చింది, ఊపి రాడటం లేదు" అని రెండు చేతులతో గుండెఅణచుకుని చతికిలపడింది ఉదాసీ.

... ...

మర్నాడుదయం సాత్ పూర్ రేవులోకి వచ్చినవాళ్లు— ఆ చెట్లక్రిందకువచ్చి చూసే సరికి— ప్రాణహీనమైన శిశువును రెండు చేతులతో గుండెను హత్తుకుని— రక్తలిప్త దేహంతో ఒక నల్లనియువతి అనంతాకాశం కేసి నిస్తేజమైనదృష్టితో చూస్తోంది. ఆమె శరీరంలో ప్రాణంలేదు.

ఆమె ఎవరో ఎవ్వరూ ఎరుగరు.

★

" మీకోసం కలంపట్టి
ఆకాశపు దారులంట
అడావుడిగ వెళ్లిపోయే
జగన్నాథుని రథచక్రాల్
రథచక్ర ప్రళయఘోష
భూమార్గం పట్టిస్తాను;
భూకంపం పుట్టిస్తాను!—"

— శ్రీ శ్రీ

ప్రభూ !

శ్రీ "కృష్ణకుమార్"

ఇదేమిటి ప్రభూ !
ఇన్నాళ్ళూ చాలలేద ?
ఇన్నేళ్ళూ చూడలేద ?
మళ్ళీ మళ్ళీ కుళ్ళిపొమ్మని
నిలువునా కుమిలిపొమ్మని
మరో అగ్ని పరీక్షా !
మా కింకో కఠినశిక్షా !!
నిన్నటిదా ? మొన్నటిదా ?
మా బాధ, మా హృదయాలకీ రంపపుకోత ?
యుగయుగాలుగా దాస్యంలో
చరిత్రచేసిన అపహాస్యంలో
చీకుచింతల చివికి చివికి
మాదేశం అమవస నిశల పాలైపోలేదా ?
మేం పొంగి పొరలిన
దుఃఖం దిగమ్రింగుతు సగమై పోలేదా ?
ఇపుడే, ఇపుడే ప్రభూ !
స్వేచ్ఛ వచ్చింది మాజాతికని
స్వచ్ఛత వచ్చింది మా ఖ్యాతికని
సంతోషంలో మునుకలు వేశాం
మహాహ్లాదయంలో ముఠిసి పొయ్యాం
పిచ్చి పువ్వులమై విరిసిపొయ్యాం ప్రభూ !
కానీ కానీ
క్షీణించిన మాదేశం కనురెప్పలు విప్పి

తూరుపున తెలిరేఖనరసి
తన చూపున కళకళలు విరిసి
ఒక క్షణమన్నా కాకమును పే
ఆశలు తెగిపోయ్యిన మాకోసం
అసువులు బాసిన మా వీరులకోసం
ప్రేమాంజలి ఘటించి, స్మరించి, ,గర్వించిన
మా హృదయవిపంచిని పలికించకముందే
ఆకాశం అంతా మేఘావృతమా ప్రభూ !
మతోన్మాదాలతో, మారణహోమాలతో
మానవత్వం కాలిపోతున్నది
ఇంతదేశం కూలిపోతున్నది
ఇదేమి టిపుడేమిటి, ప్రభూ !
ఈ కడగళ్ళు, కళ్లనీళ్ళు, కడలేని కడలిలో
శాంతి విరిసేదెపుడు ప్రభూ !
మా భువిలో, ప్రతిహృదిలో
కాంతి కురిసేదెప్పుడు ప్రభూ !
మనిషి మనిషిని
మనసు మనసును
తెలిసి బ్రతికే దెపుడికను ?
మతం మఱచి, స్వార్థ్యం విడచి
మానవత్వపు లోతులు తఱచీ
కలిసి వెలికే దెపుడునిన్ను ?
కనిపించే అందరిలో
హిందువులో, ముస్లింలో
విశ్వమానవ సామరస్యంలో
కలిసి వెలికే దెపుడు నిన్ను ?
ఎపుడు ప్రభూ ! ఎపుడా గడువు ప్రభూ !

నీ రా జ న ము

శ్రీ లంక విశ్వనాథం

అసమాన ప్రతిభా విలాసినీ భారతీ!
అందుకోవమ్మ మా నీరాజనమ్ము!!
శతశతాబ్దాలుగా పారతంత్ర్యములోన
శృంఖలాబద్ధవై శుష్కించిపోయావు
శ్వేతాధికారమను చిచ్చు నొడిగట్టి నీ
యాత్మ సంతాన సంహారమును కండ్లార
గాంచవలసిన ఘోర కష్టముల నందావు
నీ ఓర్మియే రక్ష, నీ త్యాగమే జయము
సత్య స్వరూపిణీ! శాంత స్వభావినీ!!
అందుకోవమ్మ మా నీరాజనమ్ము!!!
మరఫిరంగుల ముందహింస దీక్షగ బోరి
రవి గ్రుంకనట్టి సామ్రాజ్యవాదుల గెల్చి
చేరరానట్టి స్వారాజ్యసీమకు నేగు
నీ యడుగులే రాచబాటగా చేసితివి
స్వాతంత్ర్యభానునికి స్వాగతం బిచ్చితివి
నీకు నీవే సాటి నీ పుత్రులే సాటి
మా పూర్వపుణ్యమా! మా నోముఫలమా!!
అందుకోవమ్మ మా నీరాజనమ్ము!!!
నీ కీర్తిప్రభలెల్ల లోకాల ప్రసరించి
బానిసత్వపు టంధకారమును బాపినవి
మూలమూలలనున్న మానవుని లేపినవి
విశ్వమానవలోకకల్యాణ మను నీదు
దివ్యసూత్రము నేడు విజ్ఞానపాత్రమై
కఠినచిత్తుల మనసు కరిగించివేసినది
సమత స్వభావినీ! సద్ధర్మచారిణీ!!
అందుకోవమ్మ మా నీరాజనమ్ము!!!

కావాలిప్పుడు

"గంగినేని"

ఒక లోకమాత
సీతాపహరణం
మా గుండెలలో
మండించిన అగ్నిశిఖలు
లంకాపురి దహనం చేసి
రాక్షస రావణుని కాష్ఠం
పేర్చి తలకొరివిపెట్టెను!
ఒక్క మానవతి
ద్రౌపది మానభంగం
చేయను పూనిన నరహంతల
దుర్యోధన దుశ్శాసనాది
దురాత్ముల శిరసుల నరకను
మేం పోరిన కురుక్షేత్రయుద్ధంలో
దరులు తెగి పొరలిపొంగిన
నర రక్తస్రవంతులు మరువకండి!
సీత సచ్చరిత్ర జగతి చాటిన
రామాయణ ధర్మకథ చెరగలేదు!
భారత అభిమాన పరాక్రమాలు
పృథ్వి వర్ణించిన భారతం చినగలేదు!
వీర రుద్రమాంబ ధీర ఝాన్సీ లక్ష్మి
రణగర్జనలు మా చెవుల మ్రోగుతున్నయ్!

మతపు కైపుతో
భ్రాతృహత్యలు
దోపిడీలు దురాగతాలు
చేసే మానవ ద్రోహులారా!
మతమౌఢ్యం మానుకోండి!
మీ మతులన్నీ సామ్రాజ్యవాదుల
విషబీజాలతో నింపకండి!
మీ బుర్రలు బూర్జువా జమీందారీ
రక్తతృష్ణ రాబందుల కద్దె కీయకుడు
మన చరిత్ర మన ధరిత్రి మతకలహాల
మారణహోమంలో బూదికాదు!
మనమంతా ఒకటేనని మరువకండి!
ఇది మాత్రం కల్లకాదు కలకాదు!
రానున్నది వర్గరహిత భూస్వర్గం!
పోనున్నది హెచ్చుతగ్గుల శిథిల సమాజం!

జాతిపితా! శాంతిదూతా!!

భారత భాగ్య
విధాత మహాత్మా
గాంధీ తాతా
ఘన విజేతా!
నిరత నిత్య
సత్య వ్రతా
అహింసాత్మక
సమర నేతా!
చిరతర దాస్య
విముక్తి దాత
పూత చరిత
జాతి పితా!
వర్గ, వర్ణరహిత
సమతా సమాజ
మహి మాన్విత
మత ప్రవక్త!
విష పూరిత
మతద్వేషాలతో
భ్రాతృ సమానుల
గొంతు కోతలతో
సతమత మౌ
తలాల యందున
విలువౌ ప్రాణంబే
కుదువగ బెట్టి
శాంతి దూతా!
శక్తి ప్రదాతా!!

— "శ్రీ రామారాజ్"

'ప్రాభవమెడలిన భారతరమణి'

కొనకళ్ల వెంకటరత్నం

పడకటింటి సమాధి గోడలపై
ప్రాణమున్న చిత్తరువుగ నిలిపి
ప్రణయరాజ్య రాజ్ఞీత్వము మాత్రము
ప్రసాదించి ప్రమోల పెరా కరిల్లిన
పురుషత్వానికి వరదాయినివై
పరదా నీడలలో బందీగా
తరతరాలనించీ తలవంచీ
ప్రాభవ మెడలిన,
భారత రమణీ !

పుక్కిటి పురాణ గాథలలో
ముంచెత్తిన చిత్తడి మురుగుకాల్వలో
కర్మసూత్రాలు కట్టిన ముడిలో
ధర్మశాస్త్రాల పుటల క్రంతలో
కలాలు, కత్తులు, కమండలములూ
కాలానికి ముందెపుడో నీపై
కలిసి వొకటిగా పన్నిన కుట్రలు
చిలవలు పలవలు వేసిన వృక్షపు
చిటారుకొమ్మల రాగిలు ఫలమా !

... ...

బానిస భారతభువిలో అంతర
బానిస రాజ్యాంగానికి తిన్నని
ప్రతినిధివై, అబలా రత్నమవై

ఏటినీటి సుడిగుండములో
ఎదురీతలీదు మొనగానికి
నున్నని
గుదిబండై
మెడ
నదికిన రాణీ !!
నెమకి నెమకి మగజాతి మర్మములు
గణించి దౌర్బల్యమెంతగలదో
అంతకు రెండింతలుగా వెంటనె
గుణించిపెట్టే కోమలమూర్తీ ! ! !
ప్రియకాంతవనీ
గృహలక్ష్మి వని
'కరణేషు దాసి
కార్యేషు మంత్రివని'
రకరకాల రంగుల సులోచనా
లదికిన కళ్ళకు పాఠముచెప్పి
అజ్ఞానాంధ తమస్సులలో ని
న్ననవరతము నిద్రల జోకొట్టి
యుగయుగాల సంకెళ్ళ బిగింపుల
రగిలిన యూర్పుల నీబ్రతుకీడ్చిన
పూరుష దౌర్జన్యానికి
పేరుకొన్న స్వార్థానికి
నీ ప్రయత్నమే లేని
నీకే తెలియని సరణిని
రూపొందిన
శాపానివి

అన్నమిన్న నెన్నిమెట్లు క్రిందుగ
అణచిపెట్టగల ప్రజ్ఞలమరితే
నాగరికత కన్నిమెట్లు పైను
న్నామని మురిసే మగరాయళ్ళకు
అర్థాంగీ మణితో సమానమగు
నధఃపతనమే సిద్ధించింది.
పూరుష కార్కశ్యానికి తావక
మార్దవగుణ సమ్మేళనచే నొక
సామరస్యమును ఘటింప
సంకల్పించిన ప్రకృతికి
పరాజయము కలిపిస్తే
ప్రతీకారమది మానదు

విలునంబులుగా
వేటక త్తిగా
తొలుత లీలగా వెలువడి నేటి

క్రమ క్రమంగా మారి
కటుత్వమున గడిదేరి
భగ్గున
తుపాకిమందై
ఫిరంగిగుండై
పొదుకొన్న రాక్షసాంశ చాలక
విదాహమెత్తిన పిశాచి వోలిక
మానవుడొక పరమాణువు బాంబై
మలచుకొన్నాడు రూపు
మీగడ తరకల లోపల
మెదిపిన నీ జాలిగుండె
స్పందించే స్వర్లోకపు

సరిహద్దుల కావలగా
అలజడి కలిపించుకొని
ఆందోళనలో మునిగాం.
పేలీ పేలీల్మని అగ్నికుండములు
ప్రేలే దిక్కుకు పయనిస్తున్నె
బిలబిలమంటూ పరుగులు పెట్టే
శివమెత్తిన యీ ప్రజాశక్తులు
అమృత కలశితో నెదురై
అదల్చి దారికి మరల్చి
నీచూపులు తోరణములు కట్టిన
నీడల నిల్పి సుశిక్షణ లిచ్చి
నిర్మలాధ్వముల నడుపుట
నీ ధర్మము తల్లీ.

... ...

నరజాతి శిరస్సీమల తాండవ
నాట్యమాడు అధికారముద్రలో
నీ ప్రవిమల హస్తాంగుళి
నితాంత కోమలస్పర్శ.
లేక నే
ఒక్క లిప్తలో
పురుషసింహులు లరదమును
కొండకొమ్ము వేటవాలులో నొక
కొలికికి తెస్తున్నారు.
అర్ధాకలితో బిడ్డలనుంచి
అతిధికి పరమాన్నము తినిపించే
అమర సాంప్రదాయము కద నీది.

గడప మోసాల
కడుపు చిచ్చులో
కాలే కరిగే
మూల్గులలోనా
సంపత్తులు గిరిగీచిన మూఢో
అంతస్తున అనగిపెనగి మాటున
జిలుగు నేత చిగురాకులలో రా
చిలుకనై ఒదిగిపోదునటమ్మా
విడాకులకనీ వితంతువుల
చెర విడిపింపులకని
సంకెళ్లకు పై ధూళి విదిల్చే
సన్నాహంలో మరచితివమ్మా
తెగిన రెక్క లెటు దుసికిల్లినవో
తేరుకొన్న కళ్ళింకా కనవు.
ఉగ్గుపాలతో వీరోచితకథ
లూకొట్టించే ప్రౌఢిమ నీది
క్రూరత్వ మెదో
శూరత్వ మెదో
చీల్చిచూపగల దృక్కులు నీవి.
నిదురించే
నీ శక్తుల
నూలుకొల్పి
మేలుకొల్పి
భవిష్యమును వొడిలోనికి తీసి
పసిపాపనివలె
లాలించాలి
పాలించాలి

రా తల్లీ!
రా యిటకు.

పొరుగింటివాని కండల నొలిచి
కొరికితినే నరయజ్ఞవాటికి
మతముపేర విమతత్వము నెత్తుటి
వసంతాలు జల్లుకునే చోటికి

... .

ఏ జాతి చైతన్యరేఖ
నీ చేయి మలచునో
నిను చుట్టి మలగునో
ఆ జాతి భవితవ్యమంతా
మెరుగు పూబల్లకీ '
మెరిసేటి బాట
మెరుపుతీగ విపంచి
మొరసేటి పాట
మేలుకో మేలుకో
మా కంటిపాప!!
మేలుకో మేలుకో
మా యింటి వేల్పు!!!

విషాదభారత యితివృత్తం

ప్రతిపాటి

ప్రతిచోటా ఆనాడు ప్రతిధ్వనించె మరణఘోష;
ప్రతివాడూ ఆనాడు పలవరించు మతోన్మాది;
దుర్దిన మయ్యది:
బాకుల వారపిడిలో బ్రతుకువిడిచె ప్రజాశాంతి;
చెలరేగిన క్రోధంలో చెడెను మానవుని మనస్సు;
మరచె నరునే నరుడు
కరచిన మతసర్పవిషంతో;
శాంతి, ప్రేమ జారవిడిచి చేయెత్తును సోదరహత్యకు;
ప్రతిచోటా ద్వేషము పెల్లుబికెను భుగ్గునగా;
కాళరాత్రిగర్భంలో కలసిపోయె జీవితాశ;
తల్లి చనుబాలకు యేడ్చిన పిల్ల పెదవి రక్తమయం—
నిద్రచెడిన వృద్ధు ముందు నిలిచి పిలిచె కాటికాపు—
హాయని విలపించెను నాథుని వట్టి పడకపై బడి సతి—
మార్మోగెను విశ్వమంత మానవతి దిక్కులేని రోదకు—
చల్లారిన నెత్తురు వీధుల చలిముద్దగ మారెను—
పసిడిరంగు సూర్యకాంతి పైబడి జాలిగ యేడ్చుచు
కార్చెను తుహినజల కవోష్ణధార—
రెండువందలేండ్ల బానిసత రగిలించెను జాతికి చితి!
మాసిపోవునె యీ మచ్చ మానవుడున్నంతవరకు!
"ఎక్కడిదా గుర్రపుగిట్టల చప్పుడు,
ఎక్కడిదా చురకత్తుల రాపిడి సవ్వడి?
ఎందులకీ గృహదహనం, ఎన్నటిదీ ఘోరకాండ?"
అన్న తల్లి వసుంధరయె అణగి మునిగె నెత్తుటిలో;

మానవజగత్తు మారెను మతిలేని కసాయిశాలగ,
మంచి రాతిబండగ మారెను మనిషిగుండె దయతెలియక!
నిటికెలోన ఫెరీల్మను పాడు బాంబుప్రేలుళ్లు!
త్రుటిలో నాకసమునంటి పడే అగ్నిహోత్రుని నాలుకలు!
యమలోకం లేదు వేరె, యములవాళ్లు నరులండోయ్!
పగ పొగగా పైకెదిగెను.
క్రోధం వ్యాపించె కొండనీడలాగా ఒకే ప్రక్క:
ఈ పొగలో, ఈ రొదలో, వినిపించునె నరుని పిలుపు?
దారుణ మానవహత్యల నెన్నో
దాచుకొంది ధర తన గర్భంలో!
పసిపాపల సమిధలగా, వనితల నాజ్యంగా
వ్రేల్చిన హోమగుండపుగాధలు చరిత్రకే కొత్త మునుపు
జలియన్‌వాలాబాగున సమసిన జనులంతా మనవారలె
హిందూ-ముస్లిం లెవ్వరు లేరా వీరకోటిలో ఆనాడు
దేశోన్నతికి పోరే ఆస లేనినాడే
దేశవిచ్ఛిత్తి యీ రీతిగ జరుగునేమొ?
రెండు దశాబ్దాలైన నిండలేదు నిండుగా
రావినదీతీరాన వ్రాసుకొన్న జీవప్రతిన!
నిర్మల హిమవన్నగశిఖరి ధవళసీరముతో చేసిన బాసలు:
'అమ్మా! నీ స్వేచ్ఛకు ఆయువు నర్పిస్తాం!
అమ్మా! నీ కట్టు త్రాళ్లద్రెంచ అందర మొకటవుతాం!'
మరువలేక కాబోలు ఆ మాటలు నేడుకూడ,
'రావి' తన కంటినీరు రాల్చె వెల్లువగా.
ఎక్కడ జాతికి మేల్కొలుపులు పాడిరో,
అక్కడె పట్టిరి మంగళహారతి!
ఎక్కడ హృదయగీతు లాలపించిరో,
అక్కడె మరణవాద్యమ్ములు మ్రోసిరి!

ఐదునదులు చీల్చిన తమ అశ్రువులను కలిపి పారె!
ఐదు ప్రాణాలున్న నరుడు ఐక్యముగా కోరుని నరికె!
పరులు పెట్టిన విసపుపాదు పెరిగి చాచె చావుతీగె!
బరుల కంటిలోన తల్లి వున్నతి చెడి విలపించెను!
పోయెను పేరూరులు, జారెను మానవుని నీతి దయలు!
మిగిలినదేమున్నది యిక? మృత్యువు గర్జాఘోష!
మిగిలినదేమున్నది యిక? మానవుల శవాల కంపు!
మిగిలినదేమున్నది యిక? చరిత్రపు విచిత్రపుదారులు!
మిగిలినదేమున్నది యిక? మొండిశిఖండి ఆశ!
ఇది నా విషాద భారత యితివృత్తం—
రెండు శతాబ్దాల పరపాలనఫలం—
బుద్ధదేవుని నట్టింటనె బుగ్గిపెట్టె మతంమారి!
కష్టించే మాబోంట్లకీ కాట్లాటలెందుకు బాబూ?
తాతల తాతలనుండీ త్రవ్వి నాటి పండించిరి,
కొండల బండల విరచీ, ఎడార్ల యిసుకను తడిపీ,
అన్నీ మా శ్రమతో దున్నీ, పైరులు పెంచితిమిట!
అడుగడుగూ మా చెమటతో,
మడుగై తడిసిన దిట.
పుట్టిన మా నేలలోనె గిట్టే రాతలు లేవో?
చెల్లిపోయె ఋణం ఈ చేలకు, నేలకు, నేటితో!
మళ్లీ జన్మలోనైనా, మాకివి దక్కునో, దక్కవో?"
భావితరాలీ రాక్షసవృత్తం విని బావురుమని యేడ్చెదరో?
వర్తమాన మహోన్నతికి కర్తలు వగచివగచి కృశియించెదరో?
ఒకరి నొకరు దోచుకునే వర్గదౌష్ట్య నీచనీతి
చాలింకని వేలకొలది చచ్చిన జీవాలరిచెను!
జీవించిన మానవులారా! కర్తవ్యం గమనిస్తారా !

అభ్యుదయ రచయితల బాధ్యతలు

కొడవటిగంటి కుటుంబరావు

1. కళలూ : అభ్యుదయకళలూ.

అభ్యుదయ ఉద్యమంతోపాటు కళాసాధనకూడా సాగించటం అభ్యుదయ రచయితల విధి. కొందరు అభ్యుదయ రచయితలు అభ్యుదయోద్యమాన్ని మాత్రమే పాటించి కళానిర్వచనాలను ఉపేక్షిస్తున్నారు. మరికొందరు కళానిర్వచనాలద్వారా అభ్యుదయోద్యమాన్ని చూడటానికి ప్రయత్నించి, రెంటికీ సమన్వయం లేనట్టూ, ఏదో ప్రత్యేక ప్రచారానికి గాను కళ అభ్యుదయ రచయితల చేత దుర్వినియోగ పరచబడుతున్నట్టూ అపోహ పడుతున్నారు.

కళానిర్వచనాలు వేరే ఉన్నాయి. ఆ నిర్వచనాలలో అభ్యుదయ బీజాలు దొరుకుతాయని భ్రమపడవద్దు. కళలన్నీ అభ్యుదయకరమైనవి కాకపోవచ్చు. కాని, కళలను అభ్యుదయానికి వినియోగ పరచటం మహ అభ్యుదయ రచయితల ఆశయం. అందుచేత రెండు విషయాలు మనం పాటిస్తాం: కళ కాని దానికి మనం కళార్హత ఇవ్వం; కళార్హత ఉన్నప్పటికీ సాంఘికాభ్యుదయానికి పాటుపడనట్టయితే వాన్ని మనం ఆదరించం.

మనకు ముందు వారు కొందరు కళాదృష్టితో తృప్తిపడ్డట్టు కనిపించారే? మనం అభ్యుదయ దృష్టి, కళల నెందుకు జోడించవలసి వచ్చింది? ఈ ప్రశ్నకు మనం సమాధానం చెప్పగలిగి ఉండాలి.

కళాసాధన గాలిలో జరగదు: అది సాంఘిక వాతావరణంలోనే జరగాలి. అభ్యుదయ నిరోధకులీ సత్యాన్ని ఒప్పుకోరు. ఇటీవలి వరకూ వీరు కళ ఒక పరమార్థమనే నిరర్థకవాదాన్ని తప్పెట వేశారు. అది వారి తప్పుకాదు. అంతులేని విలవగలది అనటానికి అమూల్యమైనది అంటూ ఉండటం

పరిపాటిగా ఉండే సంస్కారంలో వారు పెరిగారు. నిరర్థక జీవులైన ధనికవర్గం వారినీ, దిష్టిబొమ్మల్లాంటి ప్రభువుల్నీ సంఘంలో గొప్ప వ్యక్తులుగా పరిగణించిన సాంఘిక సంస్కారంలో వారు పెరిగారు కాని, ఇప్పుడిప్పుడు వారీ వాదాన్ని ఉపసంహరించుకొని కొత్త పంథాలు తొక్కుతున్నారు ...రీ విధంగా వాదిస్తారు, కళయొక్క ...యోజనం ఏమిటి? మనసుకు ...నందాన్ని వ్వటం, మనిషి బుర్రలో ...డే కుళ్ళునూ, నరాల కాలు ...న్నీ కడిగివెయ్యటం, బుదికి ...వచనీయమైనఆనందంఇవ్వటం ... కంటె కళకు ప్రయోజనం ...

...ళకు ప్రయోజనం ఉందని ...మ వీరామోదిస్తున్నారు. ఈ ప్రయోజనం వ్యక్తిగత ...ది సాంఘికమైనది కాదు. ...ప సాధించే వాడు వ్యక్తి. ...న్ని అనుభవించే వాళ్ళుకూడా ...క్తులే. అందుచేత వీరు కళాప్రయోజనాన్ని దాటి మాట్లాడరు. ...ని, కళాసాధకుడూ కళాస్వాద...డూ కూడా ఒకే సంఘంలోనే ఉన్నారు. వీరికున్న పరస్పరసంబంధం కళ ఒక్కటే గాదు; సామాజిక సంబంధం కూడా వారి మధ్య వున్నది. అందుచేతనే అభ్యుదయ కళల విలువను మనం గుర్తించుతున్నాం.

అభ్యుదయ సాహిత్యం అనగానే అభ్యుదయ నిరోధకులు ప్రచారం అనే సాకు చెబుతారు. అందుచేత కేవలమూ గానకళ తీసుకుందాం. గాయకుడు కేవలమూ కళాసాధకుడుగా పాట కచ్చేరీలు చేసినంత కాలమూ అతనిలోగాని, అతని పాట వినే శ్రోతలలోగాని, సమగ్రమైన కళా సంతృప్తి వుండదు. ఇది ఊహాకల్పితమైన విషయం కాదు. మంచి గాయకులై వుండి, వ్యక్తిగతంగా శ్రోతలకు ఎంతో సంతృప్తి ఇవ్వగలిగి ఉండి, గానకళను గురించి సమగ్రమైన ఆసక్తి లేక ఏదో అసంతృప్తితో వుండే గాయకులున్నారు. యీ గాయకులకూ ఈ శ్రోతలకూ సామాజికసంబంధం ఏమాత్రం ఉండినా వీరు ఆరాధించే కళ శ్రోతలలో ఎంతో చైతన్యం తీసుకురాగలిగి ఉండును

సుబ్బులక్ష్మి వంటి గాయనీమణి సంగీతకళను శ్రోతల కెంత అందించినారాసి చైతన్యం ఒక భారతియార్ పదం పాడగానే పుట్టుకు రావటం మనలో చాలామంది ప్రత్యక్షంగా చూశాం. ఆ మాట అంటే కళావాదులు భారతియార్ పదానికీ సంగీతకళకూ ఏమిటి సంబంధం అంటారు. అప్పుడు మనం త్యాగరాజు కృతికీ గానకళకూ సంబంధ మేమిటని తిరిగి అడుగుతాం. కాని అసలు విషయ మేమిటంటే, సంగీతం వెంట సాంఘిక బాంధవ్యంకూడా ఏర్పడగానే కళాసాధకుడికీ, కళాస్వాదకుడికీ కూడా కళారక్తి పెరుగుతున్నది. ఈ సంబంధం పాటతాలూకు సాహిత్యం ద్వారానే కలగాలని లేదు. కేవలమూ నాదంద్వారానే కలగవచ్చు. అభ్యుదయదృష్టిలేని గాయకుడు తనముందు కూర్చున్న వారిలో జరీమడత ఉత్తరీయాల వాళ్లను చూస్తాడుగాని, ఎనిమిది గంటలు శ్రమించి వచ్చినవారిని చూడడు. అభ్యుదయ దృష్టిగల గాయకుడైతే ఒక వెయ్యిమంది శ్రామికులుగాని, స్వాతంత్ర్యసైనికులుగాని తనముందు కూర్చుంటే వారికోరకు ఏవిధంగా నాదోపాసన చెయ్యవలసిందీ సులభంగా నిర్ణయించుకోగలడు. అటువంటి అభ్యుదయ గాయకుడు ఈ నాటి పాటకచేరీవాళ్లకన్న కళను ఒక మెట్టుపైకి తీసుకుపోగలడని అభ్యుదయ కళావాదులం గుర్తించుతున్నాం.

2. అభ్యుదయ రచయితల బాధ్యతలు.

మన సంఘంలో గాలిసావ చేసే pure artists ఉన్నార[illegible] కేవలమూ కళాసాధనతోటే వా[illegible] సమగ్రమైనఆనందం తాము పొ[illegible] ఇతరుల కిస్తున్నారనీ అభ్యుద[illegible] నిరోధకులు వాదిస్తారు. అటువ[illegible] కళాసాధకులలో సాంఘిక చైత[illegible] రాలేదని మనం వారికి సమాధా[illegible] చెబుతాం. ప్రజలను ఉ[illegible]వ మీాద తీసుకుంటే ఇటువంటి p[illegible] artsతో వారు ఒక్క నాటికి ఉ[illegible] పడరని కూడా మనం చెబుత[illegible]

అభ్యుదయ రచయితల[illegible] మనకు కళారాధకులకుండే బా[illegible] తలన్నీ ఉన్నాయి.

కళారాధకులలో సాంఘిక[illegible] న్యం కలిగించటం మనవిధి. జీవి[illegible]

ప్రమాదభూయిష్ఠం కాదనీ, జీవితానుభవం వెనక కొన్ని సూత్రాలున్నాయనీ, వాటి సహాయంతో జీవితాన్ని అభ్యుదయమార్గాన నడిపించవచ్చుననీ మనరచనలద్వారా మనం చాటాలి. జీవితాన్ని అధోగతికి లాగే శక్తులను అవకాశం దొరికినప్పుడల్లా ప్రతిఘటించి వాటికి సమాజంలో నిలవ నీడ లేకుండా చెయ్యటానికి మనలో ఉన్న సర్వకళా శక్తులనూ ధారాళంగా ఉపయోగించటం మన విధి. జీవిత పరిణామంలో ప్రజాహితానికి అనుకూలంగా పాటుపడే అన్ని సాధనాలనూ గుర్తించి, వాటిని బలపరుస్తూ, వాటికి విజయం చేకూర్చుతూ, మనకళను ముందుకు నడపటం మన విధి. సంఘవిద్రోహశక్తులతో నీనాడు శ్రామికులూ, శక్తిహీనులూ విజయవంతంగా పోరుతున్నారు. వారిశక్తులను ఇందుకుగాను అపూర్వంగా కేంద్రీకరిస్తున్నారు. ఈ ప్రజలనుఒకప్పుడు వాడిచూపులతో పాలించిన విద్రోహకు లీనాడు మర ఫిరంగులను పైకి తీస్తున్నారు. ఈ ప్రజాశక్తులను బలపరచటమూ, వీరి అసామాన్య శౌర్యపరాక్రమాలను గుర్తించి కీర్తించటమూ మనవిధి.

మన హక్కులనుకూడా మనం గట్టిగా అమలు పరచాలి. మనం సంస్కారరీత్యా సంఘానికి ముందున్నవాళ్ళం. జీవితాన్నీ, జీవితం యొక్క అంగాలనూ సూక్ష్మంగా పరిశీలించి విమర్శించటానికి మనకు హక్కున్నది. రాజకీయపక్షాలూ, పెట్టుబడిదారీలూ, అంతర్జాతీయ కుట్రలూ మనకన్న చిన్నవి. వీటిని మించి మనం పెరగాలి. వ్యక్తిగతంగా కాకపోయినా, మన సంఘం ద్వారా మన అభ్యుదయ రచయితలం ప్రతి సామాజిక సంఘటనను గురించీ తీవ్రంగానూ, న్యాయంగానూ విమర్శించగలిగి ఉండాలి. మనం పదవీ వ్యామోహితులం కాము. రాజకీయాలను విమర్శించటంలో మనకు సంఘక్షేమం తప్ప మనకు వేరే ఆశయాలు లేవు. ఈ దృష్టితో రాజకీయసంఘటనలను గురించి విమర్శించేటందుకు మనకు హక్కున్నది.

3. అంతరాయాలు, ఆటంకాలు

ప్రస్తుతం మనకు అనేక ప్రతిబంధకాలున్నాయి. ఒక బుర్రకథ

గాని, ఒక సినిమా చిత్రంగాని ప్రజలలోకి వెళ్ళినట్టుగా మన రచనలు ప్రజలలోకి వెళ్ళే పరిస్థితి ఇంకా ఏర్పడలేదు. నాటకాలు తప్పిస్తే మన ఇతర రచనలు ప్రజల కందే అవకాశాలు చాలా తక్కువ. దేశంలోఉన్న నిరక్షరతే దీనికి ముఖ్యకారణం.

అదీకాక; ఒక తెలిసినవాడు చెప్పినట్టు, సోషలిస్టు వ్యవస్థలో తప్ప మరే ఇతర వ్యవస్థలోనూ కళాసాధకుడికీ, కళాస్వాదకుడికీ కొంత ఎడంఉండి తీరుతుంది. ఈ ఎడంకూడా మనని ప్రజాసామాన్యానికి అందకుండా చేస్తుంది.

మన ఉద్యమం నేటివరకూ చెప్పుకోతగిన విజయం సాధించలేదు. అభ్యుదయ సాహిత్యకళ ఏపాటి విజయం సాధించి ఉండినా గాలిసాము సాహిత్యం వెనుకపడి ఉండేదే. కాని అది ఇంకా అంతరించక పోవటంబట్టి మనం విజయాం సాధించలేదని తెలుసుకోవచ్చు. అయితే మన ప్రయత్నం పూర్తిగా విఫలం కాలేదు. దానికి దాఖలా ఏమంటే, మన సంఘంలోలేని రచయితలు ఇతర పత్రికలలో అప్పుడప్పుడూ అభ్యుదయ రచనలు ప్రకటిస్తున్నారు. ఈ రచనలనూ, రచయితలనూ మనం గుర్తించాలి. సరిఅయిన విమర్శనా దృష్టితో వర్తమాన సాహిత్యాన్ని అవలోకిస్తున్నట్టయితే మనం అభ్యుదయ రచనల ప్రభావం పెంచగలుగుతాం; అన్ని పత్రికలూ అభ్యుదయ దృష్టి కొంతవరకైనా అలవరచుకునేటట్టు చెయ్యగలుగుతాం.

మనకు విమర్శ తగుమాత్రం లేకపోవటంకూడా ప్రతిబంధకంగానే ఉంది. ఆత్మ విమర్శ అభ్యుదయ రచయితయొక్క ఉత్తమోత్తమ సాధనం. దాని ద్వారానే మనం మన లోపాలు దిద్దుకోగలుగుతాం. ప్రచురణే పరమార్థమనుకోకుండా మనం మన రచనల ద్వారా సాంఘికాభ్యుదయం సాధించాలంటే మన రచనలు ప్రజలలోకి ఎంతవరకు వెళ్ళుతున్నదీ, ప్రజలమీద వీటి ప్రభావం ఏవిధంగా వుంటున్నదీ తెలుసుకోక తప్పదు. ఇది విమర్శ ద్వారానే సాధ్యమవుతుంది.

4. కొన్ని అపోహాలు

ఒకవంక ప్రజలమీద, మరో వంక సాహిత్య స్రష్టలమీదా కూడా అభ్యుదయోద్యమ ప్రభావం క్రమంగా పెరుగుతూ రావాలి. మన సంఘంలోకి వచ్చిన వారిలోనే కొంత సంస్కారం అభివృద్ధి కావాలి. మన కెడంగా ఉన్న రచయితలకు కొన్ని అపోహ లున్నాయి. వాటిని పోగొట్టే బాధ్యత మనమీద ఉన్నది,

సాహిత్య స్వరూపాల్లో పాటా, గీతమూ, కథా, నవలా, నాటకమూ ఉన్నట్లుగానే అభ్యుదయ రచన కూడా ఒక రచన విశేష మని చాలామంది అపోహ పడుతున్నారు. అభ్యుదయ రచన అన్నట్టయితే అందులో కళాదృష్టీ, శిల్పనైపుణ్యమూ అవసరం లేదనీ, శ్రామికవర్గం గురించి రాస్తేనే అది అభ్యుదయ రచన అనీ; శ్రామిక వర్గాన్ని గురించి రాస్తే ఎట్లా రాసినా అభ్యుదయ రచనేననీ రకరకాల అపోహాలు రచయితలలో ఉన్నట్టు కనిపిస్తుంది. ఈ అపోహాలు ఎవరు ఏకారణంచేత కల్పించినవైనా వాటిని పోగొట్టటంమన విధి.

సామాన్య రచయితకు బోలెడంత స్వాతంత్ర్యం ఉందనీ, మామూలు రచయిత దేన్ని గురించి అయినా రాయవచ్చు ననీ, అభ్యుదయ రచయితకు అటువంటి స్వాతంత్ర్యం లేదనీ అనేకమందికి ఒక అభిప్రాయం ఉంది. దీన్ని అపోహ అని మనం కొట్టివేయ వలసిన అవసరం లేదు. కాని ఆటువంటి స్వేచ్ఛా ప్రియత్వాన్ని మనం ప్రతిఘటించాలి. తన రచననుగురించి అసమర్థుడైన పత్రికాసంపాదకుడి నిర్ణయాన్ని ఆమోదించే రచయిత. తన స్వాతంత్ర్యాన్నిచూసి మురుస్తాడు. డబ్బుకోసం పత్రికాధిపతి కోరినటువంటి రచనను సవినయంగా రాసే రచయిత తనకు స్వాతంత్ర్యం లేదని గుర్తించడు. ఎవరికీ అక్కర్లేని రచనలూ, తనకే పూర్తి ఉత్సాహంలేకుండా రాసే రచనలూ చేస్తూ రచయిత తాను స్వేచ్ఛాజీవి ననుకుంటాడు. కాని ఆ రచయితే జనసామాన్యానికి ఉపకరించే రచనలు, సంఘంమీద

ప్రభావాన్ని చూపే రచనలు రాయమని మనం కోరగానే తన స్వేచ్ఛ యావత్తూ అంతరించి నష్టుగా బాధపడతాడు, తనచేత కూలీలపాటలూ, కర్షకుల కథలూ రాయిస్తున్నారని బెంగపడతాడు. తనను కమ్యూనిస్టులు తమ ప్రచారం కొరకు ఉపయోగించుకో చూస్తున్నారని వాపోతాడు. ప్రజలు బాగుపడాలని అన్న ప్రతి వ్యక్తీ కమ్యూనిస్టుఏజెంటు ఎందు కయిపోవాలో ఎంతఆలోచించినా నాబోటివాళ్లకు అర్థం కావటం లేదు. కమ్యూనిస్టులను బలపరచకుండా మనం అభ్యుదయం కోసం పాటుపడలేమనేది నిజంగా రూఢి అయిననాడు మనం కమ్యూనిస్టులను బలపరచటంవల్ల ప్రమాదమేమిటో అదీ అర్థం కావటంలేదు.

ఇటువంటి స్వేచ్ఛాప్రియత్వాన్ని ప్రతిఘటించటం మనవిధి. ఇది కేవలమూ బాధ్యతారాహిత్యం లోనూ, అరాచక వాదంలోనూ పుట్టిన స్వాతంత్ర్యప్రియత్వంగాని, నిజమైన స్వేచ్ఛాప్రియత్వం కాదు.

జీవితం వేడెక్కింది. ప్రజలు మేల్కొన్నారు. కాని మన రచయితలమూ, కళాకారులమూ ఇంకా నిద్రమత్తులో ఉన్నాం. ఈ జడత్వం వదలగొట్టుకునేటందుకు మన అభ్యుదయ రచయితలసంఘమూ, అభ్యుదయోద్యమమూ తప్ప మనకు మరో మార్గం లేదు. వీటిని సమగ్రంగా ఉపయోగించుకుని అభ్యుదయమార్గంలో మనం మరింత వేగంగా ముందుకు సాగాలి.

పదార్థము - గుణములు

డి. ఎ. ఎ. ఎస్. నారాయణరావు

మనము బహిఃప్రపంచంలో అనేక వస్తువులను చూస్తున్నాం. వానిని గురించిన జ్ఞానం మనకు మన జ్ఞానేంద్రియాల ద్వారా కలుగుతూంది. అలాగ, మన ఇంద్రియాలతో తెలిసికొన్న వస్తువుకి కొన్ని గుణాలున్నాయనుకొంటున్నాము. మాటవరసకి; ఒక కుర్చీ గురించి తెలసికొంటున్నామనుకోండి. దానికి ఒక ఆకారం ఉందనీ, మట్టి రంగు ఉందనీ, కర్రవాసన ఉందనీ, గట్టితనంఉందనీ అంటాము. అలాగ దానికి కొన్ని గుణాలు ఆపాదిస్తాము. నిజానికిఆ గుణాలుఏమిటి, అవి ఎక్కడ ఉన్నాయి, వాటిని గురించి మనం ఎలాగ తెలిసికొంటున్నాము, అని శాస్త్రపూర్వకంగా ఆలోచిద్దాం.

వస్తువులకుండే గుణాలలో రంగు ఒకగుణం. మంచిరంగు వస్తువులని చూస్తే బాగున్నాయంటాము. పెళ్లికొడుకు 'అబ్బేనల్లగా కొరివిలా ఈ అమ్మాయి బాగులేదు' అంటాడు. తెల్లరంగు అమ్మాయిని చూసి మురిసిపోతాడు. ఈ రంగు అనే దానిని ఎలాగ చూస్తున్నాము? కాంతి వస్తువుయొక్క ప్రతిబింబాన్ని కంటివెనుక రెటీనా అనే తెరమీద పడేటట్లు చెయ్యడం వలన వస్తువు అగపడుతూంది. కాంతి అంటే ఏమిటి? శక్తి. ఆశక్తి వస్తువునుండి కంటి దగ్గరకు అలలరూపంలో ప్రయాణం చేసివస్తుంది. ఆ అలలను కాంతిఅలలు అంటారు. వాటిలో వేరు వేరు పొడవులుకల అలలుంటాయి. ఒక ప్రత్యేక పొడవుకల అలలుగా కాంతి ప్రయాణం చేసి కంటిలో పడితే ఒక ప్రత్యేకరంగు అగపడుతుంది. ఇలాగ కంటిమీదపడిన కాంతిఅలల పొడవునుబట్టి వేరువేరు రంగులగపడతాయి. వస్తువులు ఆ రంగులను కలిగి ఉన్నాయని ఊహిస్తాము. అయితే నిజానికి రంగు

దేనికి ఉంది? వస్తువులోనే ఉందా? వస్తువన్నది అతిస్వల్పమైన పరమాణువుల సముదాయమని తెలిసిన విషయమే. 92 రకాల పరమాణువులతోనే వేరు వేరు వస్తువులన్నీ సృష్టింపబడ్డాయి. విద్యుత్ సముదాయములైన ఆ పరమాణువులకి రంగు, రుచి, వాసన గుణాలుండడం దురూహ్యం. రంగు వస్తువులోని పరమాణువులకీ లేదు, వస్తువునుండి ప్రయాణం చేస్తున్న కాంతి శక్తికీ లేదు. వస్తువునుండి వచ్చి కంటిని తాకిన కాంతిశక్తి అల పొడవునుబట్టి మెదడులో ఒక సంచలనకలుగుతూంది. అదేవస్తువుకి ఒక రంగు ఉందనే అభిప్రాయాన్ని మనకు కలిగిస్తూంది.

ఒక వస్తువుకి మంచి వాసన ఉందంటాము. ఇంకో వస్తువు వాసన బాగులేదని ముక్కుమూసికొంటాము. మంచి వాసన ఉన్న వస్తువుకోసం ప్రాకులాడుతాము. ఈ వాసన అనే గుణం ఎక్కడ ఉంది? దాన్ని నెలాగు గ్రహిస్తున్నాము? వస్తువునుండి కొంతఆవిరి పైకి పోతూంది. ఆ ఆవిరిలో ఆ పదార్థానికి చెందిన అణువులుంటాయి.ఆవిరినాసికారంధ్రంలో ప్రవేశించినపుడు, దానిలోని అణువులు అక్కడి జ్ఞానకణాలని ఉద్రేకింపజేస్తాయి. అప్పుడు వాసన గుణమును గ్రహిస్తాము. ఆ వస్తువున కా వాసన ఉందంటాము. అయితే ఆ గుణము వస్తువునకు అనుబంధించబడి ఉందా? లేదు. వస్తువునుండి బయటకు పోయిన దానిలో మనమా గుణాన్ని చూసేము. అది వస్తువునదేలాగయినది? అదీకాక అణువు అంటే ఎలక్ట్రాను ప్రోటానుల సమూహం కదా! అవి వట్టి విద్యుత్కణాలు. వాటికి వాసన లేదుకదా. వాటికి లేని వాసన అణువుల కెలాగు వచ్చింది? వాసనలేని అణువులు ముక్కులోని జ్ఞానకణాలని ప్రేరేపించినపుడు మెదడులో ఏవో మార్పులు వచ్చి, చైతన్యంలో వాసనజ్ఞానం కలుగుతూంది. ఐతే వాసన పదార్థంలో లేదా?మనలోనేనా ఉంది?

కొన్ని వస్తువులను స్పర్శిస్తాము. మెత్తగా నున్నగా తగులుతాయి. శరీరం జలదరిస్తుంది. చాలా బాగుంటుంది. ఇంకా ఆ వస్తువు

లనే తగలాలనిపిస్తుంది. ఇంకొన్ని వస్తువులను స్పర్శిస్తాము. గట్టిగా గరుకుగా ఉంటాయి. ఏమీ బాగుండవు; చెయ్యి వెనకకు తీసేసుకుంటాము. మొదటిరకం వస్తువులకి మెత్తదనం, రెండవ రకపు వస్తువులకి గట్టితనం అనే గుణాలని ఆపాదిస్తాము. నిజంగా ఆవస్తువులకి ఆ గుణాలున్నాయా? లేకపోతే, మనకెందుకు కటువంటి అనుభవం కలుగుతుంది? వ్రేలితో వస్తువును నొక్కుతున్నా మనుకోండి. నిజానికి మన వ్రేలు వస్తువుని తగలడమే లేదు. వస్తువు వుపరితలంలోని ఎలక్ట్రాను కణాలకీ, వ్రేలిలోని ఎలక్ట్రాను కణాలకీ మధ్య విముఖత్వబలం (Force of repulsion) ఉంటుంది. వస్తువులోని ఎలక్ట్రానులు తప్పించుకో ప్రయత్నిస్తాయి. అలా కొంత తప్పించుకో గలిగినపుడు వస్తువు మెత్తగా అగపడుతుంది. ఒకవేళ వస్తువులో ఎలక్ట్రానులు ప్రోటానులుదగ్గరదగ్గరగా బంధింపపడి ఉంటే, వ్రేలు వాటి దగ్గరకు వచ్చినపుడు అవి ఏమాత్రం తప్పించుకోలేక, వ్రేలులోని ఎలక్ట్రానులను ప్రోటానులను ఎక్కువబలంతో త్రోసివేస్తాయి. అప్పుడే వస్తువు గట్టిగా అగపడుతుంది. కనుక, గట్టితనం, మెత్తదనం అనేవి వస్తువులో వున్న గుణాలు కావు. వస్తువు ఉపరితలంలోని ఎలక్ట్రాను ప్రోటానులు మన వ్రేలిని త్రోసివేసే విముఖత్వ బలాన్ని బట్టి మనం వస్తువుకి ఆ గుణాలను ఆపాదిస్తున్నాము.

ఒక వస్తువును ఘనపదార్థమంటాము. ఇంకోదాన్ని ద్రవపదార్థమనో, వాయుపదార్థమనో అంటాము. ఇలాగ వస్తువుకి ద్రవత్వమో, ఘనత్వమో ఏదో గుణాన్ని ఆపాదిస్తాము. వస్తువులో ఆ గుణాలున్నాయా అంటే, ఉన్నాయని చెప్పడానికి లేదు. ప్రతి వస్తువులోను అణువులుంటాయి. ఒక వస్తువులోని అణువులు చాల దగ్గర దగ్గరగా ఉండి, పరస్పర విద్యుద్బలాలు కలిగిఉన్నప్పుడు, దానికి ఘనత్వం ఉందంటాము. ఆ అణువులు అంత కట్టుబాట్లతో కట్టివేయ బడక, కొంత విచ్చలవిడిగా ఉన్నప్పుడు పదార్థానికి ద్రవత్వాన్ని ఆపాదిస్తాము. అణువులు

మరీ విచ్చలవిడిగా వుండి, పరస్పర బలాలు లేకుండా ఉన్నప్పుడు దానిని వాయువు అంటాము. ఇలాగ ఆ గుణంకూడా అణువుల స్థలనిర్మాణాన్ని అణువుల కదలిక స్వేచ్ఛనుబట్టి మనం ఊహించు కొంటున్నదే.

వస్తువులలో చల్లదనము, వేడి అనే గుణాలని గ్రహిస్తూ వుంటాము. ఒక వస్తువు వేడిగా ఉంది. చెయ్యి చురుక్కుమందని వెనక్కు లాగేసుకుంటాము. ఇంకొక వస్తువు చల్లగా ఉందం టాము. ఈ వేడి చల్లదనములను సరిపోల్చడానికి ఒక మానాన్ని నిర్మించేము. వస్తువుకి తాపక్రమం (Temperature) అనే గుణాన్ని ఇస్తున్నాము. కాని యీ గుణం వస్తువుకి ఉందంటే అర్థమేమిటి? వస్తువులో అనేక అణువులుం టాయి. ఆ అణువులు నిరంతర చలనం కలిగిఉంటాయి. ఆ చలనం మూలంగా వాటికి శక్తి వుంటుంది. ఇలాగు వస్తువులోని వేరువేరు అణువుల సగటు శక్తి ఎక్కువగా ఉంటే వస్తువు వేడిగా అగపడు తుంది. అది తక్కువగా ఉంటే వస్తువు చల్లగా అగపడుతుంది. మనం వస్తువును వేడిచేస్తున్నా మంటే అందులోని అణువులు చలించే వేగం హెచ్చవుతుంది. వాటి సగటు శక్తి ఎక్కువవవు తుంది. ఇలాగ శక్తి పరిమాణంలో కలిగే హెచ్చుతగ్గులనే వేరువేరు గుణాలుగా చూస్తున్నాము. కాని నిజానికి పదార్థంలో ఆ గుణాలు లేవు.

వస్తువులు స్పందించినపుడు శబ్దం వస్తుంది. ఆ శబ్దంలో వేరు వేరు రకాలున్నాయి. శబ్దం మృదు మధురంగా రావచ్చును. లేక బండగా రావచ్చును. మనిషి గొంతుకనుండి వచ్చే శబ్దాన్నిబట్టి గొంతుకకి సన్నదనో, బండదనో ఒక గుణాన్ని అంటగడతాము. కాని ఆ గుణము గొంతుకదికాదు. శబ్దం అంటే గాలిలో కదలే అలలు. వస్తువు స్పందిస్తున్నప్పుడు గాలిలో అలలు ప్రయాణం చేస్తాయి. ఆ అలలు చెవిని తగిలి నప్పుడు, చెవిలోవుండే ఒక పొర స్పందించి, అక్కడి జ్ఞాననాడులను ప్రేరేపిస్తుంది. అప్పుడు శబ్దము విన బడుతుంది. గాలిలో ప్రయాణం

చేసిన ఆ అలలకి పొడవులో హెచ్చుతగ్గు లుండవచ్చును. తక్కువ పొడవున్నప్పుడు శబ్దము సన్నగా వినబడుతుంది. అలపొడవు ఎక్కువ అయినప్పుడు శబ్దము బండగా వినబడుతుంది. కనుక శబ్దంలో వున్నాయనుకున్న గుణాలు శబ్దంలో లేవు. వస్తువులో లేవు. గాలిలోని అలల పొడవులో హెచ్చుతగ్గులే అలాగ వివిధ గుణాలుగా కనబడుతున్నాయి.

పై విషయాలను బట్టి చూస్తే వస్తువునకే గుణాలూ లేవు. శాస్త్రజ్ఞుడు పరిశోధించే పదార్థానికి వేడిలేదు, చల్లదనము లేదు, రంగు లేదు., వాసనలేదు, మెత్తదనం లేదు, గట్టితనంలేదు. జ్ఞానేంద్రియముల ద్వారా వాటిని పరిశీలించినపుడు మాత్రం వాటికా గుణాలున్నా యనుకుంటాము. మిధ్యావాదియగు వేదాంతి యీ విషయాన్ని చాలాదూరం తీసికొని పోతాడు. ఏవస్తువు నయినా దాని గుణాలవలననేకదా తెలిసికొంటాము, వస్తువుకి వున్నాయను కొన్న గుణాలు మిధ్య అయినప్పుడు, ఇంకా వస్తువు వున్నట్లే మిటి నిదర్శన, ఆ వస్తువూ మిధ్యే అంటాడు. కనుక అతడు బహిః ప్రపంచంలో పదార్థమూ లేదు, గుణములూ లేవు అంటాడు; మనస్సే తన అమోఘమైన శక్తి వలన వస్తువుని, గుణాలని వూహించుకొంటుందంటాడు. ఇతడి సోదరుడింకొకడు కాస్త నయం. విశ్వంలో నిర్గుణమైన పదార్థం వుందనీ, మనస్సు దానికి గుణాలను ఆరోపిస్తుందనీ అంటాడు. కాని మనస్సే గుణాలని పదార్థంమీదకు ప్రసరిస్తున్నప్పుడు కొన్ని పదార్థాలమీదకు పాడు గుణాలను, కొన్నింటిమీదకు మంచిగుణాలను ప్రసరించడ మెందుకు? ఎదురుగా ఉన్న మనిషి గొంతుకకి బొంగురుతనానికి బదులు తీయదనాన్నెందుకు ఆపాదించకూడదు? నల్లగా అగపడుతున్న పెళ్లాం శరీరానికి బంగారుఛాయ యెందుకు ఆపాదించిమురిసి పోకూడదు? కనుక పదార్థంలో గుణం అగపడకపోయినా, గుణం మధ్య మనస్సే గుణాలను పదార్థాలకి ఆపాదిస్తుందని చెప్పరాదు. ఒక్కొక్క వస్తువు తనకు ప్రత్యేక

మైన గుణాలను ఆపాదింప చేసు కొనే గుణం కలిగి ఉంది. వస్తువు యొక్క యదార్థతను, వస్తువుకి సంబంధించిన గుణాల యదార్థతను మాటలలో త్రోసివేయడానికి ప్రయత్నించవచ్చును. కాని అనుభవంలో త్రోసివేయడం అసంభవము. మనము గ్రహిస్తున్నట్లుగా గుణాలు పదార్థంలో కూర్చుని ఉండకపోయినా, పదార్థము చైతన్యముల (consciousness), అంతర్ ప్రవృత్తి (inter action)లో అవి ఉద్భవిస్తున్నా యనుకోడం సబబుగా ఉంటుంది. అలాగ ఉద్భవించిన గుణాలే మనస్సు మీద ప్రాబల్యం కలిగి ఉంటూ, మానవుని ఉద్రూతలూగిస్తాయి.

మనస్సు పదార్థానికి గుణాలను ఆరోపిస్తుందనడం అసమంజసం. పదార్థానికి గుణాలను ఆరోపింప చేసుకొనేగుణం, గుణాలనుచూపే గుణం ఉండడం యదార్థం.

★

" కళాకారులు మానవ
హృదయ నిర్మాతలు "

— స్టాలిన్

★

అభిముఖీకరణము

అ. నరసింహశర్మ

కవి లోకాన్ని విమర్శదృష్టితో పరిశీలిస్తాడు. అవసరమైన సందేశాన్ని లోకానికి అందజెయ్యాలని దాన్నితనకావ్యంలో పొందు పరుస్తాడు. కవియొక్క ఆ అభిప్రాయానికే భావముఅనిపేరు. "భావః కవేరభిప్రాయః ప్రబంధవ్యాపి యోస్థితః" అనిదండి నిరూపించేడు. ఇక్కడ ఒక్కవిషయం ఉంది. సామాజికులలో ఉన్నఅభిప్రాయాన్నే ఉద్దీపింప చేసేకొరకు కావ్యం రచించడం ఒకటి. అంటే కవి భావము సామాజికభావము ఒకటే అవుతాయి. అప్పుడు కావ్యము సామాజికులలో ఉన్న భావాన్నే దృఢపరచడం ఉద్దీపింపజేయడం జరుగుతుంది. రెండవ పద్ధతి ఇంతకంటే ప్రతిభాసాధ్యమైనది. సామాజికులహృదయాలకందని భావాన్ని కవిగ్రహించి కావ్యంద్వారా సామాజికులకు అందచేస్తాడు. ఈ విషయంలో కవికి ప్రతిభేకాకుండా లోకజ్ఞత కూడా తోడుపడుతుంది. ఇలాటి సమయాలలో కవి తనఅభిప్రాయం ఏ ఏవర్గాలకు చెందినజనంలో ప్రచారంకావాలి ? అన్నవిషయం గుర్తించాలి. తరువాత తాను ఏ ప్రజానీకానికి బోధింప తలుచుకొన్నాడో వారిమనస్సులుఎటు వంటివి? వానికి సహజంగా ఉన్న భావపరంపర ఎట్టిది? తానుచెప్పదలచినభావానికీ, వారిసహజభావాలకీ ఎక్కడ ఏపరిస్థితులలో సామ్యం ఉంది? అని గుర్తించాలి. తరువాత ఆ సన్నిహితసంబంధంగలభావాల ద్వారా సామాజిక భావాలను తన భావంవైపు మార్చుకోవాలి. ఆ విధంగా తనభావానికి సామాజికులను అభిముఖముగా చేసుకొను కళావైదగ్ధ్యమునకు అభిముఖీకరణము అనిపేరు.

ఈ విషయాన్ని ఉదాహరణతో నిరూపిస్తాను. భాగవతము భక్తి భావాన్ని సామాజికులలో కలిగించడానికి ఉద్దేశింపబడింది. వేద

పఠనా సర్వజాతులలో భక్తికలిగించాలని ఉద్దేశింపబడింది. అసగా స్త్రీ శూద్రాదులలో కృష్ణభక్తిని కలిగించడం ఈ గ్రంథానికి పరమ ప్రయోజనము. కవి స్త్రీ జాతిని పరిశీలించి వారి జీవితములలో సహజ సంపన్నమైన భావాలను సేకరించేడు. మాతృత్వం స్త్రీకి సహజం. ఆ ప్రేమను కవి చలింప చేస్తే స్త్రీ జాతి లొంగిపోతుంది అని గ్రహించాడు. కృష్ణుని శిశువుగా వర్ణించి యశోదాముఖంగా మాతృప్రేమ వృద్ధిచెందేటట్టు వర్ణించాడు. ఆ మాతృప్రేమని కృష్ణునియందు వ్యాప్తమయ్యేటట్టుచేసి దాన్ని కృష్ణభక్తిగా పరిణామింపజేశేడు. మాతృప్రేమను భక్తిగామార్చడంలో కవి చాలా వివేకాన్ని చూపినాసులభమార్గం అని గ్రహించాడు! ఇదే సన్నిహిత భావసంబంధాన్నిరగిలించి సామాజకుని తనభావంవైపుకి అభిముఖం గావించడం అన్నమాట.

ఇలాగే మాతృత్వం ఎరుగని తరుణులకు "కృష్ణునకు గోపికలకు గలప్రేమ తత్వము ప్రదర్శించి తరుణులకు సహజమైన ప్రేమను కృష్ణపరము గావించి, దాన్ని కృష్ణభక్తి యందభిముఖమయ్యేటట్టు చేసేడు.

పిల్లలకు పశులకాపులకు నావులకు దస్యులకు కృష్ణుని ఆ యా ధర్మాలతో చూపేరు.

పశువులు కాచుట చల్దులు గుడుచుట మొదలగునవి గొల్లలకు సహజమైనభావములు. కృష్ణుని వారికి ఆవిధంగా నేచూపి వారి మనస్సుని కృష్ణునియందు లగ్నమయ్యేటట్టు చేసి దాన్ని కృష్ణభక్తికభిముఖమయ్యేటట్టు కవి చేయగలిగేడు. వ్యవసాయదారుల చిత్తమును ఆకర్షించుటకు హాలిని నిర్మించేడు.

ఈ విధమైన కళావిన్యాసానికి అభిముఖీకరణము అని పేరు.

ఇందులో కవి సామాజికులను సహజమైన భావాలను తనభావానికివాటికికలసన్నిహితసంబంధాన్ని తెలుసుకుని తద్వారా సామాజికులను తనభావానికి అభిముఖంగా చేసుకోడంఒక విశిష్టతఅన్నమాట. ఇది సన్నిహితసంబంధమున్నప్పుడే సిద్ధిస్తుంది. విరుద్ధభావాదికములున్నప్పుడు ఈ విన్యాసము పనికిరాదు.

ఇందులో కవిసామాజికు ననుసరించుట తుదకు తన్నువాడను సరించు నట్లుచేయుటఅనుమెలపుప్రదర్శింప బడును. అభిముఖీకరణము అనుకళ వర్గ సాహిత్యనిర్మాణంలోను, వర్గై క్యతనాపాదించడంలోను సహజ భావాలకి దీప్తివికాసాలను కల్పించడంలోను ఉపయోగిస్తుంది.

భాగవత ప్రచారంవల్ల ఇప్పటికీ తల్లులు శిశువుని కృష్ణునిగ భావించి ఆనందించడం మొదలైనవిషయాల వల్ల మనకు ఈ విషయం ప్రత్యక్షంగా రుజువవుతూంది.

విరుద్ధభావం విపరీతభావం వ్యత్యస్త భావం అచుబింత భావం జీర్ణభావం మొదలైన వాటికి ఉత్తేజనవీకరణాదులు కల్పించేటప్పుడు భిన్నాభిన్న సాధనాలను అభిముఖీకరణసూత్రాలనుఅవలంబించాలి.

విరుద్ధ భావంగల వర్గంలో తన భావంప్రచారం అవడానికి తర్కం లేక యుద్ధము సాధనములు. వీటి ద్వారా తనభావానికి కవి విజయం వర్ణించడంవల్ల విరుద్ధ భావం కల వర్గంకూడా కవిభావాభిముఖ్యాన్ని చెందవచ్చును. కాని, ఇది మొదటి దానంత సున్నితమార్గము సులభ మార్గముకాదు. ఇలాగే జీర్ణభావం వర్ణించేటప్పుడు కవిపాత్ర ఔన్నత్యాన్ని ప్రశంసించి అది నీది అనే భావాన్ని గలిగించి నప్పుడు సామాజికుడు తనలోఉన్న సహజాహంకార ప్రేరితుడై ఉత్తేజితుడు అవుతాడు. ఇది ఉత్సాహపరచడానికి ఉపయోగించేమార్గం. ఇది ఇప్పుడు పూర్వ వీరగాథలవలన కలుగుతూంది.

ఇలాగే సామాజిక భావాల నాధారంగా చేసుకుని కవి తన వాన్ని ప్రచారంచెయ్యాలి. దానికి అభిముఖీకరణము అనిపేరు. ఇది ఉపదేశంగలసాహిత్యానికిజీవగర్ర.

సాహిత్యంలో విప్లవరీతులు

శ్రీ పాలగుమ్మి పద్మరాజు

ఇబ్సెన్ నార్వేదేశపు ప్రసిద్ధ నాటకరచయిత. షేక్స్పియర్ తరవాత నాటకరచయితగా ప్రపంచ ఖ్యాతిని పొందినది, ఈ రెండు మూడు శతాబ్దాలలోనూ, ఇబ్సెన్ ఒక్కడే. బెర్నార్డు షా వంటి మేధావులు కొందరు ఇతన్ని షేక్స్పియర్‌కంటేకూడా ప్రతిభావంతుడని అంటారు. తన జీవితకాలంలోనే మొదట తీవ్రమయిన వ్యతిరేకభావాన్ని, తరవాత అంతులేని గౌరవభావాన్ని, తన ప్రజలలో రేకెత్తించిన రచయిత ఇబ్సెన్ ఒక్కడే అనుకుంటాను. అతని మొదటి నాటకాలవల్ల ఏర్పడ్డ పరిస్థితి కారణంగా అతను స్వదేశాన్ని విడచి ఇతరదేశాలకు పోవలసి వచ్చింది. అతను చాలా కాలం ఇటలీలో వున్నాడు. ఆ కాలంలోనే అతని గొప్ప నాటకాలు వచ్చాయి. అతని ఖ్యాతి లోకం అంతా వ్యాపించింది. అన్ని నాగరక భాషలలోకి అతని నాటకాలు తర్జుమా అయాయి. అప్పుడుగాని అతని దేశప్రజలకు అతని ప్రతిభ తెలిసి రాలేదు. చివరరోజులు అతనికి చాలా సుఖంగా గడిచిపోయాయి. తన దేశప్రజలు అతన్ని తిరిగి స్వదేశానికి ఆహ్వానించారు. అతను చచ్చిపోయే నాటికి అంతపేరు ప్రఖ్యాతులు గడించిన రచయిత ఆనాటికి ఎవరూ లేరు.

అంత అంతులేని ఖ్యాతినీ అపఖ్యాతినీ అతనికి ఆ రోజుల్లో ఆర్జించినవి అతని నైతిక ధార్మిక సిద్ధాంతాలు. అతని రచనలో ఆనాడు అందరి దృష్టినీఆకర్షించినది అతని తిరుగుబాటు. తనచుట్టూ సమాజం పేర జరుగుతున్న అన్యాయాలను, ఘోరాలను తీవ్రంగా విమర్శిస్తూ అతను రెండుమూడు నాటకాలు వ్రాశాడు. అందులో ముఖ్యమయినవి-ది పిల్లర్స్ ఆఫ్ సొసైటీ-ఎన్ ఎన్మీ ఆఫ్ ది పీపుల్.

పిల్లర్స్ ఆఫ్ సొసైటీ అనే నాటకంలో ప్రధాన పాత్ర కాన్సల్ బెర్రిక్ అనే ఓడరేవులకు యజమాని ఒకడు. అతను రెండుమూడు ఘోరమైన పనులుచేసి తద్వారా డబ్బునీ, కీర్తినీ కూడా ఆర్జించాడు. అతని పాపాలకు శిక్ష అనుభవిస్తూన్న అమాయకవ్యక్తి ఒకడున్నాడు. బెర్నిక్ తన పలుకుబడి నిలబెట్టుకోడం కోసం పాడయిపోయిన ఒక ఓడని బలవంతంగా ప్రయాణంచేసి పంపిస్తాడు. ఆ ఓడ అవతలి ఒడ్డుకి చేరదని అతనికి తెలుసును. పద్దెనిమిదిమంది నావికుల ప్రాణాలు సముద్రంలో కలిసిపోతాయని తెలుసును. పైగా దీని బాధ్యతనంతనీ తనకింద పనిచేసే అధికారి ఆనే మీాద తోసేస్తాడు. చివరకి అతని పాపాలనన్నింటినీ అందరి యెదటా అతనే ఒప్పుకుంటాడు.

ఎనిమీ ఆఫ్ సొసైటీ లో స్టాక్ మన్ అనే వైద్యుడు కార్పొరేషన్ నీటి సప్లయిలో ప్రమాదకరమైన క్రిములు ఏవో ఉన్నాయని కనిపెట్టి పై అధికారులకు చెపుతాడు. ఆనీటిసప్లయి యాత్రికులస్నానాల కోసం ఉద్దేశించి నిర్మించారు. అనేకమంది ఇతరస్థలాలనించి ఆరోగ్యం కోసం ఆ నీటిలో స్నానం చెయ్యటానికి వొస్తూ వుంటారు. నిజానికి ఆ ఊరి అభివృద్ధి అంతా ఆ నీటి సప్లయి మీాద ఆధారపడి ఉంది. వైద్యుడు వ్రాసిన రిపోర్టు దాచిపెట్టి ఈ క్రిముల సంగతి పైకి తెలియకుండా ఉంచడానికి ఆఊరి అధికారులు ప్రయత్నిస్తారు. వైద్యుడు తన నిజాయితీని నిలబెట్టుకోడంకోసం వారితో యుద్ధానికి దిగుతాడు. అందులోఓడిపోతాడు. ప్రజా క్షేమం కోసం అంతగా పాటుబడ్డ అతను ఒక ప్రజా ద్రోహిగా పరిగణింపబడతాడు.

ఈ రెండు నాటకాలూ అంత ఎక్కువ ప్రఖ్యాతి సంపాదించలేదు. ఇతివృత్తం వాస్తవికంగాలేక కొంత అతిగా చిత్రించబడింది. ఈ రెంటిలోనూ సంఘంలో అన్యాయాలూ, ద్రోహాలు, అవినీతులు ఇంత స్పష్టంగా తెలిసిపోయేటంత స్ఫుటంగా జరగవు. అవి చాలా క్లిష్టంగా సూక్ష్మంగా వుంటాయి. ఏసంఘంలో నయినా దుర్మార్గుడయినవాణ్ణి తెలిసిఉండి ఎక్కువ

కాలం సహించడం జరగదు. ఈ నాటకాలలో, చక్కని ఘట్టాలు అక్కడక్కడ ఉన్నా, మొత్తం మీద పరిణితి లోపించింది. వీటికి ఎక్కువ పలుకుబడి రాకపోవ డానికి అదికూడా ఒక కారణం.

తక్కిన నాటకాలలో ఇబ్సెన్ విశాలమయిన సమస్యలు తీసుకుని నాటకాలు అల్లాడు. ఎడాల్స్ హౌస్‌లో 'పెళ్ళి' సాంసారిక జీవితంలోని అజ్ఞాతమయిన అసందర్భాలు, రాస్‌మెర్ షోలమ్‌లో కామము, నీచతృష్ణ, ఉదాత్తమయిన ప్రేమగా పరిణామం చెందడం, వైల్డ్ డక్‌లో సత్యం, అసత్యం వాటిమీద నిర్మించబడ్డ జీవితంయొక్క గతి, ఘోస్ట్స్‌లో పాపాలను కప్పిపుచ్చటానికి చేసిన ధర్మాలు, వాటి వినాశం. ఈ నాటకాలు అన్నిటిలోనూ ఏదో ఒకసర్వసాధారణమైన లక్ష్యాన్ని, అంటే ప్రజలు ఆదర్శంగా నమ్ముతున్న దాన్ని ఖండించడమే ప్రధానం. పాతివ్రత్యం ఒక ఆదర్శం. ఎడాల్స్ హవుస్‌లో నోరా చివరికి తన పాతివ్రత్యానికి నీళ్లు వదలి భర్తృగృహాన్ని వదలిపెట్టి వెళ్ళిపోతుంది. వైల్డ్ డక్‌లో ఒక సత్య హరిశ్చంద్రుడు బయలుదేరి భార్యాభర్తలమధ్య ప్రవేశించి, కేవలమూ సత్యప్రియత్వం వల్ల, వాళ్ళ కాపురాన్ని ధ్వంసం చేసేదాకా వదలడు. ఘోస్ట్స్‌లో ఒకడు విశృంఖలమయిన జీవితం గడిపి అనేకమయిన అవినీతులు ఆచరించి చచ్చిపోతాడు. అతని భార్య భర్త గౌరవాన్ని నిలబెట్టడం కోసం అతనిపేర పెద్ద ధార్మికసంస్థ ఒకటి కట్టిస్తుంది. కాని, తండ్రి పాపాలు కొడుకులో జబ్బురూపంలో తిరిగిపుట్టి కొడుకుని బలిగొంటాయి.

షా చెప్పినట్లు ఆదర్శాలను భేదించడమే ఆదర్శంగా పెట్టుకున్నాడు ఇబ్సెన్. లోకంలో ఏవో న్యాయాలుగానూ, ధర్మాలుగానూ చలామణి అవుతున్నవి న్యాయాలూ కాదు, ధర్మాలూకాదు. మామూలుగా ప్రజలు ధర్మమని విశ్వసించే ప్రతి ఆదర్శంలోనూ ఘోరమయిన అధర్మం ఇమిడివుంది. సామాజిక వ్యవస్థకు అడుగున కొన్ని అసత్యాలు పునాదులుగాఉన్నాయి.

ఆ అసత్యాలను రూపుమాపుతే గాని నిజమయిన సమాజం నిర్మాణం కాదు.

ఇబ్సెన్ చాలా మొగమాటం ఉన్న మనిషి. అతని స్నేహితులతో భేదాభిప్రాయం వచ్చినప్పుడు అతను గట్టిగా వాళ్ళతో వాదించ లేకపోయేవాడు. చివరకి తన నాటకాలను ప్రదర్శించే నటకులకు మొగమాటం విడిచి ఇది బాగా లేదని చెప్పలేకపోయేవాడు. కాని, కలం చేత పుచ్చుకున్నప్పుడు మనస్సులో ఉన్న అభిప్రాయాన్ని అంత గట్టిగానూ, అంత నిర్మొగమాటంగానూ, అంత నిశితంగానూ చెప్పగల రచయితలు ఆట్టేమంది లేరు. అతను బ్రాండిస్ అనే స్నేహితుడికి ఉత్తరం వ్రాస్తూ ఇలా వ్రాశాడు.

"స్నేహితులు కలిగి ఉండడం అనే సౌభాగ్యం చాలా వ్యయంతో కూడుకున్నది. ఏ వ్యక్తి అయినా తన జీవితసర్వస్వాన్ని ఒక విశ్వాసం కోసం, ఒక సందేశం కోసం ధార పోసినట్టయితే, అతను స్నేహితుల్ని నిలబెట్టుకోలేడు. స్నేహితుల్ని నిలబెట్టుకోడానికి చేసే వ్యయం, వారికోసం, తను చెయ్యవలసిన పనులను చెయ్యకుండా ఉండడంలో బట్టి ఉంటుంది."

ఇబ్సెన్ తన సిద్ధాంతాల కోసం ఏకాకి ఐపోయిన వ్యక్తి. వ్యక్తిగా అతను చాలా పిరికివాడు. నాటక రచయితగా అంత ధైర్య సాహసాలుగల వ్యక్తి ఇంకొకడు లేడు. వ్యక్తుల మనస్సులను నొప్పించడానికి అతను జంకేవాడు. సంఘాన్ని మాత్రం చీల్చి చెండాడడానికి ఏ మాత్రమూ జంకేవాడు కాడు. వైల్డ్ డక్‌లో అసత్యాన్ని బహిర్గతం చెయ్యడంతోటే అనేక అసందర్భాలు జరిగి అమాయకురాలైన ఒకపిల్ల ఆత్మహత్య చేసుకోడం జరుగుతుంది.

సామాజిక శాస్త్రం వైజ్ఞానిక పద్ధతిమీద నిర్మాణమయి సంఘవ్యవస్థలు ఆ శాస్త్రాన్ని అనుసరించి దిద్దబడాలిగాని, వాటికోసం కవులదగ్గరకు, రచయితల దగ్గరకు పోయి లాభంలేదు. రచయిత ఒక రకంగానే సంఘానికి సేవ చెయ్యగలడు. ఉన్న స్థితిగతులను గురించి నిజం చెప్పగలడు. అర్థంలేని ఆదర్శ శిఖరాలను నేలమట్టం చెయ్య

గలడు. ఆపని ఇబ్సెన్ చాలా సమర్థతతో నిర్వహించాడు.

ఇబ్సెన్ నాటకకర్తగా మహోన్నత స్థానాన్ని చిరకాలం ఆక్రమించి తీరుతాడు. షేక్స్పియర్ తరువాత నాటక రచనా విధానం ఒక క్రమంలేక, రకరకాలుగా నడిచింది. రచనావిధానంలో ఏదో మార్పు అవసరమని తోచినా ఏది అవసరమో మాత్రం తెలుసుకున్న నాటకకర్త ఎవరూ లేకపోయారు. ఆధునిక నాటకానికి ఒక పరిపూర్ణ స్వరూపాన్ని ఇచ్చినది ఇబ్సెన్.

అతని రచనావిధానంలో ఒక విశిష్టత ఉంది. అతని నాటకాలకు వెనక ఎంతో చరిత్ర జరిగిపోయి ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ఆ చరిత్ర తరతరాలవరకు వెనక్కు చూసుకోవలసి ఉంటుంది. నాటక ప్రారంభం ఆ చరిత్రకు అంత్యదశ. ఆ ఆఖరి సంభాషణలోనే వెనకటి చరిత్ర అంతా బహిర్గతమవుతుంది. అకస్మాత్తుగా పాత్రలు, వారి పరస్పరానుబంధాలు, మెరుపుల్లాగ మనకి వ్యక్తమవుతాయి. చకచక నాటకం నడిచి ఒక ప్రళయంతో ఆఖరు అవుతుంది. అతని రచనా విధానాన్ని గురించి ఒక విమర్శకుడు "ఇట్ఈజ్ ఎ టెక్నికాఫ్ ఫైర్ వర్క్స్" అన్నాడు. తెర వెనక టపాకాయలు, బోట్లు, తారాజువ్వలు, మతాబులు అన్నీ యథాస్థానాల్లో పేర్చి ఉంటాయి. వాటి నన్నిటినీ జాగ్రత్తగా అంటించడానికినిప్పుతాడుఅతికించిఉంటుంది తెరఎత్తిన దగ్గరనించీ అవన్నీ కాలడం పేలడం ప్రారంభిస్తాయి. అంచేతే అతను నాటకాలలో కాల నియమం చాలా తు చ. తప్పకుండా పాటిస్తాడు. ది డాల్స్ హౌస్, ఘోస్ట్స్, రాస్మర్హాలమ్. ది పిల్లర్స్ ఆఫ్ సొసైటీ, హెడ్డా గాబ్లెర్ లో నాటకంలోని సంఘటనలన్నీ ౨౪ గంటలలో పూర్తి అయిపోతాయి. యాన్ ఎనిమీ ఆఫ్ సొసైటీ, ది వైల్డ్ డక్, ది లేడీ ఫ్రం ది సీ, లో ౩౬ గంటలలో పూర్తి అయిపోతాయి.

అతని విప్లవాభిప్రాయాలను గురించి అతి తీవ్రంగా విమర్శించిన ఒక సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు, మాక్స్ మార్డన్ అనే అతను అతని రచనా సామర్థ్యాన్ని గురించి ఇలా అన్నాడు.

"ఒక ఉద్రేకాన్ని, స్పష్టంగా మాపుకి దొరకని ఒక ఆత్మయొక్క ఆవేదనను, వీటిని చిన్న పదాలలో చకచక చిత్రించడంలో ఇబ్సెన్‌కి అద్వితీయమైన ప్రతిభ ఉంది. ముక్తసరిగా చెప్పబడిన ఒక్కొక్క చిన్న మాటలోంచి తొంగిచూస్తే అంతులేని దృశ్యం మనకు కనబడుతుంది. ఆ మాటలు మానవ ప్రకృతిని చూపించడానికి చిన్న కిటికీలలాగ వినియోగపడతాయి."

నోరా తన పిల్లలతో సంభాషిస్తూ, ఆడుతూఉన్న ఒక చిన్న ఘట్టంలో ఆమె మనస్థితి అంతా స్పష్టంగా వ్యక్తీకరిస్తాడు. ఆ నాటకంలోనే డాక్టర్ రాంక్ ఒక ప్రమాదమయిన జబ్బు తనని పట్టుకుందని తను కొద్దిరోజుల్లోనే చచ్చిపోతానని నోరా, హెల్మర్లతో చెప్పిన ఘట్టం హృదయాన్ని పట్టుకుంటుంది. సంఘటనలను అంత స్పష్టంగా, అంత తీక్షణంగా చిత్రించిన నాటకకారులు చాలా కొద్దిమంది ఉన్నారు.

ఇబ్సెన్ పాత్రలను రెండు రకాలుగా విభజించవచ్చునని అగస్తె ఇయర్ హార్డ్ అనే ఫ్రెంచి విమర్శకుడు అన్నాడు. మొదటి రకం నైతిక, లేక ఆధ్యాత్మిక స్వభావం ప్రధానంగా ఉన్నవారు. రెండో రకం జంతు స్వభావం ప్రధానంగా ఉన్నవారు. మొదటిరకం పాత్రలచేత కవి తన అభిమాన సిద్ధాంతాలను పలికిస్తాడు. ఈ రెండు రకాల పాత్రలలోనూ రెండోరకం సజీవంగా వుంటారు. మొదటిరకం కవిభావాల బలంతో జీవిస్తున్నట్టుంటారు. అతను సృష్టించిన అన్ని పాత్రలలోకీ వైల్డ్ డక్‌లో గీనా చాలా సహజమైనది. ఆమెది ఆరోగ్యమయిన మనస్తత్వం. ఆదర్శాలతో సిద్ధాంతాలతో మనస్సు పాడు చేసుకోని బలమయిన వ్యక్తి. ఆమె ఒక్కతే కనబడుతుంది అతని నాటకాలలో. జాల్మర్ రాత్రి అంతా బయట గడిపి తెల్లవారి ఇంటికి వచ్చినప్పుడు అతనికీ గీనాకు జరిగిన సంభాషణ నాటకరచనలో ఒక మహాద్భుత ఘటన.

అతని నాటకాలు అన్నీ ఐరోపీయ భాషలన్నిటిలోకి తర్జుమా అయాయి. అతని ప్రతిభను మొదట గుర్తించినది ఫ్రాన్స్,

జర్మనీలు. ఆధునిక నాటకరచనకు వరవడి దిద్దినది ఇబ్సెన్. జగత్ప్రసిద్ధుడయిన బెర్నార్డ్ షా తన నాటకరచన కంతకీ ఇబ్సెన్ గురువని చెప్పుకున్నాడు.

తెలుగులోకి డాల్స్ హౌస్‌ను బొమ్మరిల్లు అనే పేరుతో శ్రీమతి మామిడిపూడి వెంకమ్మగారు అనువదించారు. ఆ నాటకాన్నే దంపతులు అనే పేరుతో రంగారావుగారు అనుకరించారు. పిల్లర్స్ ఆఫ్ సొసైటీ ఒకటి ఎవరో తర్జుమాచేసినట్టు జ్ఞాపకం. అయితే అవి అంత ప్రచారంలోకి రాలేదు.

కాని, తెలుగు రచయితల లోనూ, సంఘ సంస్కర్తల లోనూ, ఇబ్సెన్ రచనలు చదివి, వాటిద్వారా ఉత్తేజితులు కాని వారు లేరని చెప్పవచ్చు. మొట్టమొదట స్త్రీ స్వాతంత్ర్యోద్యమాన్ని లేవనెత్తినది ఆంధ్ర దేశంలో బ్రహ్మసమాజం. అందులో ముఖ్యంగా ఇబ్సెన్ రచనలు చదివి ఆవేశపూరితులయిన బ్రహ్మసామజికులు అయితే ఇబ్సెన్‌యొక్క ప్రభావం ఆధునిక ఆంధ్ర సాహిత్యంలో ఎక్కడ కనబడుతుంది అంటే, ఎత్తిచూపడం కష్టం. కాని సూక్ష్మంగా కనబడకుండా ఉండి ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా ఉండి తీరింది.


సంఘం మీద తిరుగుబాటు చేసే పద్ధతిలో ఇబ్సెన్ పద్ధతిని పోలినది గుడిపాటి వెంకటచలం గారి కథలలో కొంతకనబడుతుంది. ఆవిప్లవం ఒక ఋణపక్షంతో ఆగిపోడంలోకూడ ఇద్దరికీ పోలిక ఉంది.

ఇబ్సెన్ నాటక రచనాపద్ధతిని తెలివితో అర్థం చేసుకుని ఉపయోగించినప్పుడుగాని తెలుగులో మంచి నాటకాలయుగం ప్రారంభమయిందని అనడానికి వీలులేదు. ఆ పద్ధతిలో రకరకాల సావకాశాలున్నాయి. అందులో ముఖ్యమైన ఒక హద్దు కూడా ఉంది. రంగస్థలాన్ని ఊహించుకోకుండా నాటకాలు వ్రాయడానికి అప్పుడు వీలు వుండదు.

(ఏ. ఐ. ఆర్. అనుమతితో)

Editor, Printer & Publisher: C. Pitchayya
Secretary, Andhra Progressive Writers' Association, Governorpet,
Printed at Abhyudaya Press, Bezwada. Q. H. No. k. 3. A.

అభ్యుదయ



ప్రచురణ

శ్రీ శివాజీ చరిత్రము

రచయిత

శ్రీ కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారు

వెల: మూడు రూపాయలు

★

ప్రతులకు:

కొమర్రాజు వినాయకరావు

అభ్యుదయ ప్రెస్ :: బెజవాడ

WRAPPER PRINTED AT UNIVERSAL PRINTERS